
దర్శించండి - తరించండి
స్వయంభు శ్రీ వరసిద్ధి వినాయకస్వామి వారి దేవస్థానం
కాణిపాకం, ఐరాల (మం), చిత్తూరు జిల్లా.
సత్య ప్రమాణాలకు, ప్రత్యక్ష నిదర్శనం...
శ్రీ వరసిద్ధి వినాయక స్వామి దేవస్థానం శ్రీ స్వామి వారి
శాశ్వత అన్నదాన ట్రస్టులో భాగస్వామ్యం కండి. మీ విరాళాలను ఆన్‌లైన్‌లో కూడా పంపవచ్చు.
స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, కాణిపాకం బ్రాంచ్
A/c No. 30178925930, IFSC No. SBIN0010105
మరిన్ని వివరాలకు : 08573-281112, 281747



# వార్తాప్రభ

RNI No. APTEL/2004/12176

epaper : https://varthaprabha.com

సమగ్ర వార్తా దినపత్రిక

Circulated Telangana & Andhra Pradesh States



CORPORATE COMMERCE™
College for Practical Exposure
MEC / CEC
B.Com / BBA
Coming soon @ Ameerpet
Beside Sarathi Studios

CA. China Masthan T
www.corporatecommerce.in
94188 66666



సంపుటి : 24 | సంచిక : 63 | ది.4-5-2025 | విజయవాడ | ఆదివారం | పేజీలు : 8 | వెల : రూ.1/-


## అమరావతి పనుల పునఃప్రారంభ కార్యక్రమం విజయవంతం.. సీఎం చంద్రబాబు ధన్యవాదాలు



**అమరావతి,మే 3 (వార్తాప్రభ) :** రాజధాని అమరావతి పనుల పునః ప్రారంభ కార్యక్రమం విజయవంతంపై ప్రజలకు, ప్రభుత్వ అధికారులకు, భాగస్వామ్య పక్షాలకు సీఎం చంద్రబాబు నాయుడు ధన్యవాదాలు, అభినందనలు తెలియజేశారు. ఈ మేరకు ముఖ్యమంత్రి ఒక ప్రకటన విడుదల చేశారు. ప్రధాని నరేంద్ర మోదీ చేతుల మీదుగా జరిగిన రాజధాని అమరావతి పనుల పునః ప్రారంభ కార్యక్రమాన్ని విజయవంతం చేసిన ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు తెలుపుతున్నాను. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన ప్రజలకు, రాజధాని రైతులకు, కార్యక్రమాన్ని అద్భుతంగా నిర్వహించిన ప్రభుత్వ యంత్రాంగానికి, అధికారులకు, మంత్రులకు, ప్రజాప్రతినిధులకు, కార్యక్రమాన్ని ప్రజల్లోకి తీసుకువెళ్లిన మీడియా, సోషల్ మీడియా వారికి కృతజ్ఞతాపూర్వక నమస్కారాలు తెలియజేస్తున్నాను. ప్రజల సహకారంతో, కేంద్ర మద్దతుతో, పక్కా ప్రణాళికతో అందరికీ అవకాశాలు సృష్టించేలా, రాష్ట్రానికి చోదక శక్తిగా నిలిచేలా ఫ్యూచర్ సిటీగా రాజధాని అమరావతిని నిర్మిస్తాం. అన్ని ప్రాంతాల సమగ్ర అభివృద్ధి సాధించి, మాకు అండగా ఉన్న ప్రజల నమ్మకాన్ని నిలబెడతాం అని తెలుపుతూ ప్రతి ఒక్కరికి పేరుపేరునా ధన్యవాదాలు తెలియజేస్తున్నాను అని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు.

## రాష్ట్రం రూ.10 లక్షల కోట్ల అప్పుల భారంతో ఉంది-వైఎస్ షర్మిల



**విజయవాడ,మే 3 (వార్తాప్రభ) :** ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (ఏపీసీసీ) అధ్యక్షురాలు వైఎస్ షర్మిల, రాష్ట్ర రాజధాని అమరావతి నిర్మాణానికి నిధుల విషయంలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుపై తీవ్ర విమర్శలు చేశారు. ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ చట్టం కొత్త రాజధానిని నిర్మించే బాధ్యతను కేంద్ర ప్రభుత్వానికి స్పష్టంగా అప్పగించినప్పటికీ, నరేంద్ర మోదీ తన వాగ్దానాలను నెరవేర్చడంలో విఫలమయ్యారని ఆమె ఆరోపించారు. "మోదీ ప్రవర్తనను చూస్తే, ఆయన వాడిపోయిన బాణసంచా లాంటివారని చెప్పకుండా ఉండలేరు" అని వైఎస్ షర్మిల అన్నారు. ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ చట్టంలోని సెక్షన్ 94(3) కొత్త రాజధానికి ప్రాథమిక మౌలిక సదుపాయాలను అందించే బాధ్యతను కేంద్ర ప్రభుత్వంపై స్పష్టంగా ఉంచిందని ఆమె ఎత్తి చూపారు."కేంద్రం విధులను చట్టం స్పష్టంగా నిర్వచిస్తే, మోదీ మనకు ఏమి అందిస్తున్నారు?" అని ఆమె ప్రశ్నించారు. 2015లో రాజధాని నిర్మాణానికి ఉత్సవంగా శంకుస్థాపన చేశారని, కానీ పదేళ్ల తర్వాత, గణనీయమైన ఏదీ కార్యరూపం దాల్చలేదని వైఎస్ షర్మిల గుర్తు చేసుకున్నారు. 2015 నుండి అమరావతికి మద్దతు ఇస్తున్నట్లు చెప్పినప్పటికీ, కేంద్ర ప్రభుత్వం ఈ ప్రాజెక్టు కోసం అధికారికంగా ఒక్క రూపాయి కూడా ప్రకటించలేదని ఆమె ఆరోపించారు.అమరావతి నిర్మాణానికి అవసరమైన రూ.1 లక్ష కోట్లకు ఆర్థిక ప్రకటన చేశారా, ఏదైనా దృఢమైన హామీలు జారీ చేశారా, లేదా అమరావతికి ఏదైనా శాసన ధృవీకరణ ఇవ్వబడిందా అని కూడా ఆమె డిమాండ్ చేశారు. ప్రధాని నరేంద్ర మోదీని నమ్మి పదే పదే మోసపోయానని పేర్కొంటూ, వైఎస్ షర్మిల చంద్రబాబు నాయుడు ఆత్మపరిశీలన చేసుకోవాలని పిలుపునిచ్చారు. "ఒకప్పుడు, మీరు రాత్రిపూట గొయ్యిలో పడ్డారు. ఇప్పుడు, మీరు మళ్ళీ మోదీని ఆహ్వానించడం ద్వారా పట్టపగలు అదే గొయ్యిలో పడ్డారు" అని ఆమె ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీ తరపున ఆమె సూటిగా ప్రశ్నలు సంధించారు. అసలు నిధులను పొందే బదులు రుణాలు ఎందుకు కోరుతున్నారని అడిగారు. రాష్ట్రం రూ.10 లక్షల కోట్ల అప్పుల భారంతో ఉందని, అప్పు తీసుకోకుండా జీతాలు ఎలా చెల్లించగలరని ఆమె ప్రశ్నించారు. "అలా అయితే, రాజధాని నిర్మాణం కోసం రూ.60,000 కోట్ల రుణం కోసం మీరు ఎవరిని సంప్రదిస్తున్నారు? వడ్డీ భారాన్ని ఎలా భరిస్తారు?" అని ఆమె ప్రశ్నించారు.ప్రపంచ బ్యాంకు, ఏడీబీ, కేఎఫ్‌డబ్ల్యూ, హడ్కో వంటి ఆర్థిక సంస్థలకు రాష్ట్రాన్ని ఎందుకు తాకట్టు పెడుతున్నారో చంద్రబాబు నాయుడు వివరణ ఇవ్వాలని వైఎస్ షర్మిల డిమాండ్ చేశారు. రాజధానికి నిధులు సమకూర్చడానికి ప్రభుత్వ ఆస్తిగా తాను అభివర్ణించిన ప్రభుత్వ భూమిని అమ్మే ఆలోచనను ఆమె విమర్శించారు. "కేంద్రంపై ఒత్తిడి తెచ్చే ధైర్యం లేకుండా, భవిష్యత్ తరాల మీద రుణ భారాలను ఎందుకు మోపుతున్నారు? రాష్ట్ర ప్రజలు సమాధానాలు అర్హులు" అని ఆమె అన్నారు.

## మీరు కనీసం వారివైపు కన్నెత్తికూడా చూడకపోవడం ధర్మమేనా?: జగన్

- రైతుల కష్టాలు పట్టవా? అంటూ ప్రభుత్వంపై జగన్ ఫైర్
- ప్రభుత్వం మార్కెట్లో జోక్యం చేసుకోవడం లేదని విమర్శ
- మిర్చి కొనుగోలు విషయంలో ప్రభుత్వం రైతులను మోసం చేసిందంటూ ఆగ్రహం



**అమరావతి,మే 3 (వార్తాప్రభ) :** రాష్ట్రంలో రైతులు పండించిన పంటలకు కనీస మద్దతు ధర (ఎంఎస్‌పీ) లభించక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, ప్రభుత్వం వారి గోడును పట్టించుకోవడం లేదని వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి తీవ్రస్థాయిలో విమర్శించారు. అన్నదాతలు రోడ్డెక్కి ఆందోళనలు చేస్తున్నా, ప్రభుత్వ యంత్రాంగం కనీసం స్పందించకపోవడం దారుణమని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు సీఎం చంద్రబాబును ఉద్దేశించి ట్వీట్ చేశారు. "చంద్రబాబు గారూ% కనీస మద్దతు ధరలు లభించక రాష్ట్రంలో రైతులు రోడ్డెక్కి ఆందోళన చేస్తున్నా వారి గోడు పట్టించుకోవడం లేదు. కనీస మద్దతు ధరలు లభించక, పెట్టిన పెట్టుబడులూ రాక రైతులు అప్పుల ఊబిలోకి కూరుకు పోతున్నారు. మీరు, మీ మంత్రులు, యంత్రాంగం కనీసం వారివైపు కన్నెత్తికూడా చూడకపోవడం ధర్మమేనా? మిరప, పత్తి, జొన్న, కందులు, మినుములు, పెసలు, మొక్కజొన్న, సజ్జలు, రాగులు, వేరుశెనగ, టమోటా, అరటి, చీని, పొగాకు ఇలా ఏ పంట చూసినా కనీస మద్దతు ధరలు రావడం లేదు. చొరవ చూపి, మార్కెట్లో జోక్యం చేసుకోవాలన్న కనీస బాధ్యతను విస్మరించారు. పైగా డ్రామాలతో ఆ రైతులను నిలువునా మోసం చేస్తున్నారు. ఇది న్యాయమేనా? చంద్రబాబు గారూ... మిర్చి విషయంలో కూడా మీరు రైతులను నమ్మించి మోసం చేశారు. మిర్చి కొనుగోలు అంశం కేంద్రం పరిధిలో లేకపోయినా, నాఫెడ్ కొనుగోలు చేస్తుందని మొదట నమ్మబలికారు. క్వింటాలు రూ.11,781కు కొంటామని చెప్పి, ఒక్కపైసా కూడా ఖర్చు పెట్టకుండా, ఒక్క రైతు నుంచి కాని, ఒక్క ఎకరాకు సంబంధించి కాని, ఒక్క క్వింటాల్ గాని కొనకుండా అన్నం పెట్టే రైతులకు సున్నం రాశారు. మా హయాంలో ధరల స్థిరీకరణ నిధి కింద రూ.3 వేల కోట్లు పెట్టి, ఐదేళ్లలో రూ.7, 796 కోట్లు ఖర్చుచేశాం. చారిత్రాత్మక నిర్ణయాలు తీసుకుని కనీస మద్దతు ధరల జాబితాలో లేని పొగాకు సహా అనేక పంటల రైతులను ఆదుకున్నాం. మీరు కొత్తగా ఏమీ చేయకపోయినా, కనీసం మా విధానాన్ని కొనసాగించి ఉంటే రైతులకు ఊరట లభించేది కదా? పైగా ఈ ఏడాది బడ్జెట్లో రూ.300 కోట్లు కేటాయించడం దారుణం కాదా? ఇందులో కూడా కనీసం ఒక్క రూపాయి కూడా ఖర్చు పెట్టిన దాఖలాలు ఉన్నాయా? ధాన్యం, కోకో, పొగాకు, ఆక్వా రైతులు ఆయా జిల్లాల్లో ఆందోళనలు చేస్తుంటే, ఇప్పటికీ రోమ్ చక్రవర్తి ఫిడేలు వాయించినట్లుగా వ్యవహరిస్తున్నారు. జనాభాలో 60శాతం మంది ప్రజలు ఆధారపడే వ్యవసాయరంగాన్ని నిర్లక్ష్యం చేయడం వల్ల అది తీవ్ర సంక్షోభానికి దారితీస్తే, లక్షల మంది ఉపాధికి గండిపడితే దానికి బాధ్యత ఎవరు తీసుకుంటారు? వెంటనే ప్రభుత్వం తరపున మార్కెట్లో జోక్యం చేసుకోవాలని, కనీస ధరలు లభించని పంటల విషయంలో ప్రభుత్వమే జోక్యంచేసుకుని, మార్క్‌ఫెడ్ ద్వారా కొనుగోలు చేయాలని డిమాండ్ చేస్తున్నాను" అంటూ జగన్ స్పష్టం చేశారు.

## అమరావతి సభ విజయవంతమైనందుకు ప్రజలు సంతోషించారు

- గత పాలకులు అమరావతిని భ్రమరావతి అని ఎద్దేవ చేశారు
- ప్రధాన మంత్రే స్వయంగా ముఖ్యమంత్రి పనితనానికి కితాబిచ్చారు
- రాబోయే కాలంలో ఏఐ, ఐటీ, క్యాంటం కంప్యూంటింగ్ లకు కేరాఫ్ గా అమరావతి
- ప్రపంచంలో అమరావతి నెంబర్ వన్ సిటీగా అవతరించనుంది



**విజయవాడ, మే 3 (వార్తాప్రభ) :** అమరావతి పునః ప్రారంభ సభ చాలా గొప్పగా విజయవంతం అయ్యిందని అందుకు రాష్ట్రంలోని ప్రతి ఒక్కరూ సంతోషించారని సమాచార పౌరసంబంధాలు, గృహ నిర్మాణ శాఖ ల మంత్రి కొలుసు పార్థసారధి తెలిపారు. బందరు రోడ్డులో గల మంత్రి కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ అమరావతిని దేవతల రాజధాని అని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ చెప్పారన్నారు. దేవతలు సంచరించే చోట రాక్షసులు కూడా ఉండటం సహజమన్నారు. 5 కోట్ల మంది తెలుగువారు మద్దతు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కు ఉందని మంత్రి తెలిపారు. అమరావతిని భవిష్యత్తులో ఏఐ, ఐటీ, క్యంటం కంప్యూంటింగ్ లకు కేంద్రంగా వర్థిల్లే ముఖ్యమంత్రి చేస్తారన్నారు. రూ. 58,000 కోట్ల అభివృద్ధి పనులకు నిన్న ప్రధాన మంత్రి వేదిక నుంచి ప్రారంభించారన్నారు. అప్పుల ఊబిలో కూరుకుపోయిన రాష్ట్రాన్ని ప్రధాన మంత్రి, ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ లు తమ అనుభవంతో గాడిలో పెట్టగలరని ప్రజలు విశ్వసిస్తున్నారన్నారు. కూటమి ప్రభుత్వం పేదల పక్షపాత ప్రభుత్వమన్నారు. గత ప్రభుత్వం ఐదేళ్లపాటు రాజధాని ప్రజలను నానా రకాలు గా ఇబ్బంది పెట్టి, అమరావతి ప్రజలను భయపెట్టారన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ను చూసి స్ఫూర్తి పొందానని స్వయంగా ప్రధాని నరేంద్ర మోదీ అనటం ముఖ్యమంత్రి గొప్ప పనితనానికి నిదర్శనమన్నారు. దేశాన్ని గాడిలో పెట్టిన ఏకైక ప్రధాని మోదీ అని అన్నారు. పహల్గామ్ ఉగ్రమూకల దాడి విషయంలో ముఖ్యమంత్రి ప్రధాన మంత్రికి వెన్నుదన్నుగా నిలిచారన్నారు. అమరావతిని భ్రమరావతి అని గత పాలకులు విమర్శలు చేశారన్నారు. అమరావతి పునః ప్రారంభానికి ఆహ్వానించినా గత పాలకులు రాలేదన్నారు. గత పాలకులు అమరావతి ప్రాధాన్యతను అవసరాన్ని ఇప్పటికైనా గుర్తించాలన్నారు. అమరావతి పునః. ప్రారంభ పనులు చాలా గొప్పగా మొదలయ్యాయన్నారు. అమరావతి పై విషం చిమ్మిన గత పాలకులు, స్వార్థపరులు ఇప్పటికైనా పశ్చాత్తాపం వ్యక్తం చేయాలన్నారు. అలా చేస్తే తెలుగు ప్రజలు క్షమించక పోయినా దేవుడు అయినా వారిని క్షమిస్తాడేమోనన్నారు. పోలవరం ప్రాజెక్టు పూర్తితోపాటు, పోలవరం బనకచర్ల నదుల అనుసంధాన ప్రాజెక్టు కూడా సాధ్యమేనని ముఖ్యమంత్రి నిరూపించారన్నారు. దీనివల్ల రాష్ట్రంలో ఉన్న ప్రతి ఎకరాకు నీళ్లు అందిస్తారన్నారు. యువతకు 20 లక్షల ఉపాధి కల్పించటమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తుందన్నారు. అమరావతి పునః ప్రారంభ సభకు వచ్చేందుకు వాహనాలు సరిపోక వేలాదిమంది ప్రజలు గ్రామాల్లో ఉండిపోయారన్నారు. సభలో మోడీ చంద్రబాబు పనితీరుపై చేసిన వ్యాఖ్యలు రాష్ట్ర అబివృద్ధి పై ఆయనకు ఉన్న కమిట్ మెంట్ ను తెలియజేస్తుందన్నారు. అమరావతి శక్తిని సాక్ష్యాత్తు ప్రధాని నరేంద్ర మోడీ గుర్తించి కీర్తించారన్నారు. అమరావతి సభ సమయంలో అగ్ని ప్రమాదం వెనుక ఎవరైనా ఉంటే దానిపై పోలిసుల విచారణలో బయటపడుతుందన్నారు. ఇప్పటి వరకు అమరావతి రాజధాని పై ఉన్న అనుమానాలు పటాపంచలు అయిపోయాయని దీన్ని రాష్ట్ర ప్రజలతోపాటు అందరూ గుర్తించారన్నారు. అమరావతి అంటే గత ప్రభుత్వానికి కడుపు మంట అని ఎద్దేవ చేశారు. అమరావతికి చట్ట బద్దత కల్పించే అంశంపై కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు.

## ఢిల్లీలోని ఏపీ భవన్ కు బాంబు బెదిరింపు

**అమరావతి,మే 3 (వార్తాప్రభ) :** ఢిల్లీలోని ఏపీ భవన్ ను పేల్చేస్తామంటూ గుర్తుతెలియని వ్యక్తులు బెదిరింపులకు పాల్పడ్డారు. శుక్రవారం రాత్రి ఈ మేరకు ఒక ఈమెయిల్ వచ్చిందని ఏపీ భవన్ అధికారులు వెల్లడించారు. పహల్గామ్ లో జరిగిన ఉగ్రదాడి నేపథ్యంలో ఈ బెదిరింపులు రావడం, ఆ సమయంలో ఏపీ భవన్ లో సీనియర్ అధికారులు ఉండటంతో అక్కడ టెన్షన్ నెలకొంది. వెంటనే అప్రమత్తమైన పోలీసులు బాంబ్ స్క్వాడ్ ను పిలిపించి ఏపీ భవన్ మొత్తం తనిఖీ చేయించారు. భవన్ పరిసరాలను డాగ్ స్క్వాడ్ క్షుణ్ణంగా తనిఖీ చేసినా ఎలాంటి అనుమానాస్పద వస్తువు కనిపించకపోవడంతో పోలీసులు ఊపిరి పీల్చుకున్నారు. బెదిరింపు మె యిల్ పంపిన వారిని గుర్తించి, అదుపులోకి తీసుకునేందుకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. ఏపీ భవన్ అధికారులు తెలిపిన వివరాల ప్రకారం.. శుక్రవారం రాత్రి 8:30 గంటలకు ఢిల్లీలోని సీనియర్ అధికారుల కోసం "పూలే" సినిమాను ప్రదర్శించేందుకు ఏర్పాట్లు చేశారు.


### పాస్‌పోర్టు పోయినది

ఎన్‌టీఆర్ జిల్లా, విజయవాడ, పటమటలంక, రామస్వామివీధి, ప్రత్యూష టవర్స్, ఫ్లాట్ నెం.301 కాపురస్తురాలు గెద్దాడ ఆర్.రవీంద్రనాథ్ గారి కుమార్తె గెద్దాడ మనీష అను నేను ది.28-04-2025వ తేదీన ఇంటి వద్ద నుండి పటమట సెంటర్‌కు స్కూటర్‌పై జిరాక్స్ తీసుకొని వెళ్ళు సందర్భములో నా బండికి తగిలించి ఉన్న సంచిలో హైదరాబాద్‌లో ది.24-12-2003న జారీచేసిన పాస్‌పోర్టు నెం.ఇ7176622 మరియు కొన్ని కాగితములు పోయినది. వెంటనే పరిసర ప్రాంతంలో వెదకిననూ కనిపించలేదు. సదరు పాస్‌పోర్టును ఉపయోగించి, ఎవ్వరైనా ఎటువంటి అన్యాక్రాంతములు జరిపిన యెడల చట్టప్రకారం తీసుకునే యావత్తు చర్యలకు బాధ్యులు కాగలరని తెలియజేయుచూ, ఎవరికైనా ఒరిజినల్ పాసుపోర్టు దొరికినచో నాకు తెలియపరచినచో తగిన పారితోషకం ఇవ్వబడునని ఇందు మూలముగా తెలియజేయడమైనది.

సెల్ నెం. 9121851723


## పేదోడి ఇంటికి రూ. 5 లక్షలు ఇస్తున్న ఏకైక రాష్ట్రం తెలంగాణ

- ఈ ఏడాది 22 వేల కోట్ల రూపాయిలతో 4.50 లక్షల ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం
- శిక్షణ పొందిన అసిస్టెంట్ ఇంజనీర్లకు సర్టిఫికేట్ల అందజేత
- రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి శ్రీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి



**హైదరాబాద్,మే 3 (వార్తాప్రభ) :** భారతదేశంలో పేదలకు ఇంత పెద్ద ఎత్తున రూ. 5 లక్షలతో సంవత్సరానికి నాలుగున్నర లక్షల ఇండ్లు నిర్మిస్తున్న ఏకైక రాష్ట్రం తెలంగాణ అని రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి శ్రీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. పేదలు ఆత్మగౌరవంతో బతకాలన్న సంకల్పంతో గౌరవ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారి ఆధ్వర్యంలో తెలంగాణ ప్రభుత్వం ఇందిరమ్మ ఇండ్ల పథకానికి శ్రీకారం చుట్టిందన్నారు. ఈ ఏడాది 22 వేల కోట్ల రూపాయిలతో 4.50 లక్షల ఇందిరమ్మ ఇండ్లు నిర్మించబోతున్నామని ఇందుకు సంబంధించి మరికొద్దిరోజుల్లో లబ్దిదారుల ఎంపిక ప్రక్రియ పూర్తిచేస్తామని ఇప్పటికే పైలట్ గ్రామాల్లో ఇండ్ల నిర్మాణాలు చురుగ్గా సాగుతున్నాయని అన్నారు. హౌసింగ్ కార్పొరేషన్ లో అవుట్ సోర్సింగ్ లో నియామకమైన 350 మంది అసిస్టెంట్ ఇంజనీర్లు నేషనల్ అకాడమీ ఆఫ్ కన్‌స్ట్రక్షన్ ( న్యాక్) లో ఆరు రోజుల పాటు శిక్షణ పొందారు. శనివారం నాడు న్యాక్‌లో మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి శిక్షణ పొందిన ఇంజనీర్లకు సర్టిఫికేట్లను అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి గారు మాట్లాడుతూ ప్రభుత్వ ఆలోచనలకు అనుగుణంగా అవినీతికి ఆస్కారం లేకుండా నిజాయితీ నిబద్ధతతో పనిచేసి పేదవాడి చిరకాల కోరిక నెరవేరుస్తున్న ఇందిరమ్మ ఇండ్ల పథకంలో భాగస్వాములు కావాలని అసిస్టెంట్ ఇంజనీర్లకు విజ్ఞప్తి చేశారు. ఎంపికైన 350 మంది ఇంజనీర్లలో 45 శాతం మహిళలే ఉండడం సంతోషించదగ్గ విషయమన్నారు. ఎన్ని వత్తిళ్లు వచ్చినా కూడా మెరిట్ పద్దతిలోనే ఎంపిక చేయడం జరిగిందన్నారు. దేశంలో ఏ రాష్ట్రంలో కూడా ఏ సంక్షేమ పథకం కింద ఒక్క లబ్దిదారునికి 5 లక్షల రూపాయిలు ఇస్తున్న పథకం లేదని అన్నారు. ఇండ్ల పథకాల్లో కూడా కేంద్రం ఇస్తున్న నిధులతోనే అన్ని రాష్ట్రాలు సరిపెడుతున్నాయని కానీ తెలంగాణ రాష్ట్రంలో పేదల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకొని ఇందిరమ్మ ప్రభుత్వం 5 లక్షల రూపాయిలతో 400 చదరపు అడుగులకు తగ్గకుండా ఇండ్లను లబ్దిదారుడే నిర్మించుకునేలా పథకాన్ని రూపొందించిందన్నారు. ఇందిరమ్మ ఇండ్ల కోసం కొద్దిరోజుల్లోనే నాలుగు లక్షల మంది జాబితా ఫైనల్ చేయబోతున్నామని విధుల్లో చేరిన వెంటనే అసిస్టెంట్ ఇంజనీర్లు ఈ జాబితాలపై దృష్టి సారించాలని సూచించారు. ఎలాంటి ప్రలోభాలు, వత్తిళ్లకు గురికాకుండా అర్హులకే ఇందిరమ్మ ఇండ్లు లభించేలా క్షేత్రస్థాయిలో పనిచేయాలని అన్నారు.

## ఫ్యూచర్ సిటీలో "ఈ - సిటీ"

- వేయి ఎకరాల్లో ప్రత్యేకంగా అభివృద్ధి
- రాష్ట్రంలో సిరా నెట్ వర్క్స్, ఎల్ సీజీసీ రెజల్యూట్ గ్రూప్ రూ.300 కోట్ల పెట్టుబడి
- 2500 మంది యువతకు ఉపాధి
- రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబు





**హైదరాబాద్,మే 3 (వార్తాప్రభ) :** రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా ఏర్పాటు చేస్తున్న "ఫ్యూచర్ సిటీ"లో వేయి ఎకరాల్లో ప్రత్యేకంగా "ఎలెక్ట్రానిక్ సిటీ(ఈ సిటీ)ని అభివృద్ధి చేయనున్నట్లు రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు తెలిపారు. రాష్ట్రంలో సయుక్తంగా రూ.300 కోట్లు పెట్టుబడి పెట్టేందుకు ముందుకొచ్చిన టెలికాం ఉత్పత్తుల సంస్థలు సిరా నెట్ వర్క్స్(తైవాన్), ఎల్ సీజీసీ రెజల్యూట్ గ్రూప్(తెలంగాణ) ప్రతినిధులతో ఆయన శనివారం సచివాలయంలో సమావేశమయ్యారు. ఎలెక్ట్రానిక్ పరిశ్రమల ఏర్పాటును ప్రోత్సహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను ఈ సందర్భంగా మంత్రి వారికి వివరించారు. ఈ తరహా పరిశ్రమలు ఏర్పాటులో పారిశ్రామికవేత్తలకు ఇబ్బందులు కలగకుండా సంబంధిత అధికారులతో ప్రత్యేక టాస్క్ ఫోర్స్ ను ఏర్పాటు చేస్తామన్నారు. టైర్ -2, టైర్ -3 నగరాలు, పట్టణాల్లో పరిశ్రమలు ఏర్పాటు చేసేందుకు ముందుకొచ్చే పారిశ్రామికవేత్తలకు ప్రత్యేక ప్రోత్సాహకాలిస్తామన్నారు. ఆయా ప్రాంతాల్లో వారి అవసరాలకు అనుగుణంగా అవసరమైన మౌలిక సదుపాయాలను కల్పిస్తామన్నారు. తెలంగాణ అభివృద్ధిలో భాగస్వామ్యయ్యేందుకు ముందుకొచ్చిన సిరా నెట్ వర్క్స్, ఎల్ సీజీసీ రెజల్యూట్ గ్రూప్ ప్రతినిధులకు కృతజ్ఞతలు తెలిపారు. ప్రభుత్వం తరపున అన్ని రకాలుగా అండగా ఉంటామని హామీ ఇచ్చారు. సుమారు 10 ఎకరాల్లో ఏర్పాటు చేయబోయే ఈ పరిశ్రమ ద్వారా 2500 మంది యువతకు ఉద్యోగాలు వస్తాయన్నారు. ఇక్కడ 5జీ నెట్ వర్క్స్ , మల్టీ లేయర్ నెట్వర్కింగ్ సొల్యూషన్స్, సర్వర్స్ తదితర టెలికాం ఉత్పత్తులను తయారు చేస్తారన్నారు. ఈ పెట్టుబడితో ఇండో తైవాన్ మధ్య సత్సంబంధాలు మరింత బలోపేతం అవుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. సమావేశంలో టీజీఐసీసీ సీఈవో మధుసూదన్, టీ ఫైబర్ ఎండీ వేణు ప్రసాద్, సిరా నెట్వర్క్స్ ప్రతినిధులు చుయాన్, జాయ్ భట్టాచార్య, డొగియాస్, ఎల్ సీజీసీ రెజల్యూట్ గ్రూప్ నుంచి రణ్వీందర్ సింగ్, గీతాంజలి సభర్వాల్ తదితరులు పాల్గొన్నారు.

## చెన్నూరు లో కిశోరి బాలికల సమ్మర్ కాంపెయిన్



**పెడన,మే 3 (వార్తాప్రభ) :** కృష్ణాజిల్లా వ్యాప్తంగా జరుగుతున్న కిశోరి వికాసం కార్యక్రమం లో భాగంగా సమ్మర్ క్యాంపైను కార్యక్రమం శనివారం నిర్వహించారు. ఈ కార్యక్రమం ఈనెల 2వ తేదీ నుంచి జూన్ 10 వ తేదీ వరకు జరుగుతుంది. వారానికి రెండు రోజులపాటు అంటే ప్రతి మంగళవారం శుక్రవారం ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా 15 నుంచి 18 సంవత్సరాల వయసు లోపు బాలికలను ఈ కార్యక్రమానికి ఆహ్వానించి స్థానిక ప్రజాప్రతినిధులు అంగన్వాడి కార్యకర్తలు గ్రామ సమాఖ్య సభ్యులు ఉపాధ్యాయులు సచివాలయ మహిళా సంరక్షణ సిబ్బంది పలు అంశాలపై అవగాహన కల్పించనున్నారు. ప్రధానంగా బాల్యవివాహాల వల్ల జరిగే అనర్థాలను చెబుతున్నారు. అలాగే విద్య వల్ల కలిగే ప్రయోజనాలు కూడా వివరిస్తున్నారు. ఈ కార్యక్రమంలో సూపర్వైజర్ కల్పవల్లి అంగన్వాడీ కార్యకర్తలు పార్వతి గీత కుమారి సుజాత రజని విజయలక్ష్మి ఆశ వర్కర్లు దుర్గ రేవతి తదితరులు పాల్గొన్నారు.

## ఎర్నాకులంలో సోమన్న "సూక్తి చంద్రిక" పుస్తకావిష్కరణ






**కర్నూలు,మే 3 (వార్తాప్రభ) :** పెద్దకడబూర్ మండల పరిధిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, కంబదహాళ్ లో గణితోపాధ్యాయుడుగా పని చేస్తున్న ప్రముఖ బాలసాహిత్యవేత్త ,బాలబంధు డా.గద్వాల సోమన్న 68వ పుస్తకం "సూక్తి చంద్రిక" పుస్తకావిష్కరణ అలువా, ఎర్నాకులం జిల్లా, కేరళ రాష్ట్రంలో ఘనంగా జరిగింది. సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా,ఫా.సన్నీ జోసఫ్ ఇటలీ వారి సిల్వర్ జూబ్లీ మహోత్సవం సందర్భంగా ప్రావిన్షియల్ రెవ.ఫా.క్రీస్తురాజు,ఫా. సన్నీ జోసఫ్ విచ్చేసిన ప్రముఖుల చేతుల మీద ఆవిష్కరించారు.అనంతరం అనతి కాల పరిధిలో 68 పుస్తకాలు రచించిన గద్వాల సోమన్నను సత్కరించారు.ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు యన్.జోజప్ప, ప్రభుదాస్,సుశీ రాజు,యం.జోజప్ప, చార్లెస్,జార్జి,బాలస్వామి, బి.జోసఫ్ ,రాజేష్,రత్నాకర్,అశోక్ మున్నగు వారు పాల్గొన్నారు. సన్మాన గ్రహీత, కృతికర్త గద్వాల సోమన్న ను తోటి ఉపాధ్యాయులు, శ్రేయోభిలాషులు అభినందించారు.

## గోవులకు వరిగడ్డి వితరణ....



**పెనుగంచిప్రోలు,మే 3 (వార్తాప్రభ) :** పెనుగంచిప్రోలు గ్రామంలో కొలువై ఉన్న శ్రీ తిరుపతమ్మ అమ్మవారి దేవస్థానం గోశాల లోని గోవు లకు పెనుగంచిప్రోలు మండలం సొబ్బాయిగూడెం గ్రామానికి చెందిన రైతు కూచి శ్రీను 50 వరిగడ్డి కట్టలు వారి సొంత ఖర్చులతో గోవులకు దానంగా శనివారం సమర్పించినారు. వారికి దేవస్థానం డిప్యూటి కమిషనర్ మరియు కార్య నిర్వహణ అధికారి కిశోర్ కుమార్,మరియు చైర్మన్. జంగాల. శ్రీనివాస్ అభినందనలు తెలిపినారు..

## శభాష్ చింతల సీతా రామయ్య అంటున్న టీడీపీ అభిమానులు..





**పెనుగంచిప్రోలు, మే 3 (వార్తాప్రభ) :** పెనుగంచిప్రోలు నుండి రాజధాని "అమరావతి "పునర్నిర్మాణ సభకు తరలి వెళ్లే తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు భోజనానికి ఎవరు ఇబ్బంది పడకూడదని ఆశయంతో పెనుగంచిప్రోలు శివారులో భోజనం ఏర్పాటు చేయటం చాలా మంచి పరిణామము. నిన్న జరిగిన అమరావతి పునర్నిర్మాణ సభకు ప్రజలు ఎక్కువ గా రావడంతో అధికారులు తయారు చేసిన భోజనం తక్కువ సమయంలో అయిపోవడంతో చాలామంది ప్రజలు భోజనానికి చాలా ఇబ్బంది పడ్డారు అలాగే ఇబ్బంది పడని వారు ఎవరంటే పెనుగంచి ప్రోలు తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు మాత్రమే చక్కగా ఇక్కడే భోజనం ఏర్పాటు తోపాటు అన్ని వసతులు మంచినీళ్లు అన్ని ఏర్పాటు చేసారు, చింతల వెంకట సీతా రామయ్య కొంతమంది మహిళలకు వచ్చినవారికి బస్సు చాలక పోతే అప్పటికప్పుడు మినీ లారీని ఏర్పాటు చేసి అమరావతికి పంపినారు. ముందు చూపుతో భోజనం వసతి ఏర్పాటు చేసి నందుకు కార్యకర్తలు ప్రజలు మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు చింతల వెంకట సీతారామయ్యను అభినందిస్తున్నారు.

# పెడన శ్రీ వాసవి క్షేత్రంలో మే 7 నుండి 9 వరకు శ్రీ వాసవి జయంతి మహెూత్సవములు !





**పెడన,మే 3 (వార్తాప్రభ) :** పెడన పట్టణ ఆర్యవైశ్య సంఘం మండల ఆర్యవైశ్య సంఘం ఆర్యవైశ్య యువజన సంఘం శ్రీ వాసవి మహిళా మండలి వాసవి క్లబ్ పొట్టి శ్రీరాములు పెడన తదితర స్వచ్ఛంద సేవా సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో స్థానిక శ్రీ వాసవి క్షేత్రము నందు అంగరంగ వైభవంగా నిర్వహిస్తున్నామని పట్టణ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు గౌరవ డాక్టరేట్ అవార్డు గ్రహీత డా. కొల్లూరి చిన్నా ఒక ప్రకటనలో తెలియజేశారు. ఈ సందర్భంగా డా. కొల్లూరి మాట్లాడుతూ ఈనెల 7వ తేదీ బుధవారం శ్రీ వాసవి మాతకు 108 లీటర్ల ఆవుపాలతో అభిషేకం 8వ తేదీ గురువారం శ్రీ వాసవి మాతకు కుంకుమ పూజలు 9వ తేదీ శుక్రవారం శ్రీ వాసవి మాతకు లక్ష మల్లెల పుష్పార్చన సాయంత్రం 6 గంటలకు పట్టణ పురవీధుల్లో శ్రీ వాసవి మాత ఉత్సవ విగ్రహం ఊరేగింపు తదితర కార్యక్రమాలను శ్రీ వాసవి క్షేత్రం ఆలయ ప్రధాన అర్చకులు స్వర్ణ సాయిబాబు అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించనున్నారని డా. కొల్లూరి తెలియజేశారు.10వ తేదీ శనివారం నిర్వహించు ఆర్యవైశ్య అన్న సమారాధన కార్యక్రమం తో వాసవి జయంతి మహెూత్సవములు ముగియనున్నాయని డా. కొల్లూరి తెలియజేశారు. ప్రతిరోజు సాయంత్రం 6 గంటలకుపట్టణ శ్రీ వాసవి మహిళా మండలి వాసవి క్లబ్ పొట్టి శ్రీరాములు పెడన కార్యవర్గ సభ్యులు లలిత పారాయణ సౌందర్యలహరి శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి చరిత్ర చదువుతారని డా. కొల్లూరి అన్నారు. పెడన పట్టణ మండల పరిసర ప్రాంత ఆర్యవైశ్య సోదర సోదరీమణులందరూ విచ్చేసి ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయవలసిందిగా డా. కొల్లూరి పిలుపునిచ్చారు.

## సబ్ జైలు నుండి బెయిల్ పై విడుదలైన కార్యకర్తలను పరామర్శించిన వైసిపినేత తన్నీరు



**పెనుగంచిప్రోలు, మే 3 (వార్తాప్రభ) :** మచిలీపట్నంలో సబ్ జైలు నందు మార్చి నెలలో పెనుగంచిప్రోలు అమ్మవారి జాతర లో జరిగిన గొడవలో అక్రమ కేసులు పెట్టి అరెస్ట్ చేసిన వైయస్ ఆర్ కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, యువకులను మచిలీపట్నం సబ్ జైల్ నుంచి బెయిల్ పై మరో ఇద్దరు కార్యకర్తల్ని విడుదల చేసిన సందర్భంగా వారిని పెనుగంచిప్రోలు వారి స్వగృహం లో జగ్గయ్యపేట నియోజకవర్గ వైఎస్ఆర్ సీపీ ఇన్-ఛార్జ్ తన్నీరు నాగేశ్వరరావు పరామర్శించారు. మార్చి నెలల్లో తిరునాళ్లలో ఘర్షణ నేపథ్యంలో 16మంది వైఎస్సార్ సీపీ సాను భూతిపరులపై పోలీసులు నమోదు చేసిన అక్రమకేసులో 16 మందికి 16 మందిని రిలీజ్ అయ్యారు శుక్రవారం సాయంత్రం బెయిల్ పై విడుదలైన ఈటూరి వెంకట్, తూము గోపి, పెనుగంచిప్రోలు లో వారి స్వగృహానికి వెళ్లి నియోజకవర్గ ఇన్ ఛార్జ్ తన్నీరు నాగేశ్వర రావు కలిశారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఎంపీపీల సంఘుల అధ్యక్షులు మార్కపూడి గాంధీ, రాష్ట్ర బీసీ సెల్ ప్రధాన కార్యదర్శి బత్తుల రామారావు, నియోజకవర్గ వాణిజ్య విభాగ అధ్యక్షులు దేరంగుల శ్రీనివాసరావు, గుడిమెట్ల శంకర్, మాజీ జగ్గయ్యపేట మండల పార్టీ అధ్యక్షుడు శ్రీనివాస్ గౌడ్ ,పెనుగంచిప్రోలు మండల సోషల్ మీడియా కోఆర్డినేటర్ నల్లబోతుల వెంకటేష్ ,గేదెటి వెంకట రత్నం, చేని రాంబాబు, మల్లెబోయిన సైదులు, ముండ్లపాడు గ్రామ పార్టీ అధ్యక్షుడు నరాల మధుసూదన్ రెడ్డి, అనిగండ్లపాడు గ్రామ పార్టీ అధ్యక్షుడు యానాల సురేష్, పట్టణ యూత్ ప్రధాన కార్యదర్శి గొట్టిపాళ్ళ సురేష్ తదితరులు పాల్గొన్నారు.

## 1 వ అంగన్వాడీ కేంద్రం లో గ్రోత్ మానిటరింగ్ మరియు వి హైచ్ ఎస్ ఎల్డి కార్యక్రమం



**పెనుగంచిప్రోలు,మే 3 (వార్తాప్రభ) :** ఐసిడిఎస్ ప్రాజెక్టు చిల్లకల్లు సిడిపిఒ లక్ష్మీ భార్గవి ఆదేశాల మేరకు సూపర్వైజర్ కె. ఉషారాణి టాటా ట్రస్ట్ ప్రోగ్రాం అసోసియేటర్ వి మాధురి ఆధ్వర్యంలో పెనుగంచిప్రోలు ఒకటవ అంగన్వాడీ కేంద్రం నందు గ్రోత్ మానిటరింగ్ మరియు విహెచ్ఎస్ ఎల్డి కార్యక్రమం శనివారం నిర్వహించడం జరిగింది, ఈ కార్యక్రమంలో భాగంగా పౌష్టికాహార లోపం గురించి తల్లిదండ్రులకు అవగాహన కల్పించడం జరిగింది పౌష్టికాహార లోపం తగ్గించడానికి ఫోర్టిఫైడ్ ఫుడ్స్ వాడాలని తల్లిదండ్రులకు వివరించడం జరిగింది . అదేవిధంగా 6 టు 5 ఇయర్స్ పిల్లల యొక్క బరువులు ఎత్తులు తూచి వారి తల్లిదండ్రులకు వివరించి పిల్లలు ఎత్తు మరియు బరువు పెరగటం కోసం అంగన్వాడీలో పంపిణీ చేసే బాలామృతం గ్రుడ్లు మరియు పాలల్లో ఉండే విటమిన్స్ మరియు మినరల్స్ గురించి తల్లిదండ్రులకు వివరించడం జరిగింది. ఆకు కూరలతో వంటకాలు చేసి పిల్లలకు పెట్టమని వివరించడం జరిగింది. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ కార్యకర్త దామాల. వాణి సహాయకురాలు. పి అచ్చమ్మ సూపర్వైజర్ కే ఉషారాణి, టాటా ట్రస్ట్ ప్రోగ్రాం అసోసియేటర్ వి మాధురి ఏం ఎన్ ఏం యూ సరళ ఆశాలు తల్లిదండ్రులు గర్భవతులు బాలింతలు అత్తలు పాల్గొనడం జరిగింది.

## హత్య కేసులో ముగ్గురు ముద్దాయిల అరెస్టు



**కాకినాడ/గొల్లప్రోలు,మే 3 (వార్తాప్రభ) :** కత్తిపూడి-కాకినాడ హైవే బైపాస్ చేబ్రోలు కల్వర్టు వద్ద పంట బోదిలో గుర్తు తెలియని వ్యక్తి హత్య కేసులో ముగ్గురు ముద్దాయిలను పోలీసులు అరెస్టు చేశారు. సుమారు 35-40 సంవత్సరాల వయస్సు గల మగ శవం గాయాలతో కుళ్ళిన స్థితిలో గుర్తించడం జరిగింది.చేబ్రోలు విఆర్ఓ ఇచ్చిన ఫిర్యాదు మేరకు హత్య కేసు నమోదుచేసి,పిఠాపురం సిఐ జి. శ్రీనివాస్ దర్యాప్తు చేసి సాంకేతికత సాయంతో దర్యాప్తు చేసి నిందితులను గుర్తించారు.గత నెల 28న అనకాపల్లి జిల్లా ఎలమంచిలి టౌన్ పోలీసు స్టేషన్లో నమోదైన మిస్సింగ్ కేసుపై పరిశీలించగా, మృతదేహం ధర్మవరం ప్రాంతానికి చెందిన తంగెళ్ళ లోవరాజుగా గుర్తించబడింది.అతని భార్య శ్యామల,భర్త బంధువు అయిన మోహన్ కుమార్ తో అక్రమ సంబంధానికి భర్త అడ్డంకిగా భావించి పథకం ప్రకారం మోహన్ కుమార్ స్నేహితుడు అయిన గంగాధర్ తో ముగ్గురు కలిసి లోవరాజును హత్య చేసి మృతదేహాన్ని చేబ్రోలు హైవే వద్ద పడవేసినట్టు దర్యాప్తులో తేలింది. ముగ్గురు నిందితులు మాడెం మోహన్ కుమార్,తంగెళ్ళ శ్యామల,బళ్ళా గంగాధర రావు అరెస్టు చేసి,ఒక కారు స్వాధీనం చేసుకున్నారు. వీరిని న్యాయస్థానం నందు హాజరు పరుస్తున్నారని జిల్లా ఎస్పీ బిందు మాధవ్ తెలిపారు.హత్య కేసును ఛేదించిన పిఠాపురం పోలీసు సర్కిల్ ఇన్స్పెక్టర్ జి. శ్రీనివాస్, గొల్లప్రోలు ఎస్సై ఎన్. రామకృష్ణ,దర్యాప్తు బృందాన్ని ఎస్పీ అభినందించారు.

## నాట్య కళా పీఠానికి కంప్యూటర్ బహుకరణ..



**అవనిగడ్డ,మే 3 (వార్తాప్రభ) :** పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం కూచిపూడి శ్రీ సిద్ధేంద్ర యోగి కూచిపూడి నాట్య కళా పీఠం కు పవర్ గ్రిడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్ సీనియర్ జనరల్ మేనేజర్ కే నాగమోహనరావు - దుర్గా పద్మజ దంపతులు శనివారం కంప్యూటర్ సిస్టంను బహుకరించారు. అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ ఏలేశ్వరపు శ్రీనివాసులు, సీనియర్ అసిస్టెంట్ నల్లగుళ్ళ వెంకటేశ్వరరావుకు తాము సమకూర్చిన కంప్యూటర్ ను అందజేశారు. ఇదే సందర్భంగా శ్రీ సిద్ధేంద్ర ఓరియంటల్ జిల్లా పరిషత్తు హైస్కూల్లో పదవ తరగతి లో టాప్ టెన్ లో ఉత్తీర్ణులైనవిద్యార్థినులకు, నాట్యంలో శిక్షణ పొందిన ఇంజనీరింగ్ విద్యార్థినిఏలేశ్వరపు లక్ష్మి సంధ్య వైష్ణవికి నూతన పట్టు వస్త్రాలను అందజేశారు. అలాగే పదవ తరగతిలో మొదటి స్థానం పొందిన వక్కలగడ్డ మౌనిక హర్షితకు, 9వ తరగతి పాసై నేషనల్ మీన్స్ మెరిట్ స్కాలర్షిప్ లో ఉత్తీర్ణత పొందిన పేదగిరిజన విద్యార్థిని శీలం లిల్లెమ్మకి సాఫ్ట్ వేర్ఇంజనీర్ ఏలేశ్వరపు ప్రశాంత్.ప్రోత్సాహక నగదు బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు జీవి సత్య ప్రసాద్, శ్రీ బాలా త్రిపుర సుందరి గ్రంధాలయ పాలకులు వైవి ఫణి కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## యల్.బి.ఆర్.సి.ఈ విద్యార్థుల ఇంటింటి సర్వే






**మైలవరం,మే 3 (వార్తాప్రభ) :** స్థానికి లకిరెడ్డి బాలిరెడ్డి ఇంజనీరింగ్ కళాశాల ఉన్నత భారత్ అభయాన్(యూ.బి.ఎ) కి సంబంధించి 5 గ్రామాలను దత్తత తీసుకోవడం జరిగిందని కళాశాల ప్రిన్సిపాల్ డా.కె.అప్పారావు శనివారం తెలిపారు.దత్తత తీసుకున్న గ్రామాలలో యల్.బి.ఆర్.సి.ఈ విద్యార్థులు ఇంటిటిసర్వే మరియు గ్రామ సర్వే ను నిర్వహించడం జరుగు తుందని వెల్లడించారు.పర్వతపురం మరియు సబ్జపాడు గ్రామములలో 60 మంది ఎన్ .ఎస్.ఎస్ విద్యార్థిని విద్యార్థులు సర్వే చేసినట్లు పేర్కొన్నారు.ఈ సర్వే లో కుటుంబం యొక్క విద్య, వ్యాపార, వ్యవసాయ మరియు జీవనాధార సమాచారం సేకరించడం జరిగిందన్నా రు.ఈ వివరాలతో ఆ గ్రామం యొక్క సమస్యలు తెలుసుకొని పూర్తి సమాచారం ను ఉన్నత భారత్ అభయాన్ (యూ.బి.ఎ) పోర్టల్ లో అప్లోడ్ చేయడం జరుగుతుందని తెలియజేశారు. ఈ కార్యక్రమాన్ని వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ బి. రమేష్ రెడ్డి ప్రారంభించారు.ఇంకా ఈ కార్యక్రమంలో కళాశాల యన్.యస్.యస్.ప్రోగ్రాం ఆఫీసర్ మరియు ఉన్నత భారత్ అభయాన్(యూ.బి. ఏ) కోఆర్డినేటర్ డా.బి.శివ హరి ప్రసాద్, శ్రీ యస్. ఉమా మహేశ్వర రెడ్డి, మరియు విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

## టిడిపి సీనియర్ నాయకుడిని పరామర్శించిన కూటమి నాయకులు....



**కృత్తివెన్ను,మే 3 (వార్తాప్రభ) :** కృత్తివెన్ను మండలం మునిపెడ గ్రామానికి చెందిన తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు మునిపెడ మాజీ నీటి సంఘం అధ్యక్షుడు దాసరి ఆదినారాయణ, అన్నయ్య అయినా దాసరి వెంకటేశ్వరరావు వారి ధర్మపత్ని దాసరి నాగమణి పరమపదించడంతో వారి కుటుంబ సభ్యులను పరామర్శించి వారికి మనోధైర్యాన్ని కల్పించారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షుడు మరియు ఏఎంసి చైర్మన్ ఒడుగు తులసిరావు, డి సి చైర్మన్ నెక్కంటి భాస్కరరావు,దాసరి సుబ్బారావు దాసరి వెంకటేశ్వరరావు తదితర కూటమి నాయకులు వారిని పరామర్శించిన వారిలో ఉన్నారు.

## ఉచిత మెగా వైద్య క్యాంపు విజయవంతం



**విస్సన్నపేట,మే 3 (వార్తాప్రభ) :** స్థానిక మండల కేంద్రంలో ఏ కొండూరు రోడ్డులోని శ్రీ వెంకటేశ్వర స్పెషాలిటీ హాస్పిటల్ అధినేతలు డాక్టర్ రాజగోపాల్ అకిరెడ్డి డాక్టర్ పిండి రూపశ్రీ దంపతులు శనివారం ఉదయం నుండి సాయంత్రం వరకు ఉచిత మెగా వైద్య శిబిరాన్ని నిర్వహించారు ఆసుపత్రి రెండవ సంవత్సరంలో అడుగుపెడుతున్న శుభ సందర్భంలో కేకు కట్ చేసి సంబరాలు చేశారు అనంతరం నిర్వహిస్తున్న కార్యక్రమంలో భాగంగా మెగా ఉచిత వైద్య క్యాంపు నిర్వహించినట్లు వారు చెప్పారు డయాబెటిస్ నరాలు వాపులు జ్వరం ఒళ్ళు నొప్పులు ఇతర సమస్యలపై పరీక్షలు సలహాలు మందులు ఇవ్వటం జరిగిందని తెలియజేశారు తమ ఆసుపత్రి నందు 24 గంటలు అందుబాటులో ఉండటం జరుగుతుంది అని వరిబీజం కిడ్నీలో రాళ్లు అపెండిసైటిస్ హెర్నియా పాయిజన్ కేసులు ఫైల్స్ ఫిస్టుల ఫిషర్ ఆపరేషన్లు నొప్పి లేకుండా ఒడుగులు కిడ్నీలో రాళ్లు తదితర వైద్య సేవలకు సంబంధించి సలహాలు ఇవ్వడం జరిగిందని డాక్టర్ రూప శ్రీ చిన్నారుల ఆరోగ్య సమస్యలపై వైద్య సేవలు అందించారన్నారు ప్రపంచ పత్రిక స్వేచ్ఛ దినోత్సవం సందర్భంగా మీడియా మిత్రులకు వారి శుభాకాంక్షలు తెలియజేశారు

# 117 జీ.వో. కు ప్రత్యామ్నాయంగా వెలువడిన మెమో పై అనేక అభ్యంతరాలు

● కేవలం మెమో ఆధారంగా విధాన నిర్ణయాలు తీసుకోవద్దు. ● 117 జీ.వో.కు ప్రత్యామ్నాయంగా ప్రభుత్వ ఉత్తర్వులు వెలువడిన తర్వాత మాత్రమే పునర్వ్యవస్థీకరణ ప్రక్రియ పూర్తి చేయాలి . ● రాష్ట్రంలో ఒడియా ,కన్నడ, తమిళ, ఉర్దూ భాషల్లో పాఠశాలలు ఉన్నాయి కానీ తెలుగు మాధ్యమంలో పాఠశాలలు లేకపోవడం అత్యంత బాధాకరము. ● రిజిస్టర్డ్ ఉపాధ్యాయ సంఘాలతో విద్యాశాఖామాత్యులు సమన్వయ సమావేశాన్ని ఏర్పాటు చేయాలి. ● ,ప్రభుత్వానికి నవ్యాంధ్ర టీచర్స్ అసోసియేషన్ విజ్ఞప్తి

**విజయవాడ,మే 3 (వార్తాప్రభ) :** గతంలో ఉన్న 117 ప్రభుత్వ ఉత్తర్వులు పై తీవ్రమైన వ్యతిరేకత ఉపాధ్యాయ, విద్యా రంగంలో వెల్లువెత్తిన క్రమంలో ఆ ఉత్తర్వులు రద్దుచేసి కొత్తగా తొమ్మిది రకాల పాఠశాలలు కొనసాగుతాయి అంటూ వస్తున్న వార్తలకు సంబంధించి ఎలాంటి ప్రభుత్వ ఉత్తర్వులు వెలువడ లేదు అనీ పాఠశాలల పునర్వ్యవస్థీకరణ జరిగేటప్పుడు ప్రభుత్వ ఉత్తర్వులు వెలువడకుండా పునర్వ్యవస్థీకరణ ప్రక్రియ చేయడంపై తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తూ వెంటనే ఈ ప్రక్రియ నిలుపుదల చేయాలని నవ్యాంధ్ర టీచర్స్ అసోసియేషన్ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు కరణం హరికృష్ణ మరియు మాగంటి శ్రీనివాస రావులు ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేశారు. 117 జీవో ఉపసంహరణ కోసం పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ గారు ఇచ్చిన మెమోపై అనేక అభ్యంతరాలు వ్యక్తం చేశామని వాటిపై తగిన చర్యలు తీసుకోకుండా అదే మెమో ఆధారంగా పాఠశాలల పునర్వ్యవస్థీకరణ ప్రక్రియ చేయడం 117 జీవో మరియు పైన పేర్కొన్న మెమో ఆధారంగా పని సర్దుబాటు ప్రక్రియ చేయడంపై అనేక అనుమానాలు, అభ్యంతరాలు ఉన్నాయని ప్రభుత్వం ఏర్పడి సంవత్సరం కావస్తున్నందున 117 జీవో నిలుపుదల చేస్తామన్న హామీని నిలబెట్టుకోవాలని తనుగుణంగా పనర్వ్యవస్థీకరణ ప్రక్రియపై ప్రభుత్వ ఉత్తర్వులు వెలువడిన తర్వాత మాత్రమే ఈ పునర్వ్యవస్థీకరణ ప్రక్రియ పై ముందుకు వెళ్లాలని కోరారు. జనవరిలో 117 జీవో ఉపసంహరణకు సంబంధించి ఇచ్చిన మెమోలో అనేక గందరగోళ అంశాలను పేర్కొన్నారనీ వాటిలో ప్రాథమికోన్నత పాఠశాలల వ్యవస్థను రద్దు చేస్తామనడం బాలికా విద్య పై తీవ్ర ప్రభావం ఉంటుందని ఈ నిర్ణయం బాల్య వివాహాలకు ఊతం ఇవ్వడమే అన్నారు.ఉన్నత పాఠశాలలలో ఉపాధ్యాయులపై పని భారం విపరీతంగా పెంచడం గతంలో హైస్కూల్లో విలీనమైన 3,4,5 తరగతులను మరల వెనక్కి తీసుకుని వస్తాం అనడం పై అనేక అభ్యంతరాలు గతంలో ప్రభుత్వం దృష్టికి తీసుకువచ్చినప్పటికీ పై మెమో ఆధారంగా ముందుకు వెళ్లటంపై ఉపాధ్యాయులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నరని దీనిపై గౌరవ విద్యాశాఖామాత్యులు తక్షణమే స్పందించి తగు చర్యలు తీసుకోవాలని కోరారు. గత సంవత్సర కాలంగా అధికారుల ధోరణిలో ఎలాంటి మార్పు లేదని దీనివలన ప్రభుత్వానికి ఉపాధ్యాయులకు మధ్య అంతరం పెరుగుతుందని అభిప్రాయపడ్డారు. ప్రతి గ్రామ, వార్డు సచివాలయానికి ఒక మోడల్ ప్రాథమిక పాఠశాల ఉండాలని ప్రతి ప్రాథమికోన్నత పాఠశాల ఉన్నత పాఠశాలగా ఉన్నతీకరించడం గాని లేదా ప్రాథమికోన్నత పాఠశాలగా కొనసాగటం గానీ చేయాలని ఈ ప్రాథమికోన్నత పాఠశాలలో కనీసం నలుగురు సబ్జెక్టు ఉపాధ్యాయులు ఉండాల్సిందేనని విజ్ఞప్తి చేశారు. ఉన్నత పాఠశాలలో సెక్షన్ పరిమాణం విద్యా హక్కు చట్టానికి అనుగుణంగా కాక సెక్షన్స్ సైజును విపరీతంగా పెంచడం వలన ఉన్నత పాఠశాలలో విద్య నాణ్యత తగ్గుతుందని విద్య హక్కు చట్టానికి అనుగుణంగా ప్రతి సెక్షన్కు గరిష్టంగా 40 మంది విద్యార్థులు మాత్రమే ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఉన్నత పాఠశాలలో సబ్జెక్టు ఉపాధ్యాయులపై తీవ్ర పని భారం పెంచారని ఈ పనిభారంపై పునః సమీక్ష జరపాలని 2019 సం.కి పూర్వం ఏ విధంగా పని భారం ఉందో అదే పనిభారాన్ని కొనసాగించాలని విజ్ఞప్తి చేశారు. భాషా ప్రాయుక్త రాష్ట్రంగా ఏర్పడిన మన ఆంధ్రప్రదేశ్లో ఒడియా, కన్నడ, తమిళ, ఉర్దూ మీడియం లో పాఠశాలలు ఉన్నాయి కానీ తెలుగు మాధ్యమంలో పాఠశాలలు లేకపోవడం అత్యంత బాధాకరమని నూతన జాతీయ విద్యా విధానం ప్రకారం ప్రతి విద్యార్థికి తన మాతృభాషలో ఒకటో తరగతి నుంచి పోస్ట్ గ్రాడ్యుయేషన్ వరకు చదువుకునే వెసులుబాటు ఉందని ఆ హక్కును మన విద్యార్థులకు దూరం చేయొద్దని వెంటనే ప్రతి ఉన్నత పాఠశాలలో సమాంతరమాధ్యమాన్ని కొనసాగించాలని కోరారు. ప్రభుత్వం ముఖ్యమైన విధానపరమైన నిర్ణయం తీసుకునే ముందు రిజిస్టర్ ఉపాధ్యాయ సంఘాలతో చర్చలు జరపాలని విద్యాశాఖ మాత్యులు ఈ సమన్వయ సమావేశానికి హాజరై రిజిస్టర్డ్ ఉపాధ్యాయ సంఘాల అభిప్రాయాలను తీసుకుని తదుపరి 117 జీవో ఉపసంహరణపై ప్రభుత్వ ఉత్తర్వులు విడుదల అనంతరం పాఠశాలల పునర్వ్యవస్థీకరణ ప్రక్రియ పూర్తి చేయాలని విజ్ఞప్తి చేశారు.

## నాగారం మున్సిపల్ బీజేపీ శాఖ ఆధ్వర్యంలో ప్రధాని మోదీకి పాలాభిషేకం

**ముఖ్యఅతిథిగా పాల్గొన్న నాగారం మాజీ చైర్మన్ కౌకుట్ల చంద్రారెడ్డి,**



**కీసర, నాగారం, మే,03:(వార్తా ప్రభ )**నాగారం మున్సిపల్ బీజేపీ శాఖ అధ్యక్షులు కొండబోయిన నాగరాజు యాదవ్ ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టబోతున్న జాతీయ జనగణన మరియు కులగణన (కాస్ట్ సెన్సస్)ను స్వాగతిస్తూ, భారత ప్రధాని నరేంద్ర మోదీ కి పాలాభిషేకం కార్యక్రమం ఘనంగా నిర్వహించబడింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన నాగారం మున్సిపల్ మాజీ చైర్మన్ కౌకుట్ల చంద్రారెడ్డి మాట్లాడుతూ, జనగణనతో పాటు కులగణన ఆర్డినెన్స్‌ను కేంద్ర కాబినెట్ ఆమోదించిన నేపథ్యంలో ప్రధానమంత్రి మోదీ కి పాలాభిషేకం చేయడం ఒక గర్వకారణమైన విషయం అని అన్నారు. ప్రజల అభిప్రాయాలను, పరిస్థితులను తెలుసుకునే దిశగా కేంద్ర ప్రభుత్వం తీసుకుంటున్న ఈ నిర్ణయం అభినందనీయం అని కొనియాడారు. కాంగ్రెస్ పార్టీ పాలనలో 60 సంవత్సరాలుగా ఆలస్యం అయిన ఎన్నో పనులను మోదీ ప్రభుత్వం కేవలం పది సంవత్సరాల్లోనే పూర్తి చేసి చూపిందని పేర్కొన్నారు. "సబ్ కా సాథ్, సబ్ కా వికాస్, సబ్ కా విశ్వాస్" అనే నినాదంతో దేశ ప్రజల అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తున్న బీజేపీ ప్రభుత్వం పట్ల ప్రజల విశ్వాసం పెరుగుతుందని చెప్పారు. ఈ సందర్భంగా, కులగణన అమలుతో ఓబీసీలకు విద్య, రాజకీయ మరియు ఆర్థిక రంగాల్లో మరింత అవకాశాలు కలుగుతాయని, వారు సమాజంలో మరింత ఎదుగుతారని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పిటిసి మునిగంటి సురేష్, జిల్లా కార్యదర్శి గణపురం శ్యామసుందర్ శర్మ, సీనియర్ నాయకులు జంగారెడ్డి, రవీందర్ రెడ్డి, పోతంశెట్టి వెంకటేశ్వరరావు, కర్ర వెంకటేశ్వర్, వోల్లాల శ్రీనివాస్ గౌడ్, జూపల్లి నరేష్, ఏనుగు మహేందర్ రెడ్డి, సురేందర్ రెడ్డి, సతీష్ రెడ్డి, టెస్లా శ్రీనివాస్ , రాజశేఖర్, భరత ముదిరాజ్, మధు గౌడ్, శ్రీకాంత్ గౌడ్, సంజయ్ తదితరులు పాల్గొన్నారు.

## నూతన జోనల్ కమిషనర్ ను మర్యాదపూర్వకంగా కలసిన బా.రా.స.నేత రవీంద్రర్ యాదవ్



**శేరిలింగంపల్లి, మే 3 (వార్తాప్రభ):**శేరిలింగంపల్లి నూతన జోనల్ కమిషనర్ హేమంత్ తో భారాస సీనియర్ నేత రవీందర్ యాదవ్ మర్యాదపూర్వకంగా సమావేశం అయ్యారు. కొత్తగా బాధ్యతలు స్వీకరించడంతో ఆయనను కలిసిన రవీందర్ యాదవ్ సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా నియోజవకర్గంలోని పలు సమస్యలను ఆయనకు వివరించినట్లుగా వెల్లడించారు. శేరిలింగంపల్లి అభివృద్ధికి తీసుకోవాల్సిన చర్యలను కమిషనర్ కు రవీందర్ యాదవ్ తెలిపారు. నియోజకవర్గం గురించి ఇద్దరి మధ్య సుదీర్ఘంగా చర్చ జరిగింది. శేరిలింగంపల్లి కమిషనర్ గా హేమంత్ రావడంతో అభివృద్ధి వేగంగా సాగుతుందన్న ధీమాను వ్యక్తం చేశారు. అలాగే సమావేశంలో పలు డివిజన్ లో చేపట్టాల్సిన పనులను,ప్రజలకు ఉన్న సమస్యలను వివరించారు. వాటిపై త్వరలోనే అధికారులతో సంప్రదించి తగిన చర్యలు తీసుకుంటామని కమిషనర్ తెలిపారని రవీందర్ యాదవ్ వెల్లడించారు.

## మామునూరు భూ సేకరణ కొలిక్కి

**వరంగల్, మే 3 (వార్తాప్రభ):** వరంగల్ మామునూరు విమానాశ్రయ పునరుద్ధరణలో ప్రధాన అడ్డంకిగా మారిన భూ సేకరణ ప్రక్రియ కొలిక్కి వస్తోంది. కలెక్టరు సత్యశారద నేతృత్వంలోని అధికారుల బృందం విమానాశ్రయ నిర్మాణంలో భూములు కోల్పోతున్న నిర్వాసితులు, రైతులతో గత కొన్ని రోజులుగా సంప్రదింపులు జరపడంతో ఎట్టకేలకు భూములివ్వడానికి రైతులు సుముఖత వ్యక్తం చేస్తున్నారు. నగరానికి దగ్గరగా ఉండటంతో భూముల విలువ ఎక్కువగా ఉందని మెరుగైన పరిహారం చెల్లించాలని రైతులు కోరుతున్నారు. మరోవైపు భూ సేకరణ క్రతువును ఏప్రిల్ 15 వరకే పూర్తి చేయాలని సర్కారు ఆదేశించడంతో ఆ మేరకు నిర్వాసితులతో సంప్రదింపులు జరిపిన అధికారులు సమగ్ర నివేదికను రూపొందించారు. నిర్వాసిత గ్రామాలైన ఖిలా వరంగల్ మండలంలోని నక్కలపల్లి, సంగెం మండలంలోని గుంటూరుపల్లి, గాడిపల్లిలో ఇప్పటికే రెవెన్యూ అధికారులు ఎంజాయ్‌మెంట్ సర్వేను పూర్తి చేశారు. ప్రస్తుతం మామునూరు విమానాశ్రయంలో ఎయిర్‌పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా (ఏఏఐ) పరిధిలో 696.14 ఎకరాలు ఉంది. అధికారులు 136 మంది రైతుల నుంచి మరో 253 ఎకరాలకు సేకరిస్తున్నారు. ఇందుకు గతేడాదే రాష్ట్ర ప్రభుత్వం రూ.205 కోట్లను విడుదల చేసింది. భూ సేకరణ ప్రక్రియ ఓ కొలిక్కి రాగానే పనులు ప్రారంభించేందుకు కేంద్ర విమానయాన శాఖ ఇప్పటికే రూ.450 కోట్లు కేటాయించింది. భూ సేకరణ క్రతువు ముగియగానే రాష్ట్ర ప్రభుత్వ సమాచారంతో ఏఏఐ విమానాశ్రయ విస్తరణ పనులను ప్రారంభించనుంది.

## దివ్యాంగుడైన పంతులు పై దాడి చేసిన వారిని కఠినంగా శిక్షించాలి

**మొనార్ దుర్గాప్రసాద్, తెలంగాణ రాష్ట్ర వికలాంగుల సమితి ప్రధాన కార్యదర్శి**



**జవహర్ నగర్, మే,03:(వార్తా ప్రభ)**జవహర్ నగర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో దివ్యాంగుల సమక్షంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత నెల 15 తారీకున జవహర్ నగర్ బాలాజీ నగర్ పాతబస్తీ శ్రీ సీతారామాంజనేయ స్వామి దేవాలయంలో దివ్యాంగుడైన పంతులు పై కొందరు వ్యక్తులు దాడి చేసి కుర్చీలో ఉన్న పంతులును కింద పడేసి గాయపరిచినారు. ఈ విషయంపై దివ్యాంగుడైన పంతులు జితేందర్ శర్మ జవహర్ నగర్ పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేయడం జరిగింది. కానీ జవహర్ నగర్ పోలీసులు సమస్యను పరిష్కరించలేదని దివ్యాంగుల సంఘాలకు ఫిర్యాదు చేయడం జరిగింది. దివ్యాంగులతో కలిసి మళ్లీ పోలీస్ స్టేషన్ కు వెళ్లి ఎస్సైతో మాట్లాడడం జరిగింది. దీనితో ఎస్సై సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇవ్వడం జరిగింది. కానీ ఇంతవరకు ఏ స్పందన లేకపోవడంతో డిసిపి మల్కాజ్గిరి ఏసిపి కుషాయిగూడఆఫీసుకు వెళ్లి ఫిర్యాదు చేయడం జరిగింది. వారు సానుకూలంగా స్పందించినప్పటికీ కొంతమంది రాజకీయ నాయకుల అండదండలతో దివ్యాంగుడి పై దాడి చేసిన కేసు జవహర్ నగర్ పోలీసులు నీరుగారిస్తున్నారని మండిపడ్డారు. 24 గంటల్లోపు ఈ సమస్యను పరిష్కరించాలి. లేకపోతే సీఎం క్యాంప్ ఆఫీస్ లో వందలాది వికలాంగులతో న్యాయం జరిగే వరకు ధర్నా చేస్తాం అని వారన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర వికలాంగుల సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మొనార్ దుర్గాప్రసాద్. గౌరవ అధ్యక్షులు వంగ శ్రీనివాస్ రెడ్డి వికలాంగుల నేస్తం ప్రధాన కార్యదర్శి మొరిగాడి నరసింహ గౌడ్ తెలంగాణ రాష్ట్ర వికలాంగుల సమితి మేడ్చల్ జిల్లా అధ్యక్షులు బత్తిని బిక్షపతి గౌడ్, ఉపాధ్యక్షులు బి రమేష్ ఎంపీఆర్టి ఇండియా జవహర్ నగర్ అధ్యక్షుడు శ్రీనివాస్ బాబు,ఉపాధ్యక్షులు ధనరాజ్ కోశాధికారి నరసింహ, తదితరులు పాల్గొన్నారు.

## ప్రధాని మోడీ తలపెట్టిన జనగణనతో పాటు కుల గణన చరిత్రాత్మకం.

**బిజెపి అసెంబ్లి ఇంచార్జ్ రవికుమార్ యాదవ్**



**శేరిలింగంపల్లి,మే 3 (వార్తాప్రభ):** భారత్ ప్రధాని నరేంద్ర మోదీ జనగణన తో పాటు కులగణన చేయాలని తలపెట్టిన చారిత్రాత్మక నిర్ణయాన్ని స్వాగతిస్తూ శనివారం హఫీజ్ పేట్ డివిజన్ లోని,మైత్రీ నగర్ కమాన్ వద్ద డివిజన్ అధ్యక్షులు ఆకుల లక్ష్మణ్,జితేందర్ ఆధ్వర్యంలో నరేంద్ర మోదీ చిత్రపటానికి శేరిలింగంపల్లి నియోజకవర్గ బీజేపీ నాయకులతో కలిసి బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, శేరిలింగంపల్లి అసెంబ్లీ ఇంఛార్జి రవికుమార్ యాదవ్ పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రధాని నరేంద్ర మోదీ తలపెట్టిన జనగణనతో పాటు కులగణన చారిత్రాత్మక నిర్ణయమని కొనియాడారు, జనగణన మరియు కులగణన సామాజికంగా ,ఆర్థికంగా,రాజకీయంగా ఎంతో ముఖ్యమైన విషయమని,1872 ప్రారంభమైన ఈ కార్యక్రమం జనగణన అనేది ప్రతి 10 ఏళ్లకోసారి 15 సార్లు కొనసాగించారని,చివరిగా 2011 లో చేపట్టగా తరువాత కోవిడ్ కారణంగా ఆలస్యం జరిగిందని వెల్లడించారు,ఈ వివరాలు సేకరించడం ద్వారావెనుకబడిన అన్ని వర్గాల వారికి సామాజిక న్యాయం,రిజర్వేషన్ల విధానం,వనరుల పంపిణీ, విద్యా,ఉద్యోగం మరియు ఎన్నో ఇతర ప్రయోజనాలు ఉన్నాయన్నారు,కులాల వాస్తవ జనాభా,ఆర్థిక పరిస్థితి,వారు ఏ ప్రదేశాలలో ఉన్నారో తెలుసుకుని, ప్రభుత్వ పథకాలను సమర్థంగా అమలు చేయవచ్చన్నారు,డిజిటల్ టెక్నాలజీ సహాయంతో డేటా సేకరణ చాలా సులువని, జనగణన ఒక దేశం అభివృద్ధికి మార్గదర్శిని అని అలాగే,కులగణన ఆ అభివృద్ధిలో సమానతను తీసుకువచ్చే సాధనమని అన్నారు,మనందరం ఇందులో భాగస్వాములవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు నాగులు గౌడ్, బుచ్చిరెడ్డి,రమణయ్య, రామరాజు,అజిత్ కుమార్, మనోహర్,గణేష్ ముదిరాజ్,శివారెడ్డి, శ్రీనివాస్ రెడ్డి,పట్టాభిరామ్ రాజేష్ గౌడ్, వరప్రసాద్,ప్రభాకర్, శివరాజ్,శ్రీనివాస్,రాము సత్యనారాయణ రాజు,శ్రీనివాస్ యాదవ్,భాష శివ,అభిషేక్,నరేష్ మొదలగు వారు పాల్గొన్నారు.

## ప్రజల భద్రత, సౌకర్యాన్ని నిర్ధారిస్తూ తక్షణమే పనులు పూర్తి చేయాలి

**ఫ్లైఓవర్ పనుల పురోగతిని పరిశీలించి, ఆదేశించిన జిహెచ్ఎంసి కమిషనర్**



**శేరిలింగంపల్లి,మే 3 (వార్తాప్రభ):**జిహెచ్ఎంసి కమిషనర్ ఆర్.వి.కర్ణన్, మరియు జోనల్ కమిషనర్ హేమంత్ సహదేవరావు మరియు శాఖాపరమైన అధికారులతో కలిసి,గచ్చిబౌలి నుండి కొండాపూర్ వరకు జరుగుతున్న ఫేజ్-2 శిల్పా లేఅవుట్ ఫ్లైఓవర్ పనుల పురోగతిని సమీక్షించడానికి నడిచారు. ఈ నెలాఖరు నాటికి పనులు పూర్తి చేయాలని ఆయన సంబంధిత అధికారులను ఆదేశించారు. భూసేకరణ ప్రక్రియ పూర్తయిన తర్వాత సర్వీస్ రోడ్డు పూర్తవుతుందని ప్రాజెక్ట్ ఇంజనీర్లు ఆయనకు తెలియజేశారు. హెచ్-సిటీ ప్రాజెక్ట్‌లో భాగంగా ఖాజాగూడ జంక్షన్‌లోని ప్రతిపాదిత ఫ్లైఓవర్ మరియు అండర్‌పాస్ స్థలాన్ని కూడా కమిషనర్ సందర్శించారు. మల్కం చెరువు వద్ద,పారిశుధ్యం మరియు వీధి కుక్కల బెడద గురించి వాకర్ల ఫిర్యాదులకు ప్రతిస్పందనగా,సమస్యలను పరిష్కరించాలని మరియు ప్రజల భద్రత మరియు సౌకర్యాన్ని నిర్ధారించాలని ఆయన అధికారులను ఆదేశించారు. సరస్సులోకి వర్షపు నీరు ఎలా వస్తుందో కూడా ఆయన ఆరా తీశారు. దుర్గం చెరువు మరియు సమీప నివాస ప్రాంతాల నుండి నీరు వస్తున్నట్లు అధికారులు వివరించారు. సరస్సులోకి వర్షపు నీరు రాకుండా నిరోధించడానికి అవసరమైన చర్యలు తీసుకోవాలని కమిషనర్ అధికారులను ఆదేశించారు. తనిఖీ సమయంలో,డిసి ప్రశాంతి, ఎస్ఈ శంకర్ మరియు ఇతర అధికారులు కమిషనర్‌తో కలిసి పాల్గొనారు

## ఎస్.వి.జి.కళావర్షిని సేవలు అభినందనీయం

**-శాసనసభ్యులు అరికెపూడి గాంధీ**





**శేరిలింగంపల్లి,మే 3 (వార్తాప్రభ):**కొండాపూర్ డివిజన్ పరిధిలోని శ్రీరాంనగర్ కాలనీలో ఏర్పాటు చేసిన ఎస్.వి.జీ.కళావర్షిణి ఇనిస్టిట్యూట్ ఆఫ్ డ్యాన్స్, మ్యూజిక్,ఆర్ట్స్ అండ్ యోగా కేంద్రంతోపాటు మామ్స్ టచ్ పేరిట ఏర్పాటు చేసిన పసి పిల్లల సంరక్షణ కేంద్రాన్ని ముఖ్యఅతిథిగా పాల్గొని పీఏసి చైర్మన్ ఆరెకపూడి గాంధీ ప్రారంభించారు. ఈ సందర్భంగా పీఏసి చైర్మన్ గాంధీ మాట్లాడుతూభారతీయ సంప్రదాయ కళలు మహోన్నతమైనవి అని,పిల్లలకు చిన్నప్పటి నుంచే సంప్రదాయ, శాస్త్రీయ నృత్యకళల్లో శిక్షణ ఇప్పించాలని సూచించారు. భారతీయ వారసత్వ సంపదలైన శాస్త్రీయ సంగీతం,నృత్యం యోగా తదితర కళలను భావితరాలకు అందించాలన్నారు. పిల్లలు కళారంగంలో ప్రావీణ్యం పొందే విధంగా బాల్యం నుంచే తల్లిదండ్రులు ప్రోత్సహించాలన్నారు. వైవిధ్యానికి నిదర్శనమైన మన కళలను పరిరక్షించుకోవాలని,ఆ దిశగా కృషిచేస్తున్న ఎస్.వీ.జీ.కళావర్షిణి లాంటి సంస్థల సేవలు అభినందనీయమని పీఏసి చైర్మన్ గాంధీ తెలియచేసారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ వైద్యురాలు డా.శ్రీదేవిరాగి, ఎస్వీజీ కళావర్షిణి సంస్థ వ్యవస్థాపకురాలు సంధ్యారాణి, స్థానిక నాయకులు చాంద్ పాషా, బాలరామ్ యాదవ్,తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

## ఇండ్ల లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ పూర్తి చేయాలి.

**జయశంకర్ భూపాలపల్లి, మే3 (వార్తాప్రభ):** ఇందిరమ్మ ఇండ్లు మంజూరుకు లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియను పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ ప్రత్యేక అధికారులను ఆదేశించారు. శనివారం క్యాంప్ కార్యాలయం నుండి స్థానిక సంస్థలు అదనపు కలెక్టర్, గృహ నిర్మాణ శాఖ, మండల ప్రత్యేక అధికారులు, ఇందిరమ్మ ఇండ్లు లబ్ధిదారుల విచారణ ప్రత్యేక అధికారులతో టెలి కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ మాట్లాడుతూఇందిరమ్మ ఇండ్లు మంజూరుకు సంబంధించి లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియను వేగంగా పూర్తిచేయాలని స్పష్టం చేశారు. లబ్ధిదారుల ఎంపికలో నిరుపేదలకు ప్రాధాన్యత ఇవ్వాలని, అర్హులైన కుటుంబాలకు న్యాయం జరిగేలా లబ్ధిదారుల ఎంపిక పారదర్శకంగా మరియు సమగ్రంగా నిర్వహించాలని సూచించారు. ఈ కార్యక్రమం ద్వారా నిజంగా అవసరమైన ఇండ్లు లేని పేద కుటుంబాలకు ఇండ్లు ఇవ్వాలన్న ప్రభుత్వ లక్ష్యం నెరవేరుతుందని తెలిపారు. గ్రామ, వార్డు స్థాయిలో అర్హులైన దరఖాస్తుదారుల వివరాలను పరిశీలించి, వారిని ఎంపిక చేయాలని కలెక్టర్ పేర్కొన్నారు. ఎంపిక ప్రక్రియలో ఎలాంటి అక్రమాలు చోటుచేసుకోకూడదని, సాంకేతిక పరిజ్ఞానంతో విచారణ చేయడం జరుగుతుందని, ఏదేని అక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. ఇందిరమ్మ ఇండ్లు మంజూరైన లబ్ధిదారులు తక్షణమే నిర్మాణం చేపట్టేలా అవగహన కల్పించాలని అన్నారు. విడతల వారిగా నిధులు మంజూరు చేయడం జరుగుతుందని వివరించారు.

# వార్తా ప్రభ

# హైదరాబాద్

**బస్సు ని ప్రారంభించిన టిపిసిసి ఉపాధ్యక్షులు,మేడ్చల్ నియోజకవర్గ కాంగ్రెస్ ఇంచార్జీ**

## తోటకూర వజ్రేష్ యాదవ్,రామగుండం ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్.



**కీసర, మే,03:(వార్తా ప్రభ)**కీసర మండల కాంగ్రెస్ నాయకులు మరియు చీరాల నాయకులు,ప్రజలు కలిసి చీరాల నుండి సికింద్రాబాద్ బస్సు సౌకర్యం ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేయడంతో ఈ విషయాన్ని రాష్ట్ర రవాణా,బీసీ సంక్షేమ శాఖ మంత్రి వర్యులు పొన్నం ప్రభాకర్ దృష్టికి తీసుకువెళ్లగా వారు వెంటనే స్పందించి అధికారులకు ఆదేశాలు ఇచ్చి బస్సు మంజూరు చేయించారు,ఈ బస్సును చీరాల లో టిపిసిసి ఉపాధ్యక్షులు మేడ్చల్ నియోజకవర్గ కాంగ్రెస్ ఇంచార్జీ తోటకూర వజ్రేష్ యాదవ్, రామగుండం ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్, అధికారులు,పలువురు నాయకులు,మాజీ ప్రజా ప్రతినిధులు కలిసి ప్రారంభించారు.

## శిల్పారామం లో అంజనా చౌదరి ఆధ్వర్యంలో సృజన జాతీయ నృత్యోత్సవాలు



**శేరిలింగంపల్లి,మే 3 (వార్తాప్రభ):**మాదాపూర్ లోని శిల్పారామం లో అంజనా చౌదరి ఆధ్వర్యం లో రెండు రోజుల సృజన జాతీయ నృత్యోత్సవాలను నిర్వహిస్తున్నారు. కుమారి స్నేహ చే భరతనాట్యం,పీకాక్ డాన్స్,డాక్టర్ రేవతి ప్రసాద్ బృందం నాగిని డాన్స్,కుమారి సంజన చే లావని నృత్యం,డాక్టర్ శ్రీకాంత్ గౌడ్ చే రాజస్థానీ నృత్యం,డాక్టర్ రవి కుమార్ చే బంజారా నృత్యం,వెంకట్ బృందం చే పేరిణి నృత్య ప్రదర్శనలు ఎంతగానో అలరించాయి. పైన శంకర్ డైరెక్టర్ ఏస్ అర్బన్ ఇన్ఫోసిటీ లిమిటెడ్,డాక్టర్ అఖిల్ సీఎండీ శ్రీకర హాస్పిటల్ వారు ముఖ్య అతిధులుగా విచ్చేసి కళాకారులను అభినందించారు.

## సేవా కార్యక్రమాలలో యువత భాగస్వామ్యులు కావాలి

**- వీరు యాదవ్ ఆధ్వర్యంలోని "చలివేంద్రం" ప్రారంభించిన బిజెపి నేత రవి కుమార్ యాదవ్**






**కూకట్ పల్లి, మే3(వార్తాప్రభ):**శేర్లింగంపల్లి నియోజకవర్గం, హైదర్ నగర్ డివిజన్123 పరిధిలోనీ జాతీయ రహదారి, కళామందిర్ బస్ స్టాప్ లో వీరూ యాదవ్ ఆధ్వర్యంలో చలివేంద్రం ఏర్పాటు చేయడం జరిగినది. శనివారం వీరు యాదవ్ ఆహ్వానం మేరకు ముఖ్యఅతిథిగా బిజెపి పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రవికుమార్ యాదవ్ విచ్చేశారు. అనంతరం బిజెపి నాయకులతో కలిసి చలివేంద్రం ప్రారంభించడం జరిగింది. ఈ సందర్భంగా రవికుమార్ యాదవ్ మాట్లాడుతూ జాతీయ ప్రధాన రహదారి పైన పోయే బాటసారులకు వేసవి కాలంలో చలివేంద్రం ఎంతగానో ఉపయోగపడుతుందని ఇలాంటి కార్యక్రమాలు చేయడానికి యువత ముందుకు రావాలని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్లు, డివిజన్ అధ్యక్షులు,సీనియర్ బిజెపి నాయకులు,బీసీ మోర్చా నాయకులు,ఏసి మోర్చా నాయకులు,మహిళా మోర్చా నాయకురాలు,నాయకులు, కార్యకర్తలు,మహిళలు,యువత తదితరులు పాల్గొన్నారు.

## కంటోన్మెంట్ లో సిసి రోడ్లకు శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే శ్రీగణేష్

**సికింద్రాబాద్, మే3(వార్తాప్రభ):**కంటోన్మెంట్ నియోజకవర్గం వార్డు 4 గాంధీ కాలనీ నుంచి ఎల్ఐసి కాలనీ వరకూ నిర్మిస్తున్న సిసి రోడ్డు మరియు అండర్ గ్రౌండ్ డ్రేనేజీ పనులను కాలనీ వాసులతో కలిసి ఎమ్మెల్యే శ్రీగణేష్ శంకుస్థాపన చేశారు. పనులు వేగంగా పూర్తి చేసి త్వరగా కాలనీ వాసులకు అందుబాటులోకి తీసుకురావాలని ఎమ్మెల్యే అధికారులను ఆదేశించడం జరిగింది.

# ఎడిటోరియల్

## బాబు పవన్ మోడీ : ఈ కాంబో వెరీ స్ట్రాంగ్ గురూ !

ఏపీలో రాజకీయం మారిపోయిందని కూటమి పట్ల వ్యతిరేకత వచ్చిందని తరచూ వైసీపీ అంటోంది. అంతే కాదు ఎపుడు ఎన్నికలు వచ్చినా తమదే విజయమని చెబుతోంది. అయితే వైసీపీ ఏ రకమైన అంచనాలు వేసుకుని ఈ విధంగా ధీమా పెంచుకుంటుందో తెలియదు కానీ ఏపీలో టీడీపీ కూటమి వెరీ స్ట్రాంగ్ గా ఉంది అని అంటున్నారు.అమరావతిలో రాజధాని పనుల పునర్ నిర్మాణ కార్యక్రమంలో అది మరోసారి రుజువు అయింది అని అంటున్నారు. ప్రధాని నరేంద్ర మోడీ ఏపీ సీఎం చంద్రబాబు డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ఈ ముగ్గురూ త్రిమూర్తులు మాదిరిగా కూటమికి సారథ్యం వహిస్తున్నారు. ఈ ముగ్గురికీ వ్యక్తిగతంగా బ్రహ్మాండమైన ఇమేజ్ ఎవరికి వారికి ఉంది. అలాగే ముగ్గురికీ అభివృద్ధి మీద తపన ఉంది. ఒక విజన్ ఉంది.రాజకీయాలకు అతీతంగా ఏపీని డెవలప్ చేయాలన్న కోరిక ఉంది. అది జనాలకు కూడా నచ్చుతోంది. అందుకే 2014, 2024లలో ఈ కాంబోని గెలిపించారు. దానికి తగినట్లుగానే అభివృద్ధిని కూడా ఈ ముగ్గురూ చూపిస్తున్నారు. పైగా జాతీయ స్థాయిలో తిరుగులేని స్థితిలో నరేంద్ర మోడీ ఉన్నారు. బలమైన రాజకీయ పక్షంగా బీజేపీ ఉంది. వ్యూహాలలో మోడీ దిట్ట.ఇక ఏపీ సీఎం చంద్రబాబు సైతం విజనరీ మాత్రమే కాదు అపర చాణక్యుడు. ఎక్కడికి ఏది అవసరమో ముందే అంచనా కట్టి దాని ప్రకారం చేసుకుని పోవడంలో బాబుకు సాటి ఎవరూ లేరు. పవన్ జనాకర్షణ శక్తి కానీ ఆయన వెనక ఉన్న బలమైన సామాజిక వర్గం కానీ చూస్తే ఆయన రాజకీయ ఈక్వేషన్స్ ఎంత పవర్ ఫుల్ అన్నది అర్థం అవుతుంది.మరి ఈ ముగ్గురూ కలసికట్టుగా ఉంటే ఓడించడం కష్టం అన్నది కూడా ఒక విశ్లేషణ. అంతే కాదు జనాలకు కూడా ఈ కాంబో బాగా నచ్చేదిగా ఉంది. మేము అభివృద్ధికి కట్టుబడి ఉన్నామని జనవరిలో విశాఖలో జరిగిన సభలో నిరూపించిన ఈ నాయక త్రయం ఇపుడు అమరావతిలోనూ దానికే కొనసాగించారు.ఇంతలా పెనవేసుకుని పోయిన ఈ రాజకీయ బంధాన్ని విడదీయడం ఎవరి వల్లా కాదనే అంటున్నారు. దానికి కారణం మోడీకి దక్షిణాదిన రాజకీయంగా ఏపీ ముఖ్యమైనది. ఆయన టీడీపీ జనసేనలతో కోరి వేరు చేసుకునే పరిస్థితి తెచ్చుకోరు ఆ మాటకు వస్తే 2018లోనూ బీజేపీ టీడీపీని వెళ్ళిపొమ్మనలేదు. ఇక బాబు కూడా గతానుభవాలను గుర్తుకు తెచ్చుకుని బీజేపీ వంటి బలమైన పార్టీతో మోడీ వంటి పవర్ ఫుల్ లీడర్ తో స్నేహాన్ని కంటిన్యూ చేయడానికే చూస్తున్నారు.పవన్ కి బాబు అన్న మోడీ అన్నా ఒక రకమైన ఆరాధన భావం ఉంది. ఈ ఇద్దరి వల్లనే ఏపీ అభివృద్ధి సాధ్యమని ఆయన బలంగా నమ్ముతారు. ఇక రాజకీయం కోసమో మరో దానికో ఆయన కోరి పొత్తులను చిత్తు చేసుకునే నైజం కాదు.ఈ విధంగా ముగ్గురు నేతలూ పట్టుబట్టి కలసికట్టుగా ఉంటే ఈ కూటమిని బద్దలు కొట్టే సాహసం కానీ ఆ బలం కానీ ఎవరికి ఉంది అని అంటున్నారు. ఏపీకి కేంద్ర సాయం కావాలి. అలాగే అభివృద్ధి కావాలి. ఇది సగటు ఆంధ్రుల ఆలోచన. ఇపుడు ఆ విధంగా అంతా కలసి పనిచేస్తూంటే కాదనుకుని ఒంటరిగా ఉంటూ ఎవరి సాయం లేకుండా ఏపీని ఏలుతామని చెప్పే వైసీపీని ఎన్నుకునేందుకు జనాలు మొగ్గు చూపుతారా అన్నదే పెద్ద ప్రశ్న. సో ఏపీలో కూటమి వెరీ స్ట్రాంగ్ అన్నది వాస్తవం.

## ఇక చకచకా అమరావతి పనులు

**విజయవాడ, మే 3 :(వార్తా ప్రభ ప్రతినిధి)** ఏపీ రాజధాని అమరావతి ప్రాధాన్యత, ప్రత్యేకత, నిర్మాణంపై సాక్షాత్తూ దేశ ప్రధాని నరేంద్ర మోదీ చేసిన కీలక వ్యాఖ్యలివి. ప్రధాని చేసిన ఈ వ్యాఖ్యలతో ఏపీకి ఒక భరోసా, రాజధాని కల సాకారమైందన్న ఒక నమ్మకం కలిగినట్లు అయింది. రాజదాని అమరావతి నిర్మాణాన్ని మనం చెయ్యాలి?మనమే చెయ్యాలని మోదీ నొక్కిమరీ చెప్పారు. అంటే ఏపీలో ఇప్పుడున్నది కూటమి ప్రభుత్వం. టీడీపీ, జనసేన, బీజేపీ కలిసి కూటమిగా ఏర్పాడ్డాయి.కేంద్రంలో బీజేపీ సర్కార్ ఉంది. దీంతో రాజధాని నిర్మాణానికి పూచికపుల్లంతా అడ్డుకూడా రాదనేది మోదీ మాటలను బట్టి అర్థం చేసుకోవచ్చని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. రాజధాని నిర్మాణానికి కావాల్సిన నిధులిచ్చేందుకు కేంద్రం సిద్ధంగా ఉంది. కావాల్సిందల్లా రాజధాని నిర్మాణం..అదీ కేంద్రం సహకారంతో ఏపీలోని కూటమి ప్రభుత్వం పూర్తి చేయాలని మోదీ స్పష్టంగా చెప్పకనే చెప్పారన్నారు.వడ్డించేవాడు మనవాడైతే బంతిలో ఎక్కడ కూర్చుంటే ఏంటి అన్నట్లుగా?కేంద్రంలో మోదీ సర్కార్ ఉండడంతో ఇక రాజధాని అమరావతి నిర్మాణానికి ఎవరూ అడ్డుపడరని..ఏదీ అడ్డు రాదని?చక చకా రాజధానిని సీఎం చంద్రబాబు నిర్మించుకోవాలని ఫుల్ పవర్స్ ఇచ్చేశారు ప్రధాని మోదీ. 2019 ఎన్నికల్లో జగన్ సీఎం కావడంతో అమరావతి నిర్మాణానికి ఒక్కసారిగా బ్రేకులు పడ్డాయి. మూడు రాజధానుల అంశాన్ని జగన్ తెరపైకి తేవడంతో అప్పటివరకున్న అమరావతి తెరమరుగైంది.సీన్ కట్ చేస్తే ఏపీలో ఇప్పుడు కూటమి ప్రభుత్వం కొలువుదీరింది. దీంతో రాజధాని అమరావతిపై ఐదుకోట్ల ఆంధ్రుల్లో మళ్లీ ఆశలు చిగురించాయి. మరోసారి ప్రధాని మోదీ అమరావతి పునర్మిర్మాణ పనులను ప్రారంభించడంతో..ఐదు కోట్ల ఆంధ్రులు కన్న కలలు ఎట్టకేలకు సాకారం కాబోతున్నాయి. ఉమ్మడి ఏపీ విభజన తర్వాత ఇన్నాళ్లూ రాజధాని లేని రాష్ట్రంగా ఉన్న ఏపీకి ఇప్పుడొక రాజధాని అనేది ఖరారైంది. దీంతో ఆంధ్రుల కలల రాజధాని అమరావతి తిరిగి పురుడు పోసుకుంది. అనేక సవాళ్లు, పోరాటాల మధ్య అమరావతి పునరుజ్జీవం పొందింది. ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర ఆర్థికాభివృద్ధికి రాజధాని అమరావతి బాటలు వేయనుంది.ప్రధాని మోదీ రాకతో అమరావతి 2.0 మొదలైంది. ఏపీ రాష్ట్రంలో నవశకం మొదలైందనే చెప్పాలి. అమరావతి నిర్మాణ పనులను ఏకకాలంలో చేపట్టేలా దాదాపు 77,250 కోట్లతో అంచనాలు సిద్ధం చేసింది కూటమి ప్రభుత్వం. ఇదే క్రమంలో 49వేల కోట్ల పనులకు ఇప్పటికే టెండర్లను ఖరారు చేసింది. దీంతో రాజధాని నిర్మాణ పనులను పరుగులు పెట్టిస్తోంది. ఎట్టిపరిస్థితుల్లోనూ వీలైనంత తొందరగా పని పూర్తి చేయాలని ఫిక్సయ్యింది.ఇదే సమయంలో రాజధాని అమరావతికి రైలు సౌకర్యం కల్పించేందుకు రైల్వే బోర్డు కూడా అంగీకారం తెలుపుతూ 2వేల 47కోట్లను మంజూరు చేసింది. ఎర్రుపాలెం-నంబూర్ మధ్య 56.53 కి.మీ. మేర రైల్వే లైన్ రానుంది. అదేవిధంగా 189.4 కి.మీ. పొడవున అమరావతి అవుటర్ రింగ్ రోడ్ ను 16,310 కోట్లతో చేపట్టేందుకు కేంద్రం ఆమోదించింది. దీనికి సంబంధించిన ఖర్చును భరించేందుకు కేంద్రం ముందుకొచ్చింది.మొత్తానికి కేంద్రం సహకారంతో అమరావతి నిర్మాణ పనులు చకచకా సాగిపోనున్నాయి. దీంతో ఏపీ రాజధాని అమరావతి కల అతి త్వరలోనే సాకారం కాబోతుంది. మరో మూడు, మూడున్నరేళ్లలో అమరావతి ఓ అందమైన రూపాన్ని సంతరించుకోనుంది. దీని కోసం ఐదు కోట్ల ఆంధ్రులు వెయ్యి కళ్లతో ఎదురుచూస్తున్నారు.

# వేసవిలో త్రాగునీటి సరఫరాకు పటిష్ట చర్యలు

### విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర



**విజయవాడ పశ్చిమ మే 3 :(వార్తా ప్రభ ప్రతినిధి)**నగర ప్రజలకు వేసవి కాలంలో తాగునీటి ఎద్దడి లేకుండా సమ్మర్ యాక్షన్ ప్లాన్ - 2025 లో భాగం గా విజయవాడ నగర పాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర ఇంజనీరింగ్ సిబ్బందితో శనివారం ఉదయం టెలి కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ సమ్మర్ యాక్షన్ ప్లాన్ - 2025 లో భాగం గా రూ.11.85 కోట్లు కేటాయించారని తెలిపారు. నగరంలోని అన్ని హ్యాండ్ బోర్లు రిపేర్ చేసి, ఫ్లషింగ్ చేయించి పూర్తిగా పనిచేసేలా మార్పులు చేపట్టారని, నీటి ఎద్దడి మరియు అధిక డిమాండ్ ఉన్న ప్రాంతాల్లో అదనంగా హ్యాండ్ బోర్లు మరియు పవర్ బోర్లు ఏర్పాటు చేశారని, నీటి సరఫరాకు ఉపయోగించే అన్ని మోటార్లను రిపేర్ చేసి పనిచేసే స్థితికి తీసుకువచ్చారని, నీటి సరఫరా నిలిచిపోయే పరిస్థితుల్లో తక్షణం మోటార్‌లను మార్చేందుకు స్టాండ్ బైగా అదనపు మోటార్లు మరియు పంపులు కొనుగోలు చేశారని అన్నారు. నీటి పైప్‌లైన్‌లు మరియు వాల్వుల్లో ఏవైనా నష్టం/విచ్ఛిన్నం చోటుచేసుకున్నపుడు వెంటనే మరమ్మతులు చేపట్టేందుకు అవసరమైన పైప్ మరియు వాల్వ్ స్పేర్ మటీరియల్‌ను నిల్వలో ఉంచారని, హెడ్ వాటర్ వర్క్స్ మరియు బూస్టర్‌లకు జనరేటర్లు సరఫరా కోసం టెండర్లు ఖరారు చేసి, ఏజెన్సీని ఎంపిక చేశారని, విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడినప్పుడు వెంటనే ఉపయోగించేందుకు జనరేటర్లు సిద్ధంగా ఉంచారని, మోటార్లకు సంబంధించిన అన్ని ప్యానెల్ బోర్డులు సర్వీసింగ్ చేయబడి, అవసరమైన స్పేర్ పార్ట్స్ స్టాక్‌లో ఉంచబడ్డాయి, తద్వారా నీటి సరఫరాలో అంతరాయం జరగకుండా ఉంటుందని కమీషనర్ అన్నారు. ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేయడానికి టెండర్లు ఖరారు చేశారని, డిమాండ్ ఉన్న ప్రాంతాల్లో అవసరానికి అనుగుణంగా నీటి సరఫరా చేస్తున్నారని, మరమ్మతులలో ఉన్న కంట్రోల్ వాల్వులను కొత్త వాల్వులతో భర్తీ చేశారాని, ఇవి ప్రధానంగా ఈఎల్ఎస్ఆర్ లు, డిస్ట్రిబ్యూషన్ నెట్‌వర్క్ లో అమలు చేస్తారని కమీషనర్ తెలిపారు. నీటిలో నాణ్యతను కాపాడేందుకు కొన్ని ప్రాంతాల్లో, ముఖ్యంగా ఈఎల్ఎస్ఆర్‌లు, జిఎల్ఎస్ఆర్‌లు మరియు బూస్టర్ స్టేషన్ల వద్ద ఆన్లైన్ క్లోరినేటర్లు అమర్చారని, వేసవి కాలంలో ప్రయాణం చేసే ప్రజలకు త్రాగున్నీరు అందించేందుకు నగరంలో మొత్తం 81 చలివేంద్రాలు ఏర్పాటు చేశారని అన్నారు.

# 'ఇంద్రకీలాద్రి పై వైభవంగా సుబ్రహ్మణ్యస్వామి కళ్యాణం'







**విజయవాడ పశ్చిమ మే 3 :(వార్తా ప్రభ ప్రతినిధి)**విజయవాడ ఇంద్రకీలాద్రిపై శనివారం శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి కళ్యాణం అత్యంత వైభవంగా జరిగింది.ఈ సందర్భంగా పూజారులు ఆయన చరిత్రను భక్తులకు వివరించారు. సుబ్రహ్మణ్యం స్వామి కారణ జన్ముడు. తారకాసుర సంహారం కోసం జన్మించినవాడు. ఆది దంపతులైన శివపార్వతులకు తనయుడైన ఈ స్వామి దేవగణానికి సర్వసేనాధిపతిగా సర్వశక్తిమంతుడై కొనియాడబడ్డాడు.సర్పరూపుడైన సుబ్రహ్మణ్యేశ్వరుడు కుజునకు, రాహువునకు అధిష్టాన దేవతయై ఉన్నారు.మానవ దైనందిన జీవితంలో కుజునికి అత్యంత ప్రాధాన్యం ఉంది.మానవ శరీరంలో ఉండే కుండలినీ శక్తికి సుబ్రహ్మణ్యస్వామి ఆధిదైవం. కుండలినీశక్తి మానవుని నడిపిస్తుంది.కుజుడు మానవులకు శక్తిని , ధనాన్ని, ధైర్యాన్నిస్తాడు.అందువల్ల సుబ్రహ్మణ్య ఆరాధనచేస్తే అవన్నీ మానవులకు సమకూరుతాయిని విశ్వాసం.సుబ్రహ్మణ్యేశ్వరుడు సర్పరూపుడు కావడంవల్ల, సర్పగ్రహాలైన రాహుకేతువులు సుబ్రహ్మణ్య స్వామి ఆధీనంలో ఉంటారని, అందువల్ల సుబ్రహ్మణ్య ఆరాధనం, సుబ్రహ్మణ్య పూజ సర్వ శుభాలనిచ్చి, రాహుకేతు దోషాలకు కూడా పరిహారంగా భావించబడుతోందని పురాణోక్తి అని తెలిపారు.షష్టి నాడు శ్రీ వల్లి దేవసేన సమేత సుబ్రహ్మణ్యస్వామి కళ్యాణం జరిపించడం, వీక్షించడం వలన అవివాహితులకు వివాహ సంబంధ ఆటంకాలు తొలగి వివాహాలు జరిగి, సత్సంతానం కలుగుతుందని పెద్దలు చెబుతున్నారు. విశిష్టమైన ఇంద్రకీలాద్రి క్షేత్రంలో షష్టి రోజున సుబ్రహ్మణ్య స్వామి కళ్యాణం జరిపించిన వారికి సత్సంతాన ప్రాప్తి, రాబోయే తరాలవారికి కూడా సంతానలేమి లేకుండా వంశాభివృద్ధి జరుగుతుందని భక్తుల విశ్వాసం.షష్టిని పురస్కరించుకుని శనివారం ఉదయం మహమండపం 7వ అంతస్తు లో మంగళవాయిద్యములు, వేదపండితుల మంత్రోచ్చారణాల నడుమ శ్రీ వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్య స్వామి వార్ల కళ్యాణం శాస్త్రోక్తముగా నిర్వహించడం జరిగినది.ఈ సేవలో భక్తులు విశేషముగా పాల్గొని, శ్రీ వల్లీ దేవసేన సమేత స్వామివార్ల కళ్యాణం తిలకించారు.

# వైన్ షాప్ వద్ద మహిళల్లో ఆందోళన

### వ్యతిరేక నినాదాలతో వైన్ షాపు ముందు బైఠాయింపు




**మచిలీపట్నం మే 3 :(వార్తా ప్రభ ప్రతినిధి)**మచిలీపట్నం పోతేపల్లి గ్రామం శక్తి వైన్స్ వద్ద మహిళలు శనివారం ఆందోళనకు దిగారు. జనావాసాల మధ్య వైన్ షాప్ నిర్వహించడం పై మంత్రి కొల్లు రవీంద్ర, హోమ్ మినిస్టర్ అనితకు ఫిర్యాదులు చేసిన ఎటువంటి ఫలితం లేకపోవడంతో వైన్ షాప్ పై స్థానికులు ప్రత్యక్షంగా ఆందోళన చేశారు. ఇటీవల కాలంలో వైన్ షాపులో తాగుబోతుల ఆగడాలు శృతిమించుతున్నాయని, మహిళల పట్ల అసభ్యంగా ప్రవర్తిస్తున్నారని చిన్నపిల్లలను సైతం మద్యం తాగాలని ప్రోత్సహిస్తున్నారని స్థానికులు తీవ్రంగా ఆరోపణలు చేశారు.వైన్ షాప్ యాజమాన్యం కు వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ షాపు ముందు పై బైఠాయించారు. వైన్ షాప్ యాజమాన్యం కు స్థానికులకు వాగ్వాదం జరగటంతో కొంత సమయం ఉద్రిక్తత వాతావరణం ఏర్పడింది. మచిలీపట్నం రూరల్ పోలీసులు రంగ ప్రవేశం చేయటంతో స్థానికులు ఆందోళనను విరమించారు. అధికారులు స్పందించి శక్తి వహించును వేరే ప్రాంతానికి మార్చాలని లేదంటే తమ ఉద్యమంను రానున్న రోజుల్లో మరింత ఉధృతం చేస్తామని వైన్స్ పై ఫిర్యాదు చేయడానికి త్వరలో డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ కలుస్తున్నామని స్థానిక మహిళలు తెలిపారు.అయితే ఇది ఇలా ఉండగా వైన్ షాప్ ముందు మహిళలు ఆందోళన చేయడంతో షాపు యాజమాన్యం స్పందించారు. ప్రభుత్వ నిబంధనలకు లోబడి వైన్స్ వ్యాపారం నిర్వహిస్తున్నామని లక్షల పెట్టుబడులు పెట్టి వైన్స్ నిర్వహిస్తుంటే కొంతమంది కావాలని రాద్ధాంతం చేస్తున్నారని వ్యాపారంలో 15% వాటా ఇవ్వలేదని అక్కస్సుతో యాజమాన్యంను ఇబ్బంది పెడుతున్నారని అన్నారు. ప్రతివారం జిల్లా కలెక్టర్ కు మీకోసం లో ఫిర్యాదు చేస్తున్నారని తెలిపారు. స్థానికుల ఫిర్యాదుతో ఎక్సైజ్ అధికారులు తనిఖీ నిర్వహించి ఫిర్యాదు అవాస్తవాన్ని తేల్చారని శక్తి వైన్స్ యాజమాన్యం తెలిపింది.

# ప్రతిభావంతులైన విద్యార్థులకు పేదరికం అడ్డు కాకూడదు

**గుంటూరు మే 3 :(వార్తా ప్రభ ప్రతినిధి)**ప్రతిభావంతులైన విద్యార్థులను సత్య సెక్యూరిటీ, ఇన్వెస్టిగేషన్ సంస్థ ప్రోత్సహించడం ప్రశంసనీయమని సీనియర్ ఐ ఎ యస్ అధికారి, పొగాకు బోర్డు మాజీ ఈడి అద్దంకి శ్రీధర్ బాబు అన్నారు. సత్య సెక్యూరిటీ లో పని చేస్తున్న ఉద్యోగుల పిల్లల్లో ఇంటర్, పదో తరగతుల్లో ప్రతిభ చూపించిన 20 మందికి శనివారం గుంటూరు బృందావన గార్డెన్స్ సంస్థ కార్యాలయం లో ఉపకార వేతనాలు పంపిణి చేశారు. ఈ సందర్భంగా సంస్థ యండి కాళహస్తి సత్యనారాయణ అధ్యక్షతన జరిగిన సమావేశం లో శ్రీధర్ బాబు ప్రసంగిస్తూ విద్యార్థులు బాల్యంలోనే తమ లక్ష్యాలను నిర్దేశించు కోవాలన్నారు. దానికి అనుగుణంగా ప్రణాళికలను రూపొందించుకుని ఉన్న త స్థాయి చేరుకోవాలని సూచించారు. మేయర్ కోవెలమూడి నాని మాట్లాడుతూ విద్యార్థులు బాల్యం నుంచే సేవ, స్నేహ భావాలను పెంచుకోవాలన్నారు. తల్లితండ్రులను గౌరవించి సమాజానికి ఉపయోగపడే విధంగా ఎదగాలన్నారు. జన చైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మణ రెడ్డిమాట్లాడుతు సాంకేతిక పరిజ్ఞానాన్ని పెంచుకోవాలన్నారు. ఆడిటర్ భార్గవి మాట్లాడుతూ ప్రతిభా వంతులకు పేదరికం అడ్డు కాదన్నారు. రైల్వే శాఖ ఉన్నతాధికారి మోహన్ కృష్ణ మాట్లాడుతూ జాతీయ, అంతర్జాతీయ మార్పులకు అనుగుణంగా విద్యార్థులు తమ ప్రతిభ ను పెంచుకోవాలన్నారు.సంస్థ ఎండి కాళహస్తి సత్యనారాయణ మాట్లాడుతూ ఉద్యోగుల సంక్షేమానికి తమ సంస్థ ప్రాధాన్యత ఇస్తోందన్నారు. ప్రతిభావంతులైన పేద విద్యార్థులకు అండగా నిలుస్తామని ఆయన అన్నారు. కార్యక్రమంలో ఎరిస్ కంపెనీ జిల్లా అధినేత రత్తయ్య, విశ్రాంత లెక్చరర్ జివి రాయుడు, సత్య సెక్యూరిటీస్ మేనేజర్ సత్య సాయి, ఎగ్జిక్యూటివ్ లిడియా, విశ్రాంత డిఎస్పీలు సుబ్బారెడ్డి, భగీరథ బాబు, కెవి నారాయణ, కార్పొరేటర్ బాబు, మాజీ కార్పొరేటర్ ముత్తినేని రాజేష్, రామినేని సుబ్బారావు పాల్గొన్నారు.



## క్రికెట్ టోర్నమెంటును ప్రారంభించిన శాసనసభ్యులు శ్రీరాం రాజగోపాల్ తాతయ్య



**వత్సవాయి మే 3 (వార్తప్రభ)**వత్సవాయి గ్రామ హై స్కూల్ నందు ఫ్రెండ్స్ యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన రాష్ట్రస్థాయి టెన్నిస్ బాల్ క్రికెట్ పోటీలను స్థానిక నాయకులతో కలిసి ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ తాతయ్య ముందుగా క్రీడాకారులను పరిచయం చేసుకొని క్రికెట్ బ్యాట్ ఆడి పోటీలను ప్రారంభించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.క్రీడాకారులు సమయస్ఫూర్తితో ఆటలను ఆడాలని, క్రీడల వల్ల మానసిక ఉల్లాసం కలుగుతుందని అన్నారు ఈ సందర్భంగా ఫ్రెండ్స్ యూత్ కమిటీ సభ్యులను ఎమ్మెల్యే అభినందించారు.ఈ కార్యక్రమంలో వత్సవాయి మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు వడ్లమూడి రాంబాబు, పెద్ది రామారావు, చిట్టూరి రమేష్, ఉప్పు గంట్ల రాధాకృష్ణ, కొణతాల రామకృష్ణ,మన్నె నారాయణ రావు, నరమనేని శ్రీను, నెల్లూరి శ్రీను, చెన్న బాలకృష్ణ, మండల సమైక్య కృష్ణవేణి, ఏసుపోగు రవి, రాయల మోహన్రావు, బొబ్బిళ్ళపాటి ప్రసాద్, దారెల్లి చిరంజీవి, బొల్లం పురుషోత్తం, మార్కపుడి వంశి, ఆదిమళ్ల రమేష్, అన్నెపాక దుర్గ,దాసు, వడ్లమూడి అజేష్,పి ఈ టి బాబురావు, షేక్ దూద్ కె, షేకు సైదా, రాయబారపు కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

## మంత్రుల ఇండ్లను ముట్టడిస్తాం- సిహెచ్‌ఓలు

### వినూత్న రీతిలో సమ్మె



**మచిలీపట్నం మే 3 :(వార్తా ప్రభ ప్రతినిధి)**సమస్యల పరిష్కారం కోసం శాంతియుత సమ్మెబాట పట్టిన ఆయుష్మాన్ ఆరోగ్యం మందిరం విలేజ్ క్లినిక్ సిహెచ్ఓ ల బాధ కూటమి ప్రభుత్వం కు పట్టడం లేదు. ఆరు సంవత్సరాలు విధులు నిర్వర్తించిన విలేజ్ క్లినిక్ ఉద్యోగులు సిహెచ్ఓ లను క్రమబద్ధీకరించాలని, జీతాలను పెంచాలని గత ఆరు రోజులుగా సమ్మె చేస్తున్న ప్రభుత్వం పట్టిపట్టనట్లు వ్యవహరిస్తున్నారు అని వాపోయారు. మచిలీపట్నం జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద ఉన్న ధర్నా చౌక్ లో వినూత్న రీతిలో కళ్ళు,నోరు మూసుకుని నిరసన తెలిపారు. ప్రభుత్వం స్పందించి తమ విలేజ్ క్లినిక్ ఉద్యోగుల డిమాండ్లను పరిష్కరించాలని కోరారు.సిహెచ్ వాళ్ళు రాష్ట్రవ్యాప్తంగా గత నెల 16వ తేదీ నుండి ఆందోళన చేస్తున్నారు తమ డిమాండ్లను నెరవేర్చాలని ప్రభుత్వానికి అనేక విజ్ఞప్తులు చేస్తున్నారు. అయినా కూటమి ప్రభుత్వం వారితో సంప్రదింపులు జరపటానికి కూడా సుముఖత చూపలేదు. గత కొన్ని రోజులుగా విధులను బహిష్కరించి సమ్మె చేయటం గ్రామీణ ప్రాంత మహిళలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని తెలిపారు. ప్రభుత్వం వెంటనే స్పందించి తమ డిమాండ్లను నెరవేర్చకపోతే సమ్మెను రాష్ట్రవ్యాప్తంగా ఉధృతం చేస్తామని, మంత్రుల ఇళ్లను ముట్టడిస్తామని అల్టిమేటం జారీ చేశారు.ఈ కార్యక్రమంలో పి వీర నాగబాబు, పి శ్రావణి కాటూరు,సోనికా ఝాన్సీ తదితర సిహెచ్‌ఓ లు పాల్గొన్నారు.

## పాతబస్తీ శ్రీ విజయేశ్వర స్వామి వారి దేవస్థానం షాపుల వేలం పాట వాయిదా

**విజయవాడ పశ్చిమ మే 3 :(వార్తా ప్రభ ప్రతినిధి)**విజయవాడ పశ్చిమ నియోజకవర్గ పరిధిలోని పాతబస్తీలో ని విజయేశ్వర స్వామి దేవాలయం కి చెందిన 9 షాపుల బహిరంగ వేలం పాట కొన్ని కారణాలవల్ల వాయిదా వేసినట్లు దేవస్థానం ఈవో కే వెంకటరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. శనివారం ఉదయం నిర్వహించిన షాపుల అద్దెకిచ్చే బహిరంగ వేలం పాటకు సరైన రీతిలో పాటదారులు పాల్గొనక పోవడంతో ఈ వేలంపాటను వాయిదా చేసినట్లు తెలిపారు. దేవాదాయ ధర్మాదాయ ఉన్నత శాఖ అధికారుల ఆదేశాల మేరకు తుది నిర్ణయం తీసుకోవడం జరుగుతుందన్నారు.

## రాష్ట్ర సంస్కృతి ప్రతిబింబించేలా 'మసులా ఫెస్ట్ -2025.

- దేశ విదేశాల అతిధులకు ఇబ్బంది లేకుండా ఏర్పాట్లు
- వాటర్ స్పోర్ట్స్ నిర్వహణకూ కేంద్రం ఆమోదం
- హోటల్ యాజమాన్యాలతో సమావేశం అనంతరం మంత్రి కొల్లు రవీంద్ర

**మచిలీపట్నం మే 3 :(వార్తా ప్రభ ప్రతినిధి)**మన రాష్ట్ర సంస్కృతి, సంప్రదాయాలు, వంటకాలను ప్రపంచానికి చాటి చెప్పేలా 'మసులా ఫెస్ట్ -2025' ఈ నెల 15 నుండి 18 వరకు నిర్వహించబోతున్నట్లు రాష్ట్ర గనులు, భూగర్భ వనరులు, ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర పేర్కొన్నారు. ఈ మేరకు బీచ్ ఫెస్టివల్‌కు వచ్చే అతిధులకు ఇబ్బందులు లేకుండా ఆతిధ్యం కల్పించాలన్నారు. మచిలీపట్నం పరిధిలోని హోటల్ యాజమాన్యాలు, గెస్ట్ హౌస్ యజమానులతో సమావేశం నిర్వహించారు. 2018లో నిర్వహించిన బీచ్ ఫెస్టివల్‌ను మించి నేడు జరిపించేందుకు సన్నాహాలు చేస్తున్నామన్నారు. అందుకు హోటల్ యాజమాన్యాలు కూడా సహకరించాలని సూచించారు. కయాకింగ్, బీచ్ కబడ్డీ నిర్వహణకు కేంద్రం నుండి ఆమోదం లభించిందన్నారు. వాటర్ స్పోర్ట్స్ నిర్వహణకు కూడా ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహించే కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని, ట్రాఫిక్ సమస్యలు లేకుండా చూడాలని అన్నారు. ఒకటి రెండు రోజులలో పూర్తి షెడ్యూల్, అతిధుల వివరాలు అన్నీ ప్రకటించబోతున్నట్లు మంత్రి కొల్లు రవీంద్ర తెలిపారు.



# మేధోసంపత్తి హక్కులపై అవగాహన అవసరం




**విజయవాడ పశ్చిమ మే 3 :(వార్తా ప్రభ ప్రతినిధి)**మేధోసంపత్తి హక్కులపై ప్రతి వ్యాపార, పారిశ్రామిక రంగ విద్యార్థులకు అవగాహన అవసరమని అమెకాన్ ఐపీఆర్ అటర్నీస్ సీఈవో శివశంకర్ కస్తూరి అన్నారు. పొట్టిశ్రీరాములు చలవాది మల్లికార్జునరావు కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ డవలప్‌మెంట్ సెల్ ఆధ్వర్యంలో 'ఇంటలెక్చువల్ ప్రాపర్టీ రైట్స్ %-% యువర్ ఇన్నోవేషన్ %-% యువర్‌ప్రొటక్షన్' అనే అంశంపై అవగాహన సదస్సును శనివారం నిర్వహించారు. ఈ సందర్భంంగా ముఖ్యవక్తగా హాజరైన శివశంకర కస్తూరి మాట్లాడుతూ పేటెంట్లు, ట్రేడ్‌మార్కులు, డిజైన్ హక్కులు, కాపీరైట్స్ తదితర అంశాలపై ప్రసంగించారు. మేధోసంపత్తి అంశాలపై చాలా మందికి అవగాహన లేకపోవటంతో విలువైన ఆదాయాన్ని కోల్పోతున్నారన్నారు. కొన్ని దేశాల్లో ఈ హక్కులపై విస్తృతమైన ఆదాయాన్ని పొందుతున్న తీరును వివరించారు. విద్యార్థులు తమ ఆవిష్కరణలను ఎలా చట్టబద్ధంగా నమోదు చేసుకోవచ్చో, వాటిని ఎలా రక్షించుకోవాలో వివరించారు. కళాశాల కార్యదర్శి చిట్టా అమర్‌సుధీర్ మాట్లాడుతూ విద్యార్థులు తమతమ రంగాల్లో వస్తున్న మార్పులను, అవకాశాలను తెలుసుకోవాలన్నారు. వాటిపై పట్టు సాధించాలన్నారు. ఆ దిశగా విద్యార్థులను తీర్చిదిద్దటానికి ఈ కార్యక్రమాలను నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ శరవణకుమార్, విభాగాధిపతి వై సుధాచంద్ర తదితరులు పాల్గొన్నారు.

## ఎస్వీ వైద్య కళాశాల ప్రిన్సిపాల్, రుయా ఆసుపత్రి సూపరిటెండెంట్ బదిలీ





**తిరుపతి : మే 3 :(వార్తా ప్రభ ప్రతినిధి)**ఎస్ వి వైద్య కళాశాల అదనపు వైద్య విద్య సంచాలకులు మరియు ప్రిన్సిపాల్ గా డాక్టర్ జె.రాధ, రుయా ఆస్పత్రి అదనపు వైద్య విద్య సంచాలకులు మరియు సూపరిటెండెంట్ డాక్టర్ జి.రవి ప్రభు శనివారం బాధ్యతలు చేపట్టారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఆదేశాల మేరకు ఇరువురు రెండోసారి బదిలీపై తిరుపతిలోనే రుయా నుండి మెడికల్ కాలేజ్ కు మెడికల్ కాలేజీ నుండి రుయాకు బదిలీ అయ్యారు. రెండోసారి కళాశాల ప్రిన్సిపాల్ గా డాక్టర్ జి.రవి ప్రభు, మొట్టమొదటిసారిగా సూపరిటెండెంట్ డాక్టర్ జె.రాధా బాధ్యతలు స్వీకరించనున్నారు. ఈ సందర్భంగా డాక్టర్ జి.రవి ప్రభు మాట్లాడుతూ వైద్య విద్య సంచాలకులు విజయవాడ వారి సందేశాలు వచ్చిన వెంటనే బాధ్యతలు చేపట్టడం జరుగుతుందని ఈ సందర్భంగా ఆయన తెలిపారు. డాక్టర్ జె రాధ మాట్లాడుతూ రుయా ఆసుపత్రి అభివృద్ధికి అందరి సహాయ సహకారాలతో ముందుకు తీసుకుని వెళ్లి పేద రోగులకు మెరుగైన వైద్యం అందించడానికి అన్ని విధాల సహాయ సహకారాలు అందిస్తానని ఈ సందర్భంగా ఆమె తెలిపారుఈ కార్యక్రమంలో ఎస్ వి వైద్య కళాశాల వైద్యులు, వైద్య సిబ్బంది, వైద్య విద్యార్థులు, మరియు ఎస్ వి వైద్య కళాశాల పిఆర్ఓ వీర కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

# బాధిత కుటుంబానికి ఎల్ఓసి అందజేసిన రాష్ట్ర మంత్రి కొలుసు పార్థసారథి

### కేవలం 24 గంటల వ్యవధిలో మెరుగైన వైద్యం కోసం రూ.2 లక్షల ఎల్ వో సి మంజూరు.



**నూజివీడు,మే 03, (వార్త ప్రభ )**రాష్ట్రంలో ఏ ఒక్క పేదవాడు మెరుగైన వైద్యానికి దూరం కాకూడదు మంత్రి కొలుసు పార్థసారధి.అపత్కాలంలో నిరుపేదలకు మెరుగైన వైద్యం అందించడంలో సిఎంఆర్ఎఫ్ అండగా నిలుస్తుందని రాష్ట్ర గృహనిర్మాణ,సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారథి అన్నారు. ఆగిరిపల్లి మండలం ఎస్. ఏ పేట గ్రామానికి చెందిన పి. నాగరాజు అనారోగ్యంతో బాధపడుతున్నారని వారి మెరుగైన చికిత్స కోసం కొంత ఆర్థికసహాయం కోసం కుటుంబసభ్యులు మంత్రి కొలుసు పార్థసారధి దృష్టికి తీసుకురాగా కేవలం 24 గంటల్లో శనివారం చికిత్స నిమిత్తం ముఖ్యమంత్రి సహాయనిధి నుండి రూ,2లక్షల రూపాయల ఎల్ వో సి మంజూరు పత్రాన్ని కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా ఎల్ఓసిని మంజూరు చేయించిన రాష్ట్ర మంత్రి కొలుసు పార్థసారథికి బాధిత కుటుంబ సభ్యులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు,కేవలం 24 గంటల్లో ఆర్థిక సహాయం అందడంతో బాధిత కుటుంభం సమయానికి దేవుడిలా మంత్రి అదుకొన్నారని తమ కృతజ్ఞతను తెలిపారు.

# నెలకు రూ.60 వేల జీతం... జాబ్ నోటిఫికేషన్ విడుదల చేసిన ఏపీ ప్రభుత్వం'

**● ఆంధ్రప్రదేశ్ ప్రణాళికా శాఖలో 175 యంగ్ ప్రొఫెషనల్స్ పోస్టులు ● కాంట్రాక్టు పద్ధతిలో ఏడాది కాలానికి నియామకం ● ఎంబిఏ లేదా పీజీ ఉత్తీర్ణత అర్హత ● ఎంపికైన వారికి నెలకు రూ.60,000 వేతనం ● నియోజకవర్గాల విజన్ ప్లాన్, పి4 కార్యక్రమ సమన్వయానికి నియామకాలు**

**విజయవాడ,మే 3 :(వార్తా ప్రభ ప్రతినిధి)**ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నిరుద్యోగులకు శుభవార్త చెప్పింది. రాష్ట్ర ప్రణాళికా శాఖలో ఖాళీగా ఉన్న 175 యంగ్ ప్రొఫెషనల్స్ పోస్టులను కాంట్రాక్టు ప్రాతిపదికన భర్తీ చేసేందుకు నోటిఫికేషన్ జారీ చేసింది. రాష్ట్రంలోని 175 నియోజకవర్గాలకు సంబంధించిన విజన్ యాక్షన్ ప్లాన్ రూపకల్పన, ప్రభుత్వ పి4 కార్యక్రమాల సమన్వయం కోసం ఈ నియామకాలు చేపట్టనున్నట్లు ప్రభుత్వం పేర్కొంది.కొత్తగా ఏర్పడిన కూటమి ప్రభుత్వం ఈ పోస్టుల భర్తీకి చర్యలు చేపట్టింది. ప్రస్తుతం ఈ యంగ్ ప్రొఫెషనల్స్ నియామకాలు ఏడాది కాలానికి ఒప్పంద పద్ధతిలో జరుగుతాయి. అభ్యర్థుల పనితీరు, అవసరాల ఆధారంగా ఈ కాంట్రాక్టు కాలాన్ని భవిష్యత్తులో పొడిగించే అవకాశం ఉందని తెలుస్తోంది. రాష్ట్రవ్యాప్తంగా ప్రతి నియోజకవర్గానికి ఒకరు చొప్పున ఈ యంగ్ ప్రొఫెషనల్స్ పనిచేయాల్సి ఉంటుంది.ఈ ఉద్యోగాలకు దరఖాస్తు చేసుకునే అభ్యర్థులు ఎంబీఏ లేదా ఏదైనా పోస్ట్ గ్రాడ్యుయేట్ (పీజీ) డిగ్రీని కలిగి ఉండాలి. ఎంపికైన అభ్యర్థులకు నెలకు రూ. 60,000 చొప్పున వేతనం చెల్లించనున్నట్లు ప్రభుత్వం నోటిఫికేషన్‌లో స్పష్టం చేసింది. వయోపరిమితి విషయానికొస్తే, 2025 మే 1వ తేదీ నాటికి అభ్యర్థి వయసు 40 ఏళ్లు మించకూడదని పేర్కొన్నారు.అర్హులైన అభ్యర్థుల నుంచి ఆన్‌లైన్ విధానంలో మే 13వ తేదీ వరకు దరఖాస్తులను స్వీకరిస్తారు. అభ్యర్థుల ఎంపిక ప్రక్రియలో భాగంగా విద్యార్హతలు, రాత పరీక్ష, ఇంటర్వ్యూలను ప్రామాణికంగా తీసుకుంటారని ప్రభుత్వం తెలిపింది. ఈ పోస్టులకు సంబంధించిన విద్యార్హతలు, ఎంపిక విధానం, వేతనం తదితర పూర్తి వివరాల కోసం ప్రభుత్వం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన https://apsdpscareers.com/YP.aspx వెబ్ పోర్టల్‌ను సంప్రదించాలి

## ఉన్నత చదువుతో ఉజ్వల భవిష్యత్తు

**-ఫజీలతుష్షేక్ అష్రఫ్ ఫైజీ**

**- ఘనంగా మదర్సా ఆయిషా సిద్దిఖ 12వ వార్షికోత్సవం**




**మంగళగిరి:మే 3 :(వార్తా ప్రభ ప్రతినిధి)**ఉన్నత చదువుతోనే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని ఫజీలతుష్షేక్ అష్రఫ్ ఫైజీ హాఫిజహుల్లాహ్ అన్నారు. నగరంలోని ఈద్గా షాదీఖానాలో ఆదివారం మదర్సా ఆయిషా సిద్ధిఖీ 12వ వార్షికోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఫజీలతుష్షేక్ అష్రఫ్ ఫైజీ హాఫిజహుల్లాహ్ ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. గత 12 సంవత్సరాలుగా మదర్సా నిర్వహిస్తున్న నిర్వాహకులు ఎంతైనా అభినందనీయులని కొనియాడారు. విద్యార్థినులు కూడా క్రమశిక్షణతో చదువుకుని చక్కని ప్రతిభ కనబర్చుతుండటం హర్షణీయమన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలకు చిన్నతనం నుంచే ప్రాపంచిక విద్యతో పాటు ధార్మిక విద్య ను కూడా అభ్యసించేలా తమ వంతు సహకారాన్ని అందించాలన్నారు. ఈ సందర్భంగా ఆలిమ్ కోర్సు పూర్తి చేసుకున్న పలువురు విద్యార్థినులకు సర్టిఫికెట్లు, బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో మదర్సా ప్రిన్సిపాల్ అబ్దుల్ అలీమ్ జామయీ, అన్సరీ ఇస్లామిక్ సెంటర్ అధ్యక్షులు జనాబ్ మొహమ్మద్ జహంగీర్ హాది సాహెబ్, మదర్సా కమిటీ సభ్యులు ఎస్.ఏ సిలార్, షబ్బార్, ఖదీర్, సంధానీ, రఫీ తదితరులు పాల్గొన్నారు.

## గుర్రాల గడ్డలో కార్డన్ అండ్ సెర్చ్

**కడప, మే 3 :(వార్తా ప్రభ ప్రతినిధి)** కడప వన్ టౌన్ పరిధిలోని గుర్రాల గడ్డ, బ్రాహ్మణ వీధి లో పోలీసులు శనివారం ఉదయం కార్డన్ అండ్ సెర్చ్ ఆపరేషన్ నిర్వహించారు. అనుమానిత వ్యక్తుల ఇళ్లలో కడప వన్ టౌన్ సి.ఐ బి. రామకృష్ణ, ఎస్.ఐ లు అమర్ నాథ్ రెడ్డి, ప్రతాప్ రెడ్డి, తాలూకా ఎస్.ఐ తులసి నాగ ప్రసాద్, సిబ్బంది క్షుణ్ణంగా తనిఖీలు నిర్వహించారు. .తనిఖీల్లో రికార్డులు లేని 9 ద్విచక్ర వాహనాలు స్వాధీనం చేసుకున్నారు. చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

# గన్నవరం విమానాశ్రయానికి పుచ్చలపల్లి సుందరయ్య పేరు పెట్టాలి

### ప్రముఖ న్యాయవాది వల్లభనేని నాగ పవన్ కుమార్ (నాని)



**ఇబ్రహీంపట్నం మే 03(వార్తా ప్రభ ప్రతినిధి):** కృష్ణా జిల్లా గన్నవరంలోని విమానాశ్రయానికి అదే నియోజకవర్గానికి చెందిన కామ్రేడ్ పుచ్చలపల్లి సుందరయ్య పేరుతో పుచ్చలపల్లి సుందయ్య విమానాశ్రయంగా నామకరణం చేయాలని ఇబ్రహీంపట్నానికి చెందిన ప్రముఖ న్యాయవాది వల్లభనేని నాగ పవన్ కుమార్ (నాని) డిమాండ్ చేశారు. ఈ సందర్బంగా ఆయన కృష్ణా జిల్లా గన్నవరం శాసనసభ్యులు యార్లగడ్డ వెంకట్రావుకు లేఖను రాశారు. లేఖను పోస్టు ద్వారా పంపిన ఆయన మాట్లాడుతూ కామ్రేడ్ పుచ్చలపల్లి సుందరయ్య స్వాతంత్ర్య సమరయోధులుగా దేశం కోసం పోరాడిన యోధులుగా, తన ఆస్థిని పేద ప్రజలకు పంచి ఇచ్చిన త్యాగ శీలిగా, మొదటి తరం రాజకీయలలో ఎంతో నీతి వంతమైన రాజకీయాలతో ప్రజల మనసులలో సుస్థిర స్థానాన్ని దక్కించుకున్న నాయకుడిగా, సైకిల్ పైన శాసన సభకు వెళ్లిన నిరాడంబరుడుగా నేటి రాజకీయ నాయకులకు విలువలతో కూడిన రాజకీయాన్ని పరిచయం చేసిన మహోన్నత వ్యక్తి ఉమ్మడి కృష్ణా జిల్లా వాసి అయినందుకు మనందరం గర్వపడాలన్నారు. భూస్వామ్య కుటుంబంలో పుట్టిన ఆయనకు తల్లి దండ్రులు సుందరరామిరెడ్డిగా నామకరణం చేయగా, ఆయన మాత్రం తన పేరులో ఉన్న కులాన్ని తొలగించుకుని సుందరయ్యగా పేరు మార్చుకున్నారని తెలిపారు. మహాత్మా గాంధీజీ నాయకత్వం పట్ల ఆకర్షితుడైన ఆయన తన 17వ ఏటాలోనే స్వాతంత్ర్యోద్యమంలో చురుకుగా పాల్గొని 1930లో సైమన్ కమీషన్ వ్యతిరేక ప్రదర్శనలో, ఉప్పు సత్యాగ్రహంలోను, సహాయ నిరాకరణ వంటి ఉద్యమాలలో పాల్గొని కారాగార శిక్షను అనుభవించారని అన్నారు. 1952లో మద్రాసు పార్లమెంటు నియోజకవర్గం నుండి రాజ్య సభకు , ఆ తరువాత 1955లో గన్నవరం నియోజకవర్గం ఏర్పడ్డాక గన్నవరం నియోజకవర్గం నుండి శాసన సభ్యుడిగా ఎన్నికైన ఆయన పిల్లలు కలిగితే ప్రజా సేవకు ఆటంకం కలుగుతుందని కు.ని ఆపరేషన్ చేయించుకున్నారని తెలిపారు. తన పూర్తి జీవితాన్ని ప్రజా సేవకు అర్పించిన గొప్ప నాయకుని పేరును గన్నవరం విమానాశ్రయానికి నామకరణం చేయడం ద్వారా ఆయనకు ఘన నివాళి అర్పించన వారమవుతమని ఆశాభావం వ్యక్తం చేశారు. రాజకీయాలకతీతంగా రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాలని ఆయన కోరారు. గన్నవరం శాసనసభ్యులు యార్లగడ్డ వెంకట్రావుతో పాటు రాష్ట్ర ముఖ్య మంత్రి నారా చంద్రబాబు నాయుడికి, కేంద్ర పౌర విమానయాన శాఖా మంత్రి కింజారపు రామ్మోహన్ నాయుడికి, రాష్ట్ర ఉప ముఖ్య మంత్రి కొణిదల పవన్ కళ్యాణ్ కు, రాష్ట్ర ఐటి మరియు విధ్యా శాఖా మంత్రి నారా లోకేష్ కు, రాష్ట్ర ఎక్సైజ్ మరియు మైనింగ్ శాఖా మంత్రి కొల్లు రవీంద్రలకు ఈ లేఖను రిజిస్టర్ పోస్ట్ ద్వారా పంపినట్లు ఆయన పేర్కొన్నారు.

# కుల గణనకు కేంద్రం ఓకే.. ప్రధానికి లేఖ రాసిన తేజస్వీ యాదవ్

**పట్నా:** వచ్చే జనాభా లెక్కల్లోనే కులగణనను జవజ చేర్చుతామని కేంద్రం చేసిన ప్రకటనను స్వాగతిస్తున్నట్లు రాష్ట్రీయ జనతా దళ్ నేత తేజస్వీ యాదవ్ తెలిపారు. ఈ మేరకు ప్రధాని నరేంద్ర మోదీకి లేఖ రాశారు. ఇది మన దేశం సమానత్వం వైపు సాగే ప్రయాణంలో ఒక మార్పును తీసుకొచ్చే క్షణమని అందులో పేర్కొన్నారు. కులగణన కేవలం డేటా కాదని, అనేక మంది ఆత్మగౌరవానికి సంబంధించిన అంశమని రాసుకొచ్చారు. కాబట్టి కేంద్ర ప్రభుత్వం ఈ సర్వేను జాగ్రత్తగా నిర్వహించాలని సూచించారు. కులగణన ఎప్పటికీ ముగిసిపోదని.. ఇది సామాజిక న్యాయం వైపు చేసే సుదీర్ఘ ప్రయాణంలో మొదటి అడుగు మాత్రమేనని అభిప్రాయం వ్యక్తంచేశారు. కులగణన నిర్వహించిన అనంతరం ఆ డేటాను వ్యవస్థాగత సంస్కరణలు చేయడానికి ఉపయోగిస్తారా లేదా మునుపటి కమిషన్‌ల నివేదికల మాదిరిగానే ఉంచేస్తారా అని ప్రధానిని ప్రశ్నించారు.జనాభా లెక్కలు, కులగణన విషయంలో కేంద్ర ప్రభుత్వానికి బిహార్ సహకారం ఉంటుందని హామీ ఇచ్చారు. ఎన్నోఏళ్లుగా ప్రతిపక్షాలు చేస్తున్న కులగణన డిమాండ్లను ఎన్డీఏ ప్రభుత్వం పట్టించుకోకుండా.. దేశ ప్రజల్లో విభజనలు చేయడం సరైన చర్య కాదని పేర్కొందన్నారు. బిహార్ కుల సర్వే చేపట్టినప్పుడు కూడా పదేపదే దానిని అడ్డుకుందని గుర్తు చేశారు. ఆలస్యంగా అయినా కేంద్రం సరైన నిర్ణయం తీసుకుందని అన్నారు. దీనివల్ల సమాజంలో చాలాకాలంగా అణచివేతకు గురవుతున్న ప్రజలకు ప్రయోజనం చేకూరుతుందని పేర్కొన్నారు. జనాభా గణన డేటా సామాజిక రక్షణ, రిజర్వేషన్ విధానాల సమగ్ర సమీక్షకు ఉపయోగపడేలా ఉండాలని తేజస్వీ అన్నారు. అదేవిధంగా రిజర్వేషన్లపై ఉన్న ఏకపక్ష పరిమితిని కూడా పునఃపరిశీలించాలని కేంద్రాన్ని కోరారు.జనాభా లెక్కల్లోనే దేశంలో కులగణనను జవఅనిర్వహించాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకున్నట్లు ఇటీవల కేంద్ర మంత్రి అశ్వినీ వైష్ణవ్ పేర్కొన్నారు. కులగణన అంశం కేంద్రం పరిధిలోకి వస్తున్నప్పటికీ.. కొన్ని రాష్ట్రాలు మాత్రం సర్వేల పేరుతో వాటిని నిర్వహించాయన్నారు. ముఖ్యంగా విపక్షాలు అధికారంలో ఉన్న రాష్ట్రాల్లో రాజకీయ కారణాల వల్ల వాటిని చేపట్టారని విమర్శించారు. తదుపరి దేశవ్యాప్తంగా చేపట్టే జనాభా లెక్కల ప్రక్రియలో కులగణనను చేర్చి పారదర్శకంగా చేపట్టాలన్నదే మోదీ ప్రభుత్వ సంకల్పం.

## మూడు రోజుల పాటు శ్రీ కనకదుర్గమ్మ ఘాట్ రోడ్డు మూసివేత

**విజయవాడ పశ్చిమ మే 3 :(వార్తా ప్రభ ప్రతినిధి)**శ్రీ దుర్గామల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానం, ఇంద్రకీలాద్రి పైఘాట్ రోడ్ మూడు రోజుల పాటు మూసివేస్తున్నట్టు అధికారులు శనివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు.ఇంద్రకీలాద్రి ఘాట్ రోడ్ మరమత్తుపనులు, కొండ చరియలకు మెష్ తదితర పనులు నిమిత్తం ఈ నెల 6,7,8, తేదీలలో ఘాట్ రోడ్ పూర్తిగా మూసివేయుటకు నిర్ణయించారు.శ్రీ కనకదుర్గానగర్ మార్గం నుండి భక్తులు దేవస్థానం నకు చేరుకోవాల్సి ఉంటుంది.హైదరాబాద్ నుండి వచ్చే భక్తులు పున్నమి ఘాట్లో తమ వాహనాలు పార్క్ చేసుకొని, అక్కడ నుండి దేవస్థానం ఏర్పాటు చేస్తున్న ఉచిత బస్ ద్వారా దేవస్థానమునకు చేరుకోవచ్చని, విశాఖపట్నం, చెన్నయ్ తదితర ప్రాంతాల నుండి వన్ టౌన్ వైపు వచ్చే భక్తులు సీతమ్మ వారి పాదాలు వద్ద ఉన్న హెూల్డింగ్ ఏరియాలో తమ వాహనాలు పార్క్ చేసుకొని దేవస్థానం ఏర్పాటు చేసే ఉచిత బస్ ద్వారా దేవస్థానమునకు చేరుకోవాలని ఆలయ కార్యనిర్వహణాధికారి కె. రామచంద్ర మోహన్ తెలిపారు.ఈ మూడు రోజులు పార్కింగ్ ప్రదేశాలు నుండి దేవస్థానంనకు ఉచిత రవాణా సదుపాయం ఏర్పాటు చేసామని, భక్తులు వినియోగించుకోవాలని పేర్కొన్నారు.

## బ్రహ్మోత్సవాల పోస్టర్ ను రిలీజ్ చేసిన శాసనసభ్యులు శ్రీరామ్ రాజగోపాల్ తాతయ్య



**జగ్గయ్యపేట మే 3 (వార్తప్రభ)** మండలం లోని వేదాద్రి గ్రామంలో ఈనెల 7వ తారీకు నుండి జరగనున్న వేదాద్రి శ్రీ యోగానంద లక్ష్మీనరసింహస్వామి వారి బ్రహ్మోత్సవాల పోస్టర్ ను శాసనసభ్యులు శ్రీరామ్ రాజగోపాల్ తాతయ్య రిలీజ్ చేయడం జరిగింది, వంశపారంపర్య ధర్మకర్త ప్రతినిధి కెసిపి సిమెంట్స్ అసిస్టెంట్ జనరల్ మేనేజర్ రాంప్రసాద్ మరియు కార్యనిర్వహణ అధికారి కానూరు సురేష్ మొదటి ఆహ్వాన పత్రికను ఎమ్మెల్యే కి అందజేసి వారిని బ్రహ్మోత్సవాలకు ఆహ్వానించడం జరిగింది. ఆలయ సిబ్బంది దేవరశెట్టి నాగార్జున తదితరులు పాల్గొన్నారు

## రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి మరో యువకుడికి గాయాలు



**జగ్గయ్యపేట మే 3 (వార్తప్రభ)** జగ్గయ్యపేట -చిల్లకల్లు మెయిన్ రోడ్ లో గల శుభమస్తు కళ్యాణ మండపం సమీపంలో శుక్రవారం రాత్రి జరిగిన ప్రమాదం లో జగ్గయ్యపేట చెరువు బజారుకు చెందిన యువకుడు దుర్మరణం పాలయ్యాడు. వీళ్ల నందిగామ నుండి ఫంక్షన్ కి వెళ్లి తిరిగి వస్తుండగాశుభమస్తు కళ్యాణ మండపం యూటర్న్ ఎదురుగా రాత్రి 12 గంటల సమయం లోలారీ రివర్ చేస్తుండగా వెనక భాగంలో ఢీకొట్టడం జరిగినది. ఈ ఘటనలో దేవరకొండ సాయి స్పాట్లో మృతి చెందడం జరిగినది.వెనక కూర్చున్న తమ్మిశెట్టి వాసుకి కాలు విరగడం జరిగినది. అదే సమయం లోపెనుగంచిప్రోలు ఎస్సై అర్జున్ జగ్గయ్యపేట వస్తున్న తరుణంలో యాక్సిడెంట్ అయి ఉన్నందువలన దెబ్బలు తగిలిన వ్యక్తిని మృతి చెందిన యువకుడ్ని అంబులెన్స్ సహాయంతో జగ్గయ్యపేట గవర్నమెంట్ హాస్పటల్ కు తరలించడం జరిగినది.తమ్మిశెట్టి వాసుకి ట్రీట్మెంట్ చేస్తున్నారు. దేవరకొండ సాయి అనే యువకుడ్ని చనిపోయినందున మార్చురీ కి తరలించారు.జగ్గయ్యపేట ఎస్ ఐ 2 వెంకటేశ్వరరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## పదవి విరమణ చేసిన హెడ్ కానిస్టేబుల్ నాగేశ్వరరావు

### శుభాకాంక్షలు తెలిపిన అధికారులు, సిబ్బంది



**గుంటూరు మే 3 :(వార్తా ప్రభ ప్రతినిధి)**గత 35 ఏళ్లు సమర్ధవంతంగా విధులు నిర్వహించి, ఉన్నతాధికారుల మన్ననలు పొందిన హెడ్ కానిస్టేబుల్ బండ్ల నాగేశ్వరరావు శనివారం పదవి విరమణ చేశారుకృష్ణా నదిలో దూకి ఆత్మహత్య లు చేసుకోవడానికి వచ్చిన వారిని, అడ్డుకొని వారికి నచ్చచెప్పి, కౌన్సెలింగ్ ఇచ్చి ,వారి బంధువులు కు అప్పగించి ఎంతో మంది ప్రాణాలు కాపాడి ఉన్నతాధికారుల మన్ననలు పొందిన ఘనత నాగేశ్వరరావుది గుంటూరు ఎస్పీ కార్యాలయంలో హెడ్ కానిస్టేబుల్ బండ్ల నాగేశ్వరరావు, పద్మావతి దంపతులను అడిషనల్ ఎస్పీ రమణ మూర్తి, స్పెషల్ బ్రాంచి సిఐ ఏ.శ్రీనివాసరావు సహచర సిబ్బంది శాలువా కప్పి ఘనంగా సన్మానించారుతాడేపల్లి సిఐ కళ్యాణ్ రాజు, ఎస్సైలు ప్రతాప్,జె.శ్రీనివాసరావు, ఖాజావలి, తోటి సిబ్బంది నాగేశ్వరరావు కు పదవి విరమణ శుభాకాంక్షలు తెలియజేశారు

## బిచ్చన్న చెరువులో అక్రమ మట్టి రవాణా

**ఏలూరు, మే 3 :(వార్తా ప్రభ ప్రతినిధి)** ఆగిరిపల్లి మండలం అడవినెక్కలం గొల్లగూడెంలో బిచ్చన్న చెరువులో అర్ధరాత్రి అక్రమ మట్టితోలకాలు జోరుగా కొనసాగాయి. రెండు జెసిబిలు,20 ట్రాక్టర్లతో మట్టి రవాణా చేసి క్యాష్ చేసుకుంటున్నా అధికారులు పట్టించుకోవలేదని స్థానికుల ఆరోపణ.

# త్వరలో యంగ్ ఇండియా స్పోర్ట్స్ యూనివర్సిటీ: మంత్రి శ్రీధర్ బాబు



హైదరాబాద్, మే 3 :(వార్తా ప్రభ ప్రతినిధి) రాష్ట్రంలో యంగ్ ఇండియా స్పోర్ట్స్ యూనివర్సిటీ ఏర్పాటు చేసి అన్ని క్రీడల అభివృద్ధికి జిల్లాల వారిగా ప్రత్యేక అకాడెమీలు నెలకొల్పుతామని ఐటీ, పరిశ్రమల మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు తెలిపారు. క్రీడల్లో గ్రామీణ ప్రాంత యువత శిక్షణకు ప్రాధాన్యతనిచ్చేలా తనవంతు కృషి చేస్తానని ఆయన అన్నారు. చదువుతో పాటు ప్రతి ఒక్కరూ క్రీడల్లో నైపుణ్యం పెంచుకోవాలని ఆయన కోరారు. శనివారం నాడు మినిస్టర్స్ క్వార్టర్స్ లో తనను కలిసిన తెలంగాణా బ్యాడ్మింటన్ అసోసియేషన్ నూతన సలహాదారు కోసరాజు లక్ష్మణ్, మీడియా కో ఆర్డినేటర్ వెంకట రమణా రెడ్డిలను ఆయన అభినందించారు. వారికి నియామక పత్రాలు అందజేసారు. బ్యాడ్మింటన్ క్రీడ మరింత విస్తరించేందుకు పాటు పడాలని తెలంగాణా బ్యాడ్మింటన్ అసోసియేషన్ అధ్యక్షుడు కూడా అయిన శ్రీధర్ బాబు వారికి దిశానిర్దేశం చేసారు. మంత్రిని కలిసిన వారిలో బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఈవెంట్స్ అండ్ ప్రోటోకాల్ ప్రతినిధి యువిఎన్ బాబు తదితరులు ఉన్నారు.

# త్వరలోనే ఏపీకి ట్రాన్స్ మీడియా ఎంటర్టైన్ మెంట్ సిటీ

**● ఈ మేరకు ముంబయిలో జరిగిన వేవ్స్ సమ్మిట్ -2025 లో ఏపీ ప్రభుత్వం, క్రియేటివ్ ల్యాండ్ ఆసియా మధ్య ఎంవోయూ ● భారతదేశపు మొట్టమొదటి ట్రాన్స్ మీడియా ఎంటర్టైన్ మెంట్ సిటీ ఏపీకి రావడంపై హర్షం వ్యక్తం చేసిన మంత్రి కందుల దుర్గేష్ ● క్రియేటర్ ల్యాండ్ ప్రాజెక్ట్ ఆవిష్కరణలతో పర్యాటక రంగానికి మరింత ప్రోత్సాహం లభిస్తుందన్న టూరిజం ఎండీ ఆమ్రపాలి కాట ● రాష్ట్ర పర్యాటక సాంస్కృతిక సినిమాటోగ్రఫీ రంగంపై ప్రత్యేక దృష్టి సారించిన మంత్రి కందుల దుర్గేష్**





అమరావతి: మే 3 :(వార్తా ప్రభ ప్రతినిధి) భారతదేశపు మొట్టమొదటి ట్రాన్స్‌మీడియా ఎంటర్‌టైన్‌మెంట్ సిటీని ఆంధ్రప్రదేశ్‌లో ఏర్పాటు చేయడానికి ముంబయిలో జరుగుతున్న వేవ్స్ సమ్మిట్-2025లో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం మరియు క్రియేటివ్‌ల్యాండ్ ఆసియా తమ సహకారాన్ని ప్రకటించినట్లు మంత్రి కందుల దుర్గేష్ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మే 1వ తేదీ నుండి 4వ తేదీ వరకు తొలి సారి ఇండియాలో ప్రత్యేకించి ముంబయిలో జరుగుతున్న ప్రతిష్టాత్మక వేవ్స్ (ది వరల్డ్ ఆడియో విజువల్ అండ్ ఎంటర్ టైన్ మెంట్ సమ్మిట్) సమ్మిట్ -2025 లో ఈ మేరకు ఏపీ ప్రభుత్వం, క్రియేటివ్ ల్యాండ్ ఆసియా మధ్య ఎంవోయూ జరిగిందని తెలిపారు.ఈ ఎంవోయూ ద్వారా ఏపీకి వచ్చే సందర్శకులు లీనమయ్యేలా థీమ్ పార్క్ లు, గేమింగ్ జోన్‌లు, గ్లోబల్ సినిమా కో-ప్రొడక్షన్ జోన్‌లు ఏర్పాటు కానున్నాయని మంత్రి దుర్గేష్ వెల్లడించారు. అంతేకాక ఉద్యోగ సృష్టి, నైపుణ్య అభివృద్ధి, పర్యాటకం మరియు డిజిటల్ ఆవిష్కరణలను ప్రోత్సహించేందుకు ఈ ఎంవోయూ దోహదం చేస్తుందని మంత్రి దుర్గేష్ వివరించారు.ప్రస్తుతం మంత్రి కందుల దుర్గేష్ వియత్నాంలో ఉండటంతో పర్యాటక శాఖ ఎండీ ఆమ్రపాలి కాట, క్రియేటివ్‌ల్యాండ్ స్టూడియోస్ వ్యవస్థాపకురాలు మరియు క్రియేటర్స్ ఇంక్ లండన్ చైర్మన్ సాజన్ రాజ్ కురుప్, హాలీవుడ్ నుండి గ్లోబల్ అడ్వైజరీ బోర్డు ప్రతినిధులు డేవిడ్ ఉంగర్, సీఈవో ఆర్టిస్ట్స్ ఇంటర్నేషనల్, గ్లోబల్‌గేట్ మేనేజింగ్ డైరెక్టర్ విలియం ఫైఫర్, నికోలస్ గ్రానాటినో చైర్మన్ నోవాక్వార్క్ లు ఈ ఎంవోయూపై సంతకాలు చేశారు. ఇటీవలే క్రియేటివ్ ల్యాండ్ ఆసియా ప్రతినిధులు కొందరు వెలగపూడి సెక్రటేరియట్ లోని మంత్రి పేషీలో ఈ విషయంపై చర్చించారు. మంత్రి సమక్షంలో అవగాహన ఒప్పంద పత్రాలు మార్చుకున్నారు. వేవ్స్ రౌండ్‌టేబుల్ ను సందర్శించిన పలువురు ప్రముఖులు మరియు హాలీవుడ్ నుండి గ్లోబల్ అడ్వైజరీ నుండి కొంతమంది ప్రతినిధులు కూడా ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ రంగంపై ప్రత్యేక దృష్టి సారించిన మంత్రి కందుల దుర్గేష్ ఇప్పటికే రూ. 300 కోట్ల కేంద్ర నిధులను రాబట్టారు..పర్యాటక రంగంలో రూ. 1200 కోట్లకు పైగా పెట్టుబడులు రాబట్టి 8 ఎంవోయూలు కుదుర్చుకున్నారు. తద్వారా వేలాది సంఖ్యలో యువతకు ఉపాధి దక్కనుంది. తాజా ఒప్పందంతో మరింత మంది యువతకు ఉపాధి కలిగే అవకాశం ఉంది వియత్నాం పర్యటనలో ఉన్న మంత్రి కందుల దుర్గేష్ ఈ అంశంపై మాట్లాడుతూ క్రియేటివ్ ల్యాండ్ ఆసియాతో భాగస్వామ్యం అనేది రాష్ట్రాన్ని చలనచిత్ర, వినోద పర్యాటకం అభివృద్ధికి తాము చేసిన ప్రయత్నాలలో ఒక ఉత్తేజకరమైన మైలురాయిని సూచిస్తుందన్నారు.. ఈ అవగాహన ఒప్పందం మౌలిక సదుపాయాల ప్రాజెక్టు కంటే మించినదని పేర్కొన్నారు. ప్రతిభ, ఆవిష్కరణ, పర్యాటక అనుకూలమైన పర్యావరణ వ్యవస్థను సృష్టించేందుకు ఇది దోహదపడనుందన్నారు. క్రియేటర్‌ల్యాండ్ ఏర్పాటు చేసే ప్రపంచ స్థాయి ప్రొడక్షన్ హబ్ ద్వారా వినోద ఆర్థిక వ్యవస్థ పెరగడమే గాక, థీమ్ పార్కులు, ప్రేక్షకులు లీనమయ్యేలా జోన్‌లు, ప్రపంచ ఉత్పత్తి కేంద్రాల ద్వారా సందర్శకుల అనుభవాలను కూడా మారుస్తుందన్నారు. ఈ సాంస్కృతిక, ఆర్థిక పరివర్తనకు నాయకత్వం వహిస్తుందన్నందుకు గర్వపడుతున్నామన్నారు. ఈ సహకారం వైవిధ్యమైన, అధిక-నాణ్యత ఉత్పత్తికి తమ నిబద్ధతకు మద్దతు ఇస్తుందన్నారు. అత్యాధునిక సాంకేతికత మరియు అసాధారణమైన కంటెంట్‌తో నడిచే ఏవీజీసీ, వీఎఫ్ఎక్స్ సహా మీడియా మరియు వినోద రంగానికి ప్రోత్సాహాన్ని అందిస్తుందన్నారు.. డిజిటల్ వినోదంలో కొత్త ప్రమాణాలను నెలకొల్పడం, పరిశ్రమ మరియు వినియోగదారులతో మరింత అర్థవంతమైన మార్గాల్లో కనెక్ట్ అవ్వడం లక్ష్యంగా ఈ ఎంవోయూ కుదుర్చుకున్నట్లు మంత్రి కందుల దుర్గేష్ పేర్కొన్నారు. వివరాలు పరిశీలిస్తే క్రియేటర్‌ల్యాండ్ 5-6 ఏళ్లల్లో రూ. 8000 - 10,000 కోట్ల మధ్య పెట్టుబడులను ఆకర్షిస్తుందని అంచనా వేయబడింది. ఇది ఏఐ ఆధారిత రియల్ టైమ్ రెండరింగ్ మరియు వాల్యూమెట్రిక్ క్యాప్చర్ టెక్నాలజీలు, ఇమ్మర్సివ్ థీమ్ పార్కులు, గేమింగ్ జోన్‌లు, ఎస్పోర్ట్స్ అరీనాలు మరియు గ్లోబల్ సినిమా కో-ప్రొడక్షన్ జోన్‌లు, వీఎఫ్ఎక్స్, ఆర్టిఫీషియల్ ఇంటలిజెన్స్, గేమింగ్ మరియు ఇమ్మర్సివ్ స్టోరీ టెల్లింగ్‌లో యువతకు నైపుణ్యం కల్పించడానికి క్రియేటర్ ల్యాండ్ అకాడమీ ద్వారా ఆధారితమైన వర్చువల్ స్టూడియో కాంప్లెక్స్‌ను రూపొందించడానికి ఉపయోగపడుతుంది. అంతేగాక ఆంధ్రప్రదేశ్ సహా దేశంలోని మిగిలిన ప్రాంతాల నుండి సృజనాత్మక మరియు సాంకేతిక డొమైన్‌లలో నైపుణ్యం, ఉపాధి అవకాశాలకు మార్గం కానుంది. అంతేగాక ఏఐ, ఆర్ అండ్ డీ, వీఎఫ్ఎక్స్, గేమింగ్ , వినోదం, టెక్, పర్యాటక రంగాలలో 1,50,000కు పైగా కొత్త ఉద్యోగాలను కల్పించేందుకు అవకాశం ఉంది. భారతదేశాన్ని తమ నిర్మాణ కేంద్రంగా మార్చుకునేందుకు ప్రపంచవ్యాప్తంగా ఈ తరహా 20కి పైగా స్టూడియోలు నిర్మించేందుకు క్రియేటివ్ ల్యాండ్ చర్చలు జరుపుతోంది. పర్యాటక శాఖ ఎండీ ఆమ్రపాలి కాట మాట్లాడుతూ క్రియేటర్ ల్యాండ్ ప్రాజెక్ట్ ఆవిష్కరణలతో పర్యాటక రంగాన్ని మరింత ప్రోత్సహిస్తున్నామన్నారు. తద్వారా రాష్ట్ర భవిష్యత్ కు పాటుపడుతున్నామన్నారు. వినోద మౌలిక సదుపాయాలు, ప్రతిభ నైపుణ్యాలు, పర్యాటకం కలిసి జీవనోపాధిని సృష్టించడానికి, స్థానిక ఆర్థిక వ్యవస్థను పెంచడానికి , ప్రపంచ సృజనాత్మక పటంలో ఆంధ్రప్రదేశ్ ప్రొఫైల్‌ను పెంచడానికి ఇది ఒక సమగ్ర దృక్పథాన్ని అందిస్తుందని తెలిపారు. భవిష్యత్తుకు సిద్ధంగా ఉన్న మౌలిక సదుపాయాలు సమ్మిళిత వృద్ధిని ఎలా నడిపిస్తాయో చెప్పడానికి ఇది ఒక బ్లూప్రింట్‌గా తాము భావిస్తున్నామని ఆమె వివరించారు.క్రియేటివ్‌ల్యాండ్ ఆసియా వ్యవస్థాపకుడు , ఛైర్మన్ సాజన్ రాజ్ కురుప్ మాట్లాడుతూ క్రియేటర్‌ల్యాండ్ అనేది ఒక గమ్యస్థానం మాత్రమే కాదు, ఇది ఒక సృజనాత్మక ఉద్యమంగా అభివర్ణించారు. ఆంధ్రప్రదేశ్ యొక్క దార్శనిక నాయకత్వంతో చేతులు కలపడం ద్వారా తాము వినోదం, విద్య మరియు ఆవిష్కరణల భవిష్యత్తును నిర్మిస్తున్నామన్నారు. సందర్శకులు లీనమయ్యే అనుభవాల నుండి ఏఐ నేతృత్వంలోని కథ చెప్పడం వరకు, క్రియేటర్‌ల్యాండ్ సాంకేతికతను సంస్కృతితో, ప్రపంచ ప్రతిభను భారతీయ ఊహతో మిళితం చేస్తుందన్నారు. భారతదేశాన్ని వినోద మౌలిక సదుపాయాలు మరియు ఐపీ సృష్టి యొక్క ప్రపంచ పటంలో ఉంచే దిశగా ఇది మా సమిష్టి అడుగు అన్నారు. ప్రపంచ కంటెంట్ పవర్‌హౌస్‌గా మారే దిశగా భారతదేశం ప్రయాణంలో ఈ సహకారం ఒక మైలురాయిగా పేర్కొన్నారు. సాంకేతికత, సృజనాత్మకత , మౌలిక సదుపాయాలను సమగ్రపరచడం ద్వారా వినోద మౌలిక సదుపాయాలలో ప్రపంచ నాయకుడి స్థానంలో భారతదేశాన్ని నిలిపేందుకు ఇది ఒక అడుగు అన్నారు. భారతదేశాన్ని డిజిటల్ సృజనాత్మకత, ఉపాధి మరియు సాంస్కృతిక దౌత్యానికి కేంద్రంగా మార్చాలనే తమ ఆలోచనకు ఆంధ్రప్రదేశ్ నాయకత్వం దోహదపడటం ఆనందంగా ఉందని పేర్కొన్నారు.

# దయానందనగర్ రైల్వే స్టేషన్ అభివృద్ధి పనులు పరిశీలించిన ఎమ్మెల్యే



మల్కాజిగిరి :మే 3 :(వార్తా ప్రభ ప్రతినిధి) రైల్వే ఉన్నత అధికారులతో కలిసి మల్కాజ్ గిరి నియోజకవర్గం లోని రైల్వే సమస్యల పరిష్కారానికి మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి నడుం బిగించారు. మల్కాజ్ గిరి డివిజన్ ఆర్కే నగర్ లో నూతనంగా నిర్మిస్తున్న దయానందనగర్ రైల్వే స్టేషన్ అభివృద్ధి పనులను రైల్వే ఉన్నతాధికారులతో కలిసి పరిశీలించారు. ఆర్కే నగర్ కాలనీవాసుల విన్నపం మేరకు ఆర్కే నగర్ రైల్వే స్టేషన్ గా నామకరణం చేయాలని, రైల్వే స్టేషన్ నుండి ఆర్కే నగర్ స్ట్రీట్ నెంబర్ 1,2 నుండి బయటకు వెళ్లేందుకు ఒకే మార్గాన్ని ఇవ్వడంతో రోడ్లు ఇరుకుగా ఉండడంతో స్థానికులు ఇబ్బంది పడుతున్నారని రెండు (ఎగ్జిట్) బయటకు వెళ్లే మార్గాలను ఇవ్వాలని, ఆర్కే నగర్ రైల్వే స్టేషన్ కి వెళ్లే మార్గంలో గల బిల్డింగ్ పై విద్యుత్ లైన్లు అడ్డుగా ఉండడంతో రైల్వే అధికారులు ఎమ్మెల్యే తెలియజేయగా వెంటనే విద్యుత్ అధికారులతో మాట్లాడి పరిష్కరింప చేస్తానని తెలిపారు. రైల్వే ఉన్నతాధికారులు రైల్వే స్టేషన్ ఆర్.కె.నగర్ గా పేరు మార్పుకు, రైల్వే స్టేషన్ నుండి బయటకు వెళ్లే మార్గాలు రెండు గేట్లు పెట్టేందుకు సానుకూలంగా స్పందించారు.ఆర్కే నగర్ కాలనీ వాసులకు కోరిక మేరకు 1976 లో రైల్వే జనరల్ మేనేజర్ కె. ఎస్. రాజన్ ప్రారంభించిన నేషనల్ హైస్కూల్లో పదవ తరగతి పరీక్ష ఫలితాల్లో ప్రథమ శ్రేణి సాధించిన విద్యార్థులను శాలువాలతో సత్కరించి అభినందించిన ఎమ్మెల్యే . రైల్వే ఉన్నతాధికారులు, ఈ యొక్క కార్యక్రమంలో హైదరాబాద్ ఏడిఆర్ఎం రెహమాన్, సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్ అనిరుద్ పవర్, శశాంక్ నామ్దేవ్, అరుణ్ శర్మ, కమర్షియల్ ఇన్స్పెక్టర్ లు సురేష్ ,పవన్, నాగలింగబాబు, నూర్,మాజీ కార్పొరేటర్ జగదీష్ గౌడ్, బిఆర్ఎస్ నాయకులు సతీష్, శ్రీకాంత్, నవీన్, బంటి, గోపాల్ సింగ్, లక్ష్మణ్ , మేకల రాము యాదవ్, చిన్న యాదవ్, వంశీ, రాజశేఖర్ రెడ్డి హేమంత్ పటేల్, ఆర్కే నగర్ కాలనీవాసులు సోమశేఖర్ రాఘవేంద్ర కెవివిఎస్ఎస్ గుప్తా రవికిరణ్ సాయినాథ్ శివకుమార్ శ్యామ్ సుందర్ రైల్వే అధికారులు, బిఆర్ఎస్ నాయకులు కార్యకర్తలు స్థానిక కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

# మొదటి త్రైమాసికంలో 160 లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తి లక్ష్యం సాధించాలి

**1200 లక్షల క్యూబిక్ మీటర్ల ఓబిని తొలగించాలి**

**అన్ని ఏరియాల సమీక్ష సమావేశంలో సింగరేణి సంస్థ ఛైర్మన్ ఎన్.బలరామ్**



హైదరాబాద్: మే 3 :(వార్తా ప్రభ ప్రతినిధి)ఈ ఆర్థిక సంవత్సరంలో ఉత్పత్తికి పూర్తిగా అనుకూలంగా ఉండే మొదటి త్రైమాసిక కాలాన్ని పూర్తిగా సద్వినియోగం చేసుకుంటూ 160 లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తిని, 1200 లక్షల క్యూబిక్ మీటర్ల ఓవర్ బర్డెన్ ను తొలగించాలని సింగరేణి సంస్థ ఛైర్మన్ మరియు ఎండీ శ్రీ ఎన్.బలరామ్ ఏరియాల జనరల్ మేనేజర్ లను ఆదేశించారు. శనివారం హైదరాబాద్ సింగరేణి భవన్ లో జరిగిన అన్ని ఏరియాల సమీక్ష సమావేశంలో ఆయన ఉత్పత్తి, బొగ్గు రవాణా తదితర అంశాలపై సమీక్షించారు. గత ఆర్థిక సంవత్సరం ఏప్రిల్ నెలలో సాధించిన బొగ్గు రవాణా 5.66 మిలియన్ టన్నులపై 2.7 శాతం వృద్ధితో ఈ ఏప్రిల్ లో 5.81 మిలియన్ టన్నుల బొగ్గు రవాణా సాధించామని, అలాగే గత ఏడాది ఏప్రిల్ నెలలో సాధించిన 36.18 మిలియన్ క్యూబిక్ మీటర్ల ఓవర్ బర్డెన్ పై 10.6 శాతం వృద్ధితో ఏప్రిల్ లో 40 మిలియన్ క్యూబిక్ మీటర్ల ఓబి తొలగించామని, ఇదే ఒరవడిని కొనసాగిస్తూ లక్ష్యాలు సాధించాలని ఛైర్మన్ సూచించారు.ఒడిశా రాష్ట్రంలో కొత్తగా ప్రారంభించిన నైనీ బొగ్గు బ్లాకులో పనిచేసేందుకు సూపర్వైజర్ సిబ్బందిని ఎంపిక చేసి నెల రోజుల్లోగా అక్కడికి పంపించాలని ఆదేశించారు. కొత్తగా నియమించబడిన ఉద్యోగులను భూగర్భ గనుల్లో పనిచేసే విధంగా పోస్టింగులు ఇవ్వాలని కోరారు. సింగరేణి సంస్థలో మహిళా ఉద్యోగినిల సంఖ్య పెరిగిన రీత్యా వీరి నిర్వహణలో నడిపించడానికి ఒక ఓపెన్ కాస్ట్ గనిని మరియు ఒక భూగర్భ గనిని ఎంపిక చేయాలని, ముందుగా ఒక పూర్తి షిఫ్టును కేవలం మహిళల చేతనే నిర్వహించే విధంగా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. బొగ్గు రవాణా మరియు నాణ్యతపై కూడా ఆయన సమీక్షించారు. నాణ్యత సరిగా లేనట్లయితే బొగ్గు అమ్మకాలు కుంటుబడతాయని, వినియోగదారులు దూరం అయ్యే ప్రమాదం ఉందన్నారు. కనుక నాణ్యతపై కిందిస్థాయి నుంచి పైస్థాయి అధికారుల వరకు ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. ముఖ్యంగా పూర్తి పనిగంటలు సద్వినియోగం చేసే విధంగా చర్యలు తీసుకోవాలని, విధుల పట్ల నిర్లక్ష్యంగా ఉన్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన ఆదేశించారు. ఈ సమావేశంలో సంస్థ డైరెక్టర్లు, డైరెక్టర్ (ఈ అండ్ ఎం) శ్రీ డి.సత్యనారాయణ రావు, డైరెక్టర్ ఆపరేషన్స్ శ్రీ ఎల్.వి.సూర్యనారాయణ, డైరెక్టర్ (పీపీ మరియు పర్సనల్) శ్రీ కె.వెంకటేశ్వర్లు, జీఎం (సీపీపీ) శ్రీ ఎ.మనోహర్, అడ్వైజర్ ఫారెస్ట్రీ శ్రీ మోహన్ చంద్ర పరిగెన్, జీఎం మార్కెటింగ్ శ్రీ రాజశేఖర రావు, కార్పొరేట్ జీఎం లు, అన్ని ఏరియాల జనరల్ మేనేజర్లు పాల్గొన్నారు.

# న్యాయవాదుల సంక్షేమానికి కట్టుబడి ఉన్నాం: మంత్రి శ్రీధర్ బాబు



హైదరాబాద్, మే 3 :(వార్తా ప్రభ ప్రతినిధి)న్యాయవాదుల సంక్షేమానికి తమ ప్రభుత్వం అన్ని విధాలా కట్టుబడి ఉందని ఐటీ, పరిశ్రమల మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు తెలిపారు. శుక్రవారం నాడు లక్డీకాపూల్ లోని ఓ హోటల్ లో జరిగిన అడ్వొకేట్స్ మ్యూచువల్లీ ఎయిడెడ్ కోఆపరేటివ్ సొసైటీ రజతోత్సవాల ముగింపు కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. న్యాయవాదుల భద్రత కోసం ఇటీవలే 'ప్రొటెక్షన్ యాక్టు'ను చట్టం చేసామని శ్రీధర్ బాబు వెల్లడించారు. త్వరలోనే దానిని అమలులోకి తెస్తామని చెప్పారు. న్యాయవాదుల సంక్షేమం కోసం అదనంగా మరో రూ.100 కోట్లు కేటాయించే విషయమై న్యాయశాఖను కూడా నిర్వహిస్తున్న సిఎం రేవంత్ రెడ్డిని కోరతామని ఆయన భరోసా ఇచ్చారు. వెయ్యి కోట్ల డిపాజిట్లతో న్యాయవాదుల సొసైటీ ఆర్థికంగా తమ ప్రభుత్వం కంటే బలంగా ఉందని ఆయన చమత్కరించారు. అనారోగ్యం పాలైన వారికి, చనిపోయిన లాయర్ల కుటుంబాలకు సొసైటీ అండగా నిలుస్తుండటాన్ని శ్రీధర్ బాబు ప్రశంసించారు. తాను కొన్ని అనివార్య పరిస్థితుల్లో రాజకీయాల్లోకి రావాల్సి వచ్చిందని లేకపోతే హైకోర్టులో అడ్వొకేట్ గా ప్రాక్టీసు చేస్తుండేవాడినని అన్నారు. ఢిల్లీ యూనివర్సిటీలో లా పూర్తి చేసిన తర్వాత అక్కడి తీస్ హజారీ కోర్టుల్లో కొన్నాళ్లు, ఉమ్మడి రాష్ట్ర హైకోర్టులో మూడేళ్లు ప్రాక్టీసు చేసిన విషయాన్ని గుర్తు చేసుకున్నారు. సహచర ఎమ్మెల్యేలు కాలేరు వెంకటేశ్ (అంబర్ పేట), జి.మధుసూదన్ రెడ్డి (దేవరకద్ర)లతో కలిసి న్యాయవాదుల సమస్యలను సిఎం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తానని వెల్లడించారు. గత ప్రభుత్వం తీసుకొచ్చిన జిఓ నం. 28 కారణంగా ఎదురవుతున్న ఇబ్బందులు పరిష్కరిస్తామని తెలిపారు. అంతకు ముందు ఆయన ఎమ్మెల్యేలతో కలిసి సొసైటీ సిల్వర్ జూబ్లీ సావనీర్ ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో సొసైటీ వ్యవస్థాపక సభ్యులు సునీల్ గాను, అధ్యక్షుడు శ్రీనాథ్, కార్యదర్శి శ్రీధర్ తదితరులు ప్రసంగించారు. సీనియర్ అడ్వొకేట్లు, బార్ అసోసియన్ల ప్రతినిధులు కార్యక్రమానికి హాజరయ్యారు.



# ప్రపంచ కార్టూనిస్టుల దినోత్సవం




నేడు ఏ దినపత్రిక చూసినా, ఏ వారపత్రిక చూసినా, ఏ మాసపత్రిక చూసినా ఏ మ్యాగజైన్ చూసినా ఆబాల గోపాలాన్ని, పండిత, పామరులనందర్నీ ఆకట్టుకునే ఏకైక అంశం 'కార్టూన్'. దీనినే 'వ్యంగ్య చిత్రం' అని కూడా అంటారు. కొన్ని మ్యాగజైన్స్ అయితే ప్రత్యేకంగా పిల్లలను ఆకట్టుకోడానికై కార్టూన్ చిత్రాలతో కూడిన కథలను ప్రచురించి మార్కెట్ పెంచుకొంటూ... లాభాలను గడిస్తున్నాయి. అంటే ఈ కార్టూన్ కళకున్న ప్రాముఖ్యత ఏమిటో తెలుస్తుంది. మే 5 ప్రపంచ కార్టూనిస్టుల దినోత్సవం సందర్భంగా కార్టూన్ ఆవిర్భావం గురించిన కొన్ని విషయాలను తెలుసుకుందాం. కార్టూన్ల చరిత్ర శతాబ్దాల నాటిది, సాధారణ డ్రాయింగ్‌ల నుండి సంక్లిష్టమైన యానిమేషన్‌ల వరకు పరిణామం చెందింది. కార్టూన్‌లు మధ్యయుగ ఐరోపాలో ఉద్భవించాయి, మాన్యుస్క్రిప్ట్‌లు మరియు పుస్తకాల్లో కనిపించాయి. 18వ-19వ శతాబ్దాలలో వార్తాపత్రికలు మరియు మ్యాగజైన్‌లలో వ్యంగ్య చిత్రాలు మరియు వ్యంగ్య డ్రాయింగ్‌లు వెలువడ్డాయి. 20వ శతాబ్ద కాలంలో యానిమేషన్ గా మార్పు చెందాయి. 1914వ సంవత్సరంలో విన్సర్ మెక్‌కే యొక్క "గెర్టీ ది డైనోసార్" మొదటి యానిమేటెడ్ కార్టూన్‌లలో ఒకటిగా పరిగణించబడుతుంది. 1920లు-1960లు కార్టూన్ లకు స్వర్ణ యుగంగా చెప్పుకోవచ్చు. డిస్నీ యొక్క మిక్కీ మౌస్, లూనీ ట్యూన్స్ మరియు టామ్ మరియు జెర్రీ ఐకానిక్‌గా మారాయి.

ఆధునిక యుగంలో 1970వ సంవత్సరం నుండి నేటివరకూ కార్టూన్‌లు వయోజన-ఆధారిత కంటెంట్, కంప్యూటర్ జనరేటెడ్ ఇమేజ్ (సి.జి.ఐ) మరియు ప్రపంచ ప్రభావాలతో వైవిధ్యభరితంగా మారుతూ వస్తున్నాయి. కార్టూన్‌లు సాంస్కృతిక మరియు సాంకేతిక పురోగతిని ప్రతిబింబిస్తూ, తప్పులను విమర్శిస్తూ, ఆలోచింపజేస్తూ సమాజాన్ని అలరిస్తూ ఉన్నాయి.

కార్టూన్లు వివిధ శైలులలో ఉన్నాయి.అవి:

1. సాంప్రదాయ యానిమేషన్: చేతితో గీసిన ఫ్రేమ్-బై-ఫ్రేమ్ యానిమేషన్ (ఉదా., డిస్నీ క్లాసిక్స్).
2. కంప్యూటర్-జనరేటెడ్ ఇమేజరీ డిజిటల్‌గా సృష్టించబడిన యానిమేషన్లు (ఉదా., పిక్సర్ ఫిల్మ్‌లు).
3. 2Dయానిమేషన్: ఫ్లాట్, టూ-డైమెన్షనల్ యానిమేషన్లు (ఉదా., కార్టూన్‌లు, అనిమే).
4. స్టాప్-మోషన్: ఫ్రేమ్-బై-ఫ్రేమ్‌లో మార్చబడిన భౌతిక వస్తువులు (ఉదా., క్లేమేషన్).
5. కారికేచర్: అతిశయోక్తి, హాస్యభరితమైన డ్రాయింగ్‌లు (ఉదా., ఎడిటోరియల్ కార్టూన్‌లు).
6. కామిక్ స్ట్రిప్స్: వరుస దృష్టాంతాలుగారి కథ లేదా జోక్‌ను చెప్పేవి.

భవిష్యత్తులో కొత్త పద్ధతులు ఉద్భవిస్తాయి, కార్టూన్‌లను వైవిధ్యంగా మరియు ఆకర్షణీయంగా వస్తాయి. రాజకీయ, సాంఘిక, సామాజిక, ఆర్థిక రంగాలలోని మంచి విషయాలను, దురాచారాలను, వ్యక్తుల పోకడలను, బలహీనతలను సున్నితమైన రీతిలో సంక్షిప్త చిత్రంలోనే పూర్తి భావాన్ని చూపుతూ, విమర్శనాత్మకంగానూ, వ్యంగ్య ధోరణిలోనూ పత్రికల్లో ముద్రించే చిత్రమే కార్టూన్(వ్యంగ్య చిత్రం). ఈ కళాప్రక్రియ 17-18వ శతాబ్దాలలో యూరప్ ఖండంలో రూపుదాల్చి నేడు ప్రపంచమంతా వ్యాప్తి చెందింది. ఒక వ్యక్తి యొక్క ముఖాకృతినిగాని, శరీరభంగిమలనుగాని వ్యంగ్యాత్మకంగా చిత్రించే పద్ధతిని 'కారికేచర్' అని అంటారు. రిచర్డ్ ఔట్కాల్ట్ అనే కామిక్ చిత్రకారుడు 'ది యెల్లో కిడ్'అనే కామిక్ స్ట్రిప్ ని 'న్యూయార్క్ వరల్డ్' అనే పత్రికలో తొలిసారిగా 1895వ సంవత్సరం మే 5వ తేదీన ముద్రితమైనదని చరిత్ర ద్వారా తెలుస్తుంది. జాతీయ కార్టూనిస్ట్ సొసైటీ 1990లలో కార్టూనింగ్ పరిశ్రమకు మద్దతును ప్రోత్సహించడానికి మరియు సమాజంపై వారు చూపిన ప్రభావాన్ని గుర్తించడానికి ఈ తేదీని 'ప్రపంచ కార్టూనిస్టుల దినోత్సవం' గా ప్రకటించింది. శంకర్ పిళ్ళై భారతీయ తొలి కార్టూనిస్ట్ గా, తెలుగులో తలిశెట్టి రామారావు గారు తొలి కార్టూనిస్ట్ గా గుర్తించబడ్డారు. తరువాత బాపు, ఆర్కే లక్ష్మణ్, సత్య మూర్తి, రాగతి పండరీ, శ్రీధర్, మల్లిక్ మొదలైన వారెందరో ఈ కళకు జీవం పోశారు. ప్రస్తుత టెక్నాలజీ యుగంలో కార్టూన్ లు వివిధ భాషలు, మాటలు నేర్చి, మాట్లాడే కార్టూన్ చలన చిత్రాలు మన ముందుకి వచ్చాయి. అంతే కాకుండా 2డి, 3డి లలో కూడా దర్శనమిస్తున్నాయంటే కార్టూన్ కళ ఎంత శక్తివంతమయినదో చెప్పకనే తెలుస్తుంది. కార్టూన్ కళారంగాన్ని సుందరంగా విహరింపజేస్తున్న కార్టూనిస్టులకు ప్రపంచ కార్టూనిస్టుల దినోత్సవం సందర్భంగా శుభాకాంక్షలు.

**-కొల్లాబత్తుల సూర్య కుమార్**

# నేడు భగీరథ మహర్షి జయంతి

**విశాఖలోని గాజువాకలో రాష్ట్ర స్థాయి జయంతి కార్యక్రమం**

**పాల్గొనున్న రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత**



అమరావతి :మే 3 :(వార్తా ప్రభ ప్రతినిధి) సగరుల కుల దైవం భగీరథ మహర్షి జయంతిని నేడు(,ఆదివారం) రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాల్లోనూ రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహించనుంది. దీనిలో భాగంగా విశాఖలోని గాజువాకలో భగీరథ మహర్షి రాష్ట్ర స్థాయి జయంతి నిర్వహించనున్నారు. ఈ జయంతి కార్యక్రమంలో రాష్ట్ర బీసీ, ఈడబ్ల్యూఎస్ సంక్షేమ శాఖ మంత్రి ఎస్. సవిత పాల్గొననున్నారు. ఈ సందర్భంగా భగీరథుని విగ్రహాన్ని మంత్రి సవిత ఆవిష్కరించనున్నారు. భగీరథ మహర్షి జయంతిని అధికారికంగా నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే ఆదేశాలు జారీచేసిన విషయం విధితమే. ఈ మేరకు రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ కార్యదర్శి ఎస్.సత్యనారాయణ ఉత్తర్వులు జారీచేశారు.

# ఉప్పల్ లో బీజేపీ ర్యాలీ

మేడ్చల్,మే 3 :(వార్తా ప్రభ ప్రతినిధి): ఉప్పల్ కారిడార్ పనులు వేగవంతం చేయడానికి ప్రభుత్వం పై, జిహెచ్ఎంసి పై వత్తిడి పెంచడానికి బిజెపి రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎన్ వి ఎస్ ఎస్ ప్రభాకర్ ఆధ్వర్యంలో ఉప్పల్ లో ర్యాలీ నిర్వహించారు.ఈ సందర్భంగా ఎన్ వి ఎస్ ఎస్ ప్రభాకర్ మాట్లాడుతూ ఉప్పల్ ప్రజలు నన్ను ఎమ్మెల్యేగా ఎన్నుకున్న సందర్భంగా కేంద్రాన్ని ఒప్పించి 600 కోట్ల నిధులతో ఫ్లైఓవర్ను సాంక్షన్ చేయించడం జరిగింది. కానీ అప్పటి బిఆర్ఎస్ ప్రభుత్వం రోడ్డు వెడల్పు చేయించడంలో,బాధితులకు నష్ట పరిహారం చెల్లించే విషయంలో విఫలమైంది అని మండిపడ్డారు. ఇప్పుడున్న కాంగ్రెస్ ప్రభుత్వం కూడా అదే తరహాలో అలసత్వాన్ని ప్రదర్శిస్తూ కారిడార్ పనుల విషయంలో జాప్యం కొనసాగిస్తుంది.

## టిడిపి కార్యకర్త కుటుంబానికి 50వేలు సాయం అందించిన ఎమ్మెల్యే వెనిగండ్ల రాము



**గుడివాడ,మే 3 (వార్తాప్రభ) :** గుడివాడ నియోజకవర్గ పరిధిలోని టిడిపి శ్రేణులంతా నా కుటుంబ సభ్యులేనని.. వారికి పార్టీ తరఫున కాకుండా వ్యక్తిగతంగా అన్ని విధాలుగా అండగా ఉంటానని ఎమ్మెల్యే వెనిగండ్ల రాము పేర్కొన్నారు. గుడివాడ రూరల్ మండలం సిద్ధాంతం రోడ్డులో తాటి ముంజులు కోస్తూ ప్రమాదవశాత్తు మరణించిన.. చౌటపల్లి గ్రామానికి చెందిన హుస్సేన్ మహమ్మద్ కుటుంబ సభ్యులను ఎమ్మెల్యే వెనిగండ్ల రాము శనివారం పరామర్శించారు. ఈ సందర్భంగా హుస్సేన్ చిత్రపటానికి నివాళులర్పించిన ఎమ్మెల్యే రాము.. ఆయన కుటుంబ సభ్యులకు మనోధైర్యం చెబుతూ.. 50వేల వ్యక్తిగత ఆర్థిక సహాయం అందించారు. అనంతరం ఎమ్మెల్యే వెనిగండ్ల రాము మాట్లాడుతూ గత సార్వత్రిక ఎన్నికల్లో కూటమి విజయానికి ఎంతో శ్రమించిన సోదరుడు హుస్సేన్ అకాల మృతి బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు. హుస్సేన్ కుటుంబ సభ్యులకు గుడివాడ తెలుగుదేశం పార్టీ అన్ని విధాలుగా అండగా ఉంటుందని రాము భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఏపీ వేర్ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ రావి వెంకటేశ్వర రావు, జనసేన ఇంచార్జి బూరగడ్డ శ్రీకాంత్, మండల టిడిపి అధ్యక్షుడు వాసే మురళీ, అట్లూరి రమణ ప్రసాద్, వర్రె నాగరాజు, రషీద్ బెగ్, నూర్, భాషా, సర్దార్ పలువురు కూటమి పార్టీల నేతలు పాల్గొన్నారు.

## న్యాయం కోసం రోడ్డు ఎక్కిన యూట్యూబర్ కుటుంబం



**విస్సన్నపేట,మే 3 (వార్తాప్రభ) :** తిరువూరు నియోజకవర్గ పరిధిలో అనుమానాస్పదంగా మృతి చెందిన యూట్యూబర్ వెంపటి మధుమిత కుటుంబ సభ్యులు తమకు న్యాయం చేయాలని గణేష్ సెంటర్ రహదారిపై ధర్నా కార్యక్రమాన్ని చేపట్టారు ట్రాఫిక్ మరియు శాంతి భద్రతలదుష్య పోలీసు సిబ్బంది వారిని తొలగించారు

## బాలికల నైపుణ్యాన్ని పెంచుకునేందుకు వేసవి సెలవులను సద్వినియోగం చేసుకోండి..

● ఐసిడిఎస్ సూపర్వైజర్ బి. శ్యామల గౌరీ



**కృత్తివెన్ను,మే 3 (వార్తాప్రభ) :** కృత్తివెన్ను మండలంలోని ఎండపల్లి అంగన్వాడి సెంటర్ నందు కిషోర్ వికాసం వేసవి సెలవుల కార్యక్రమం ప్రారంభించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్ సూపర్వైజర్ బి శ్యామల గౌరీ మాట్లాడుతూ ఈరోజు నుంచి జూన్ ఆరో తారీకు వరకు ప్రతివారం లో మంగళ ,శుక్ర వారాలు కిషోర్ బాలికలకు మీటింగ్ ఏర్పాటు చేసి, వారిలోని నైపుణ్యాలను, వారు ఆహారం పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి ,బాల్య వివాహాల గురించి అవగాహన కల్పించడం జరుగుతుందని తెలియజేశారు.ఎండపల్లి ప్రభు ప్రసాద్ మాట్లాడుతూ ఈ వయసులో పిల్లలు సరిగా ఆహారం తీసుకోరని ఆహారం తీసుకోకపోతే అనారోగ్యం గురి అవుతారని తెలియజేశారు ఈ కార్యక్రమంలో వివో ప్రెసిడెంట్ ఆశ కార్యకర్త అంగన్వాడీ కార్యకర్తలు శ్రీదేవి రజిని ధనలక్ష్మి కిషోర్ బాలికలు పాల్గొన్నారు.

## శ్రీ కొండలమ్మ అమ్మవారి దేవస్థాన హుండీల లెక్కింపు..



**గుడివాడ,మే 3 (వార్తాప్రభ) :** గుడ్లవల్లేరు మండలం, వేమవరం గ్రామములో వేంచేసియున్న శ్రీ కొండలమ్మ అమ్మవారి దేవస్థానంలోని హుండీలను శనివారం ఉదయం తనిఖీ అధికారి, మచిలీపట్నం కగ్గా శ్రీనివాసరావు, శ్రీ అమ్మ వారి దేవస్థాన కార్యనిర్వహణాధికారి ఆకుల కొండలరావు మరియు గుడ్లవల్లేరు పోలీసు సిబ్బంది సమక్షమున తెరిచి లెక్కించగా మొత్తం 43 రోజులకు గాను రూ.18,91,972-00 అలాగే చిల్లర ద్వారా రూ.1,71,832-00 వెరసి మొత్తము రూ॥ 20,63,804-00 లు వచ్చియున్నది. సదరు హుండీ లెక్కింపు కార్యక్రమములో ఇండియన్ బ్యాంకు సిబ్బంది, సేవా సమితి వారు మరియు దేవస్థాన సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



జన గణనలో కుల గణన కోసం కేంద్ర మంత్రివర్గము నిర్ణయం తీసుకోవటాన్ని హర్షిస్తూ, అందుకు పెద్ద ఎత్తున క్రియాశీలకంగా పనిచేసి,బిజెపి నాయకత్వాన్ని ఒప్పించిన బి.జె.పి.రాజ్యసభ సభ్యులు, జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షులు ఆర్ కృష్ణయ్య ను విద్య నగర్ లోని వారి నివాస గృహంలో సామాజిక విశ్లేషకులు, ప్రముఖ బీసీ నాయకులు జెడ్ వి. గణేష్ యాదవ్ నేతృత్వంలో కలిసి బీసీ సంఘం నేతలు చిరు సన్మానం చేస్తున్న చిత్రం

-హైదరాబాద్,మే 3 (వార్తాప్రభ) :

# ఎండ నుంచి ఉపశమనం.. బాటసారులకు ఉచిత మజ్జిగ పంపిణీ

● గుడివాడ పట్టణంలో పలు చోట్ల ఉచిత మజ్జిగ చలివేంద్రాల ఏర్పాటు..





**గుడివాడ,మే 3 (వార్తాప్రభ) :** వాసవి క్లబ్ గ్రేటర్ బేతవోలు ఆధ్వర్యంలో మజ్జిగ పంపిణీ కార్యక్రమం.. అంతర్జాతీయ అధ్యక్షులు వారి పిలుపుమేరకు అమరజీవి పొట్టి శ్రీరాములు జయంతి సందర్భంగా మొదలైన ప్రతిరోజు వేసవికాలం సందర్భంగా మజ్జిగ పంపిణీ కార్యక్రమం. స్థానిక బేతవోలు పార్క్ ఎదురుగా క్లబ్ ఆధ్వర్యంలో మజ్జిగ పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వాసవి క్లబ్ జిల్లా నాయకులు గాదె మోహన్ బాబు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షులు, కార్యదర్శి కోశాధికారి తదితరులు పాల్గొన్నారు.

**ఎన్టీఆర్ స్టేడియం వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో.. :** ఎన్టీఆర్ స్టేడియం వాకర్స్ క్లబ్ గుడివాడ కార్యదర్శి దిమ్మిటి శ్రీనివాస్ రావు వితరణతో శనివారం క్లబ్ ఆధ్వర్యంలో కెనరా బ్యాంకు వద్ద ఎన్టీఆర్ స్టేడియం కమిటీ జాయింట్ సెక్రటరీ కిలారపు రంగప్రసాద్, 204 వాకర్స్ జిల్లా ఎలక్ట్ గవర్నర్ లోయ ఈశ్వర వెంకటేశ్వరరావు లు ఉచిత మజ్జిగ పంపిణి ప్రారంభించారు. వేసవి తాపం ఉపశమనం కొరకు బాటసారులకు, ఆటో, రిక్షా, ముఠా కార్మికులకు, రైతు బజారు, బ్యాంకు వినియోగ దారుల దాహర్తి తీర్చిన దిమ్మిటి శ్రీనివాస్ కు అభినందనలు తెలియజేసారు. ఈకార్యక్రమంలో అధ్యక్షులు కె. రామారావు, ట్రెజరర్ టి. రాంమోహన్, బొగ్గవరపు తిరపతయ్య, అర్జా ప్రసాద్, సి. డి. రామకృష్ణ, కె. రామకృష్ణ, ఎం. రామకృష్ణ, పి. సత్యన్నారాయణ, కె.శ్రీవిష్ణు, డి. రమేష్, లింగం చిట్టిబాబు, బి. కుటుంబ రావు, కె. సూర్యనారాయణ, బ్రహ్మజి, రూప్ చంద్ జైన్, గ్యాంచంద్ జైన్, మాచర్ల రామకృష్ణ లు పాల్గొని మజ్జిగ పంపిణి చేశారు.

**శ్రీకృష్ణ యాదవ సేవా సంఘం ఆధ్వర్యంలో.. :** శనివారం శ్రీకృష్ణ యాదవ సేవా సంఘం అధ్యక్షులు పుట్టి హరికుమార్ యాదవ్ ఆధ్వర్యంలో పులిపాక లోజ్ఞతా శ్రీ పుట్టినరోజు సందర్భంగా తాత పులిపాక రామ మోహన్ రావు నెహ్రూ చౌక్ సెంటర్ దగ్గర మజ్జిగ పంపిణీ ఏర్పాటు చేశారు. ముఖ్య అతిథులుగా ఎక్సైజ్ డిపార్ట్మెంట్ సర్కిల్ ఇన్స్పెక్టర్ ఆఫ్ పోలీస్ పి వెంకట రమణ, తెలుగుదేశం సీనియర్ నాయకులు మాజీ మున్సిపల్ ప్రతిపక్ష నేత లింగం ప్రసాద్ లు విచ్చేసి మజ్జిగ పంపిణీ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో లాయర్ మోటుపల్లి శ్రీరామ్ ప్రసాద్, నర్రా మనోజ్ చౌదరి, బొగ్గరపు తిరుపతయ్య, జాజుల తాతారావు, జాజుల మునీంద్ర, నర్ని వెంకట రామారావు, కంతేటి హరిబాబు తదితరులు పాల్గొన్నారు.

# అన్యాయాలను ప్రశ్నించడంలో కొడాలి నాని నాయకత్వంలో మేమంతా సిద్ధం..

●గుడివాడ నియోజకవర్గ మైనార్టీ సెల్ అధ్యక్షుడు షేక్ షమ్మును అభినందించిన వైసిపి నేతలు గొర్ల శ్రీను, మండలి లు



**గుడివాడ,మే 3 (వార్తాప్రభ) :** ప్రజలకు జరుగుతున్న అన్యాయాలను ప్రశ్నించడంలో మాజీమంత్రి కొడాలి నాని నాయకత్వంలో తామంతా సిద్ధంగా ఉన్నామని గుడివాడ పట్టణ వైసిపి అధ్యక్షుడు గొర్ల శ్రీను అన్నారు. స్థానిక ఏలూరు రోడ్డులోని ఆయన కార్యాలయంలో గుడివాడ నియోజకవర్గ వైసిపి మైనార్టీ సెల్ అధ్యక్షుడిగా ఇటీవల నియమితులైన షేక్ షమ్మును పట్టణ వైసిపి అధ్యక్షుడు గొర్ల శ్రీను అభినందించారు. ఈ సందర్భంగా గొర్ల శ్రీను మాట్లాడుతూ మాజీ మంత్రి కొడాలి నాని నాయకత్వంలో గుడివాడ నియోజకవర్గంలో వైసిపి తిరిగి పూర్వ వైభవం సాధిస్తుందన్నారు. ఈ క్రమంలో ఇటీవల నియమితమైన కమిటీలన్నీ పార్టీ బలోపేతానికి కొడాలి నాని నాయకత్వంలో, వైసీపీ అధినేత జగన్ ఆదేశాలకు అనుగుణంగా పనిచేస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ వైసీపీ నాయకులు షేక్ బాజీ, మల్లయ్య పాలెం తాజుద్దీన్, మార్కెట్ యార్డ్ మాజీ డైరెక్టర్ షాకీర్, కరిముల్లాబేగ్, కార్మినగర్ నూర్ తదితరులు పాల్గొన్నారు.



**గుడివాడ నియోజకవర్గం యువజన విభాగం అధ్యక్షునిగా ఘంటా సురేష్.. :** గుడివాడ నియోజకవర్గ వైసిపి అనుబంధ విభా గాల అధ్యక్షులను గత రెండు రోజుల క్రితం నియమించింది.. ఇందులో యువజన విభాగం అధ్యక్షునిగా తనను నియమించినట్లు ఘంటా సురేష్ ఒక ప్రకటనలో తెలిపారు. యువజన విభాగం అధ్యక్షునిగా తనకు పదవి రావడానికి కారణమైన మాజీ మంత్రి కొడాలి నాని, పార్టీ సీరియర్ నాయకులు దుక్కిపాటి శశిభూషణ్, మండలి హనుమంతరా వు, పాలేటి చంటి తదితరులకు ఆయన కృతజ్ఞతలు తెలియజేశారు. తనకు ఇచ్చిన పదవినీ గౌరవంగా భావించి కష్టపడి పని చేస్తానని ఎప్పుడూ కార్యకర్తలకు అందుబాటులో ఉంటానని సురేష్ పేర్కొన్నారు.

# నీట్-2025 పరీక్ష నిర్వహణకు పకడ్బందీ ఏర్పాట్లు

● ప్రతి దశలోనూ అప్రమత్తంగా ఉండాలి ● 28 పరీక్షా కేంద్రాలకు ప్రత్యేక అధికారులు ● జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ

**విజయవాడ,మే 3 (వార్తాప్రభ) :** ఈ నెల 4వ తేదీ ఆదివారం నీట్-2025 పరీక్ష నిర్వహణకు పకడ్బందీ ఏర్పాట్లు చేశామని.. అధికారులు ప్రతి దశలోనూ అప్రమత్తంగా వ్యవహరించాలని జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ సూచించారు. వైద్య కళాశాలల్లో అండర్ గ్రాడ్యుయేట్ కోర్సుల్లో ప్రవేశాలకు నిర్వహించే నీట్-2025పై విజయవాడలోని రైతు శిక్షణ కేంద్రంలో శనివారం సెంటర్ సూపరింటెండెంట్లు, అబ్జర్వర్లకు ప్రత్యేక శిక్షణ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా నీట్ పరీక్షను విజయవంతంగా నిర్వహించేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై కలెక్టర్ లక్ష్మీశ సూచనలు చేశారు. జిల్లాలో 13,625 మంది అభ్యర్థులకు 28 కేంద్రాల్లో ఏర్పాట్లు చేయడం జరిగిందని, మధ్యాహ్నం 2 గంటల నుంచి 5 గంటల వరకు జరీక్ష జరుగుతుందన్నారు. అర్హత కలిగిన పీడబ్ల్యూడీ అభ్యర్థులకు సాయంత్రం ఆరు గంటల వరకు అవకాశముంటుందన్నారు. శిక్షణ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకొని ప్రతి అంశంపైనా పూర్తిస్థాయిలో అవగాహన పెంపొందించుకొని, చిన్న పొరపాటుకు కూడా తావులేకుండా విధులు నిర్వర్తించాలన్నారు. పరీక్ష నిర్వహణకు సంబంధించి అధికారులు అడిగిన వివిధ సందేహాలను కలెక్టర్ నివృత్తి చేశారు. సిటీ కోఆర్డినేటర్, సెంటర్ సూపరింటెండెంట్, డిప్యూటీ సెంటర్ సూపరింటెండెంట్, అబ్జర్వర్లు, ఇన్విజిలేటర్లు.. ఇలా ప్రతిఒక్కరూ సమన్వయంతో పనిచేసి ప్రతిష్టాత్మక పరీక్షను విజయవంతంగా నిర్వహించాలని కలెక్టర్ లక్ష్మీశ సూచించారు. విభిన్న ప్రతిభావంతులకు ప్రత్యేక ఏర్పాట్లు, అభ్యర్థుల తనిఖీ ప్రక్రియ, బయోమెట్రిక్ హాజరు, కంట్రోల్ రూమ్ విధులు, సీటింగ్ అరేంజ్‌మెంట్, వీడియోగ్రఫీ, సీల్డ్ కవర్స్, నివేదికలు, కాన్ఫిడెన్షియల్ మెటీరియల్ నిర్వహణ తదితరాలపై శిక్షణ అధికారులు పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా అవగాహన కల్పించారు. కార్యక్రమంలో శిక్షణ అధికారులు ఆదిశేషుశర్మ, వెంకటేశ్వరరావు, విజయవాడ ఆర్‌డీవో కావూరి చైతన్య తదితరులు పాల్గొన్నారు.



# కిశోరి వికాసం.. బాలిక బంగారు భవిష్యత్తుకు పునాది



**గుడివాడ,మే 3 (వార్తాప్రభ) :** గుడివాడ ప్రాజెక్ట్‌లో గుడివాడ - 2 సెక్టార్ లోని అన్ని వార్డులో కిశోరి వికాసం కార్యక్రమం ఈనెల 2వ తేది నుండి జూన్ 10వ తేది వరకు నిర్వహించనున్నారు. ఈ కిశోర వికాసం కార్యక్రమంలో భాగంగా మొదటి రోజు శనివారం "ఒకరికొకరు పరిచయం చేసుకోవడం, లక్ష్యాలు నిర్ధారించుకోవడం" అనే అంశంపై సెక్టారు పరిధిలో ఉన్న వార్డు సంబంధించిన అంగన్‌వాడీ కార్యకర్తలు, ఏఎన్ఎం, ఆశా, ఎంఎస్‌కె లు పాల్గొని కిశోరి బాలికలకు ఈ నెల రోజుల కార్యక్రమం యొక్క వివరాలు తెలియజేసి ప్రతి మంగళవారం, శుక్రవారం రోజులలో అందరూ పాల్గొనాలని అని తెలియజేసారు.



**రామనపూడి అంగన్‌వాడీ కేంద్రంలో.. :** మహిళాభివృద్ధి మరియు శిశు సంక్షేమ శాఖ వారి ద్వారా వివిధశాఖల సమన్వయంతో కిశోరవికాసం కౌమార బాలకల సాధికారత వైపు వేసవి శిబిరాలు ఈనెల 2వ తేదీ నుండి జూన్ 10వ తేది వరకు నిర్వహించనున్నారు. కౌమార బాలికల సమస్యలు గురించి రామనపూడి అంగన్‌వాడీ కేంద్రంలో సూపర్‌వైజర్ ఏడి నసీరున్నీసా అవగాహన కల్పించానారు. ఎం.ఎస్.కె ఎస్.కె ఫరీదాబేగం మాట్లాడుతూ పిల్లల సంరక్షణ, మానవ అక్రమ రవాణ గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో ఎం.ఎస్.ఎస్ పార్వతి, బి. అన్యవతి అంగన్‌వాడీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# రెండో రోజు బీచ్ కబడ్డీ ప్రారంభించిన ఎమ్మెల్సీ నాగబాబు

**కాకినాడ రూరల్,మే 3 (వార్తాప్రభ) :** కాకినాడ రూరల్ ఎమ్మెల్యే పంతం వెంకటేశ్వరరావు (నానాజీ) ఆధ్వర్యంలో సూర్యారావు పేట ఎన్టీఆర్ బీచ్ లో జరుగుతున్న రాష్ట్ర స్థాయి 12వ బీచ్ కబడ్డీ 2వ రోజు పోటీలను జనసేన పార్టీ ప్రధాన కార్యదర్శి,ఎమ్మెల్సీ కొణిదెల నాగేంద్ర బాబు ముఖ్య అతిధులుగా పాల్గొని ప్రారంభించారు.ఈ సందర్భంగా క్రీడా కారులను పరిచయం చేసుకుని వారికి అభినందనలు తెలిపి క్యాంపు ఫైర్ ని వెలిగించారు.





## రైతాంగ ప్రయోజనాలకు ప్రాధాన్యతనిస్తా : ఎమ్మెల్యే రాము

● రూ॥ 32లక్షలతో విన్నకోట మీడియం డ్రైన్ లో జరుగుతున్న పూడికతీత పనులను పరిశీలించిన ఎమ్మెల్యే వెనిగండ్ల రాము..



**గుడివాడ,మే 3 (వార్తాప్రభ) :** గుడివాడ నియోజకవర్గంలో రైతాంగ సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యతనిస్తూ.. వారి అభ్యున్నతికి కృషి చేస్తానని ఎమ్మెల్యే వెనిగండ్ల రాము అన్నారు. గుడ్లవల్లేరు మండలంలో విన్నకోట మీడియం డ్రైన్ లో రూ.32లక్షలతో జరుగుతున్న పూడికతీత పనులను రైతులు మరియు కూటమినేతలతో కలిసి ఎమ్మెల్యే వెనిగండ్ల రాము శనివారం ఉదయం పరిశీలించారు. దశాబ్దాలుగా పరిష్కృతంగా ఉన్న సమస్య పరిష్కరిస్తున్న రాముకు చింతలగుంట, కూరాడ, పురిటిపాడు, విన్నకోట, చిన్నగోన్నూరు, పరిసర ప్రాంతాల రైతులు ధన్యవాదాలు తెలియచేశారు. కూరాడ, విన్నకోట మీడియం డ్రైనేజీలో జరుగుతున్న పూడికతీత పనుల వల్ల 9 కిలోమీటర్ల విస్తీర్ణంలోనీ ఆయికట్టుకు అనేక సమస్యలు తొలగిపోతాయని ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాము అన్నారు. ముఖ్యంగా సీఎం చంద్రబాబు నీటి సంఘాల వ్యవస్థను ప్రవేశపెట్టడంతో గతంలో ఎన్నడూ లేని విధంగా కూటమి ప్రభుత్వంలో సీజన్ కు ముందే కాలువల్లో పూడికతీత, మరియు నీటి ప్రవాహానికి అడ్డుగా ఉన్న సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకున్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఏపీ ఎస్డబ్ల్యుసి చైర్మన్ రావి వెంకటేశ్వరరావు, డ్రైనేజ్ ఏఈ భోగేంద్ర ప్రసాద్, కూటమి నాయకులు నరేంద్ర, బొర్రా ప్రసాద్, బొర్రా మధుసూదన్ మరియు రైతులు పాల్గొన్నారు.

## ప్రతిభగల క్రీడాకారులను ప్రభుత్వం ప్రోత్సహించాలి - వైసీపీ నేత మండలి..



**గుడివాడ,మే 3 (వార్తాప్రభ) :** ఆంధ్ర తెలంగాణ ఉమ్మడి రాష్ట్రాల రెల్లీ కులస్తుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో మంగళగిరిలో జరిగిన అంతర్ రాష్ట్రాల క్రికెట్ పోటీల్లో గుడివాడకు చెందిన రాజ్ సిసి జట్టు సభ్యులు ప్రతిభ చూపి రన్నరప్ గా నిలిచారు. ఈ క్రమంలో ప్రతిభ చూపిన టీం సభ్యులను తన కార్యాలయంలో సీనియర్ వైసీపీ నాయకులు మండలి హనుమంతరావు, కొంకితల ఆంజనేయ ప్రసాద్ లు శనివారం అభినందించారు. ఈ సందర్భంగా మండలి హనుమంతరావు మాట్లాడుతూ ప్రభుత్వ ప్రోత్సాహం లేకపోయినా తమలోని ఆసక్తితో టీం సభ్యులందరూ ఫైనల్ వరకు చేరడమే కాకుండా, చక్కటి ప్రతిభ చూపి సూపర్ ఓవర్ వరకు వెళ్ళిన మ్యాచ్లో కేవలం ఒక్క పరుగు తేడాతోనే ఓడిపోయిన, ప్రతిష్టాత్మకంగా జరిగిన పోటీల్లో క్రీడాకారులు చూపిన ప్రతిభ అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో రాజ్ సిసి క్రికెట్ జట్టు కెప్టెన్ ఆకుల మహేష్, జట్టు ఆటగాళ్లు ధనాల ఫణింద్ర, ముత్యాల రాజేష్, ఫణి లక్కీ , ఎం. చిన్ని తదితరులు పాల్గొన్నారు.

## భూసార పరీక్షలు చేయించుకోవాలి

**ఘంటసాల /అవనిగడ్డ,మే 3 (వార్తాప్రభ) :** ఆచార్య ఎన్.జి రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం పరిధిలోని కృషి విజ్ఞాన కేంద్రం, ఘంటసాల శాస్త్రవేత్తల బృందం దేవరకోట గ్రామం లో మట్టి నమునాల సేకరణ మరియు భుసార పరిక్షల ముఖ్య ఉద్దేశం పై నైపుణ్య ప్రదర్శనలు నిర్వహించారు. ఇందులో భాగంగా సమన్వయకర్త డా. డి. సుధారాణి మాట్లాడుతూ మట్టి నమూన సేకరణ, మట్టి పరిక్షల వలన ఉపయోగం, భూసార పరీక్ష ఆధారిత ఎరువుల వాడకం గురించి వివరించారు. సస్యపోషణ శాస్త్రవేత్త డా. యం. వెంకట లక్ష్మి మాట్లాడుతూ మట్టి పరీక్షలు చెయ్యడం వలన ఉదజని సూచిక, లవణ సూచిక, నత్రజని, బాస్వరం, పోటాష్ మరియు సూక్ష్మ పోషకాలను ఎంత మోతాదులో ఉంటాయో అలాగే సమస్యాత్మక నేలలు గురిచి మట్టి పరిక్ష చేయడం వలన తెలుస్తుంది అని వివరించారు. నైపుణ్య ప్రదర్శనలతో గ్రామంలో మట్టినమునాలు సేకరించడం జరిగింది. కృషి విజ్ఞాన కేంద్రం, ఘంటసాల లో భుసార పరిక్షా కేంద్రం లో భుసార పరిక్షలు జరుగుతునాయి . మట్టి పరిక్షలు చేయించుకోవాలి అనుకున్నవారు కే.వి.కే, ఘంటసాలకు సంప్రదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో రైతులు పాల్గొన్నారు.



## కిషోరీ బాలికల సమ్మర్ క్యాంప్



**కంకిపాడు,మే 3 (వార్తాప్రభ) :** మండల కేంద్రమైన కంకిపాడులో మూడవ సచివాలయం పరిధిలోని 5,7 అంగన్వాడి కేంద్రాల్లో సమ్మర్ క్యాంపులో భాగంగా కిషోరీ బాలికలకు సమ్మర్ క్యాంప్ నిర్వహించారు. సూపర్వైజర్ యెస్.అన్నామని, జి. ఎం. ఎస్. కె రమా పాల్గొన్నారు ఈ సందర్భంగా 11 సంవత్సరాల నుండి 18 సంవత్సరాలు నిండిన పిల్లల్లో హార్మోన్ల మార్పులు గురించి, ప్రత్యుత్పత్తి వ్యవస్థ గురించి, యుక్తవయకులు తీసుకోవాల్సిన వ్యక్తిగత శుభ్రత గురించి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో అంగనవాడి టీచర్లు వై నళిని కుమారి, టి కృష్ణవేణి, డ్వాక్రా, వివోఏలు, ఆశా వర్కర్లు తదితరులు పాల్గొన్నారు. కోలవెన్ను గ్రామ శివారు కోమటిగుంట ఉన్న అంగన్వాడి కేంద్రంలో కిషోర్ బాలికల సమ్మర్ క్యాంపు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఏఎన్ఎం పద్మ, అంగన్వాడి టీచర్ శ్రావ్య, మహిళా పోలీస్ శాంతి కుమారి తదితరులు పాల్గొన్నారు.

